


ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

24-5-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 113 పేజీలు: 10+4 వెల: 8.00


**అమెరికా గ్రీన్ కార్డుకు ట్రంప్ కొత్త నిబంధనలు**

**నల్లకోటు న్యాయవాదుల్లో 40% మంది నకిలీలే!**

5లో

# గోదావరి పుష్కరాలకు వెయ్యి కోట్లు

**జూ. కాలేజీల్లోనూ మధ్యాహ్న భోజనం**

**జూన్ 1న ఇందిరమ్మ ఇళ్లు రెండోవిడత పంపిణీ**

**ఇక మార్క్‌ఫెడ్‌లో డిసిఎంఎస్‌ల విలీనం**

**పాలమూరు- రంగారెడ్డి భూసేకరణకు 587 కోట్లు**

**కేబినెట్ కీలక నిర్ణయాలు వెల్లడించిన మంత్రి పొంగులేటి**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే23:** వచ్చే ఏడాది(2027) జూన్ 26 నుంచి జులై 7వ తేదీ వరకు జరగనున్న గోదావరి పుష్కరాలకు సంబంధించి వివిధ పనులు చేపట్టేందుకు రూ.1000 కోట్ల నిధులను కేటాయిస్తూ రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో తొలి విడతగా రూ.300 కోట్లు మంజూరుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధ్యక్షతన శనివారం సాయంత్రం సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. దాదాపు మూడు గంటలకు పైగా సాగిన మంత్రి వర్గ సమావేశంలో తీసుకున్న కీలక నిర్ణయాలను రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మీడియాకు వివరించారు. రాష్ట్రంలోని అన్ని జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలు చేసేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రభుత్వం పాఠశాలలతో పాటు అన్ని జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకూ ఉదయం అల్పాహారంతో పాటు పాలు అందించాలని కేబినెట్ నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్రంలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. జూన్1న ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత పంపిణీ ప్రారంభం కానుంది. మొత్తం 2 లక్షల 50 వేల మంది పేద కుటుంబాల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రతి నియోజకవర్గానికి 2 వేల చొప్పున ఇళ్లను మంజూరు చేయాలని నిర్ణయించింది. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభించి గోడలు, శ్లాబు దశలో నిలిచిపోయిన వాటిని కూడా పూర్తి చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. పునాదులు పూర్తయి గోడలు, శ్లాబు పడని ఇళ్లకు రూ.3 లక్షలు, గోడలు పూర్తయి శ్లాబు నిలిచిపోయిన ఇళ్లకు రూ.2 లక్షలు చొప్పున అందిస్తాం. అసంపూర్తిగా ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పూర్తి చేసేందుకు నియోజకవర్గానికి 500 ఇళ్లకు చొప్పున నిధులు కేటాయిస్తూ క్యాబినెట్ తీర్మానించింది. తొలి విడతలో నిర్మాణం ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్లలో జూన్ >>2



శనివారం కేబినెట్ నిర్ణయాలు మీడియాకు వెల్లడిస్తున్న మంత్రి పొంగులేటి. చిత్రంలో మంత్రులు వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్



**యాదగిరిగుట్ట అభివృద్ధికి 100 కోట్లు**

**వేద పాఠశాల, దీక్షాపాల మంటపం నిర్మాణాలకు శ్రీకారం**

**కంచి కామకోటి పీఠాధిపతి సమక్షంలో సిఎం రేవంత్ పూజలు**

3లో



## మూడోసారి పెట్రో షాక్

**పెట్రోలు 87 పైసలు, డీజిల్ 91 పైసలు పెంపు**

**పది రోజుల్లో దాదాపు రూ. 5 పెరిగిన ధర**

**ముంబయి,మే 23:** సామాన్య, మధ్య తరగతి ప్రజలపై మరోసారి ఇంధన ధరల భారం పడింది. ప్రభుత్వ రంగ చమురు సంస్థలు ఇవాళ పెట్రోల్, డీజిల్ ధరలను మళ్లీ పెంచాయి. తాజా పెంపుతో పెట్రోల్‌పై లీటర్‌కు 87 పైసలు, డీజిల్‌పై 91 పైసలు పెరిగాయి. దీంతో దేశ రాజధాని ఢిల్లీలో లీటరు పెట్రోల్ ధర రూ. 99.51కి చేరగా, డీజిల్ ధర రూ. 92.49కి చేరుకుంది. గత 10 రోజుల వ్యవధిలో ఇంధన ధరలను పెంచడం ఇది మూడోసారి. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలకారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో పెరిగిన ముడిచమురు ధరల భారాన్ని చమురు కంపెనీలు దశలవారీగా వినియోగదారులకు బదిలీ చేస్తున్నాయి. ఇందులో భాగంగా ఈనెల 15న లీటరుకు ఏకంగా రూ. >>2



శనివారం న్యూఢిల్లీలో ప్రధాని మోదీతో భేటీ అయిన అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో

## కీలక చర్చలు

**ప్రధాని మోడీతో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో భేటీ**

**ఇరాన్ సంక్షోభం ప్రత్యేక ప్రస్తావన**

**న్యూఢిల్లీ, మే 23:** నాలుగు రోజుల భారత పర్యటనకు వచ్చిన అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో శనివారం ప్రధాని మోడీతో భేటీ అయ్యారు. వాణిజ్య, భద్రత సహా కీలక రంగాలపై చర్చలు జరిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ట్రంప్ తరఫున మోడీని వైట్‌హౌస్‌కు ఆహ్వానించారు. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చాక భారత్‌అమెరికా మధ్య వాణిజ్యం విషయంలో విభేదాలు తలెత్తిన విషయం >>2

## జెన్కోకు అంతర్జాతీయ గుర్తింపు

**హైదరాబాద్, మే 23, ప్రభాతవార్త :** తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి సంస్థ జెన్కోకు అంతర్జాతీయ గుర్తింపు లభించింది. ఈ సంస్థ తన నాణ్యతా నిర్వహణ వ్యవస్థలకు ప్రపంచవ్యాప్త గుర్తింపును సాధించింది. ప్రతిష్ఠాత్మకమైన ఐఎస్ఓ 9001:2015 (క్వాలిటీ మేనేజ్‌మెంట్ సిస్టమ్) సర్టిఫికేషన్‌ను సాధించింది. ఈ మేరకు సర్టిఫికేషన్‌ను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేతులమీదుగా విద్యుత్‌శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్‌మిట్టల్ ఆధ్వర్యంలో సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ హరీశ్ అందుకున్నారు. ఒక స్వతంత్ర ఐఎస్ఓ ధ్రువీకరణ సంస్థ నిర్వహించిన సమగ్ర ఆడిట్‌అనంతరం ఈ గౌరవం దక్కింది.

**హైదరాబాద్‌లో దారుణం**

## కారుతో ఢీకొట్టి హైకోర్టు లాయర్ హత్య

**వక్ఫ్ భూముల వివాదాలే కారణమని అనుమానాలు**

**పోలీసుల అదుపులో అనుమానితులు**



హత్యకు గురైన లాయర్ మొయిజుద్దీన్ (ఫైల్), సిసి టివి దృశ్యం

**హైదరాబాద్, (కార్వాన్) మే 23,ప్రభాత వార్త:** హైదరాబాద్‌లో మరో దారుణం వెలుగు చూసింది. హైకోర్టులో న్యాయవాదిగా వున్న మొయిజుద్దీన్ (60)ను గుర్తు తెలియని వ్యక్తులు ఆయన ఇంటి ముందే కారులో ఎక్కుతున్న సమయంలో మరో కారుతో ఢీకొట్టి దారుణంగా హత్య చేశారు. మాసాబ్‌ట్యాంక్ పరిధిలోని శాంతినగర్‌లో న్యాయవాది ఇంటి వద్ద శనివారం తెల్లవారు జామున 5.45 గంటల సమయంలో జరిగిన ఈ ఘటన నగరంలో సంచలనం రేపింది. ఈ హత్యకు వక్ఫ్ భూముల వివాదాలే కారణంగా పోలీసులు అనుమానిస్తుండగా ఇందుకు సంబంధించి కొందరు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. వివరాలు ఇలావున్నాయి. మాసాబ్‌ట్యాంక్‌లోని శాంతినగర్‌లో గల విజయ టవర్స్‌లో వుంటున్న న్యాయవాది మొయిజుద్దీన్ హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. వక్ఫ్ భూముల వివాదాలపై ఆయన అనేక కేసులను వాదిస్తున్నారు. ఈ క్రమంలో ఆయనపై ప్రత్యర్థి వర్గంశతృత్వం పెంచుకుంది. ఈకారణంగా ఆయనను గుర్తు తెలియనివ్యక్తులు పలుమార్లు హెచ్చరించారని తెలిసింది. కాగా శనివారం తెల్లవారు >>2



## వడగాడ్పులకు మరో 16 మంది మృత్యువాత

**హీట్‌వేవ్‌పై రాష్ట్ర వ్యాప్తంగా అప్రమత్తం**

**మృతుల కుటుంబాలకు రూ. 4 లక్షలు పరిహారం : మంత్రి పొంగులేటి**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే23:** ఎండల తీవ్రత దృష్ట్యా అధికార యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా తక్షణ చర్యలు చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. వచ్చే మూడు రోజుల్లో వడగాల్పుల ప్రభావం మరింత పెరగనుందని ఐఎండి హెచ్చరికల నేపథ్యంలో జిల్లా >>2

**219 మండలాల్లో ఎండ నిప్పులు** 2లో

## కేంద్ర ఉద్యోగాల మేళా

**రాష్ట్రంలో 218 మందికి నియామకపత్రాలు అందజేసిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**

**వికసిత్ భారత్ లక్ష్య సాధనకు యువత పాత్ర కీలకం**



శనివారం సికింద్రాబాద్‌లో 218 మంది యువతకు నియామక పత్రాలు అందజేస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,మే23:** నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించడంతో పాటు వారికి సాధికారత కల్పించే దిశగా రోజ్‌గార్ మేళా కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రూపకల్పన చేశారని, 2022 నుంచి ఈ మేళాల ద్వారా లక్షలాది మంది యువతకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు లభించాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా 47 ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 19వ విడత రోజ్‌గార్ మేళా కార్యక్రమం శనివారం సికింద్రాబాద్‌లోని రైల్ కళారంగ్ వేదికగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి హాజరై..కొత్తగా కేంద్ర ప్రభుత్వం లోని ఆరు శాఖల్లో ఉద్యోగాలకు ఎంపికైన >>2

**దేశ వ్యాప్తంగా 51 వేల మందికి**

## అందజేత

**న్యూఢిల్లీ, మే 23:** రోజ్‌గార్ మేళాతో వేలాది కుంటుంబాల్లోని నిరుద్యోగ అభ్యర్థులకు ఇపుడు ఉపాధి లభిస్తోందని, దేశ అభివృద్ధిలో నేటి యువత నిర్మాణాత్మకభూమిక పోషిస్తారని ప్రధాని మోడీఆకాంక్షించారు. శనివారం దేశవ్యాప్తంగా 51వేలమంది ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు నిర్వహించిన 19వ రోజ్‌గార్‌మేళా నుద్దేశించి ఆయన వర్చువల్‌గా ప్రసంగించారు. యువత భాగస్వామ్యంతోనే 2047 వికసిత్ భారత్ సాధించాలమని ఆయన పేర్కొన్నారు. జాతి ప్రగతికి మీరందించే సేవలే కీలకమని నాగరిక్‌దేవోభవ సూత్రాన్ని యువ ఉద్యోగులు విస్మరించకూడదని సూచించారు.

ఇటీవలి ఐదుదేశాల తన పర్యటనలో అనేక మంది ప్రపంచస్థాయి నాయకులు, బహుళజాతి కంపెనీలు కూడా భారత్ వృద్ధి కథానికలో పాలుపంచుకునేందుకు సంసిద్ధత వ్యక్తంచేసారని పేర్కొన్నారు.

## త్వరలో 15,982 అంగన్‌వాడీ పోస్టుల భర్తీ

**మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు**

**హైదరాబాద్, మే 23, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని అంగన్వాడీ కేంద్రాల్లో 15,982 పోస్టుల భర్తీకి ప్రభుత్వం సిద్ధమైంది. ఇందులో అంగన్వాడీ సహాయకుల పోస్టులు 12,882 కాగా, అంగన్వాడీ టీచర్ పోస్టులు 3,100 ఉన్నాయి. ఈ పోస్టుల భర్తీకి సంబంధించి త్వరలో జిల్లాల వారీగా నోటిఫికేషన్లు విడుదలయ్యే అవకాశం ఉంది. దీనికి సంబంధించి ఇప్పటికే ప్రతిపాదనలు ఆమోదం కోసం సిఎం కార్యాలయానికి చేరినట్లు మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులు వెల్లడించారు. కాగా రాష్ట్రంలో 35,781 అంగన్వాడీ కేంద్రాలు ఉండగా, వాటిల్లో 71,562 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. ఇందులో టీచర్లు, వర్కర్లు సమానంగాఉంటారు. గత మూడేళ్లుగా పదవీ విరమణ, సిబ్బందికి సూపర్ >>2



శనివారం పాలిసెట్, ఎల్‌పిసెట్-2026 ఫలితాలు విడుదల చేస్తున్న సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన

## పాలిటెక్నిక్‌లో 5 కొత్త కోర్సులు

**ఈ యేడాది అదనంగా 4,200 సీట్లు**

**59 ప్రభుత్వ పాలిటెక్నిక్‌లు ఎటిఐలుగా అప్‌గ్రేడ్**

**సాంకేతిక విద్యా కమిషనర్ శ్రీదేవసేన**

**హైదరాబాద్, ప్రభాతవార్త, మే 23:** తెలంగాణ రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కాలేజీల్లో భారీ మార్పులు చేయనున్నట్టు సాంకేతిక విద్య శాఖ కమిషనర్ శ్రీదేవసేన తెలిపారు. రానున్న 2026-27 విద్యా సంవత్సరం నుంచి పాలిటెక్నిక్‌లో 5 కొత్త కోర్సులను ప్రారంభించనున్నట్టు తెలిపారు. అదనంగా 4200 సీట్లను ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో పెంచుతున్నట్టు తెలిపారు. శనివారం పాలిసెట్, ఎల్‌పి సెట్-2026 ఫలితాలను మాసబ్‌ట్యాంక్‌లోని సాంకేతిక భవన్‌లో విడుదలచేశారు. అనంతరం కమిషనర్ మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కాలేజీల్లో 80 శాతం సీట్లు భర్తీ అవుతున్నాయనీ.. 100 శాతం సీట్లు భర్తీ అయ్యేలా చర్యలు తీసుకోన్నున్నట్టు తెలిపారు. జూన్ నుంచి ప్రారంభం కానున్న విద్యా సంవత్సరం నుంచి పాలిటెక్నిక్ కోర్సుల్లోని సిలబస్‌లో భారీ మార్పులు చేసినట్టు తెలిపారు. సుమారు 30 నుంచి 40 శాతం సిలబస్‌ను మార్చనున్నట్టు తెలిపారు. ప్రతికోర్సులో 5 రకాల కాంపిటేటీవ్ ఎడ్జ్ ఉండేలాగా సిలబస్‌ను రూపొందించినట్టు తెలిపారు. పాలిటెక్నిక్ ఇంటర్న్‌షిప్, అప్రెంటిషిప్ చేస్తున్న విద్యార్థులకు నెలకు రూ. 9వేల స్టైయిఫెండ్‌ను అందించనుంది. అందులో నేషనల్ అప్రెంటీస్షిప్ ట్రైనింగ్ స్కీం (నాట్స్) నుంచి రూ. 7వేలు అందించనుండగా, రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కార్పస్ ఫండ్‌ను ఏర్పాటు చేసి అందులో నుంచి మరో రూ. 2 వేలు స్టైయిఫెండ్‌ను కలిపి రూ. 9వేలను విద్యార్థులకు అందజేయనుంది. ఇతర రాష్ట్రాల్లోని సంస్థల్లో >>2

**పాలిసెట్‌లో 82.94%, ఎల్‌పి సెట్‌లో 57.28% అర్హత** 6లో

## ఇరాన్‌పై మళ్లీ అమెరికా దాడి!

**దౌత్యయత్నాలు విఫలమైతే సైనిక చర్యకు ట్రంప్ ప్రణాళిక**

**పశ్చిమాసియాలో ముసిరిన యుద్ధమేఘాలు**

**గగనతలం మూసివేసిన ఇరాన్**

**స్తంభించిన శాంతి చర్చలతో పరిస్థితి సంక్లిష్టం**

5లో


## భగ్గుమన్న రాజకీయ కక్షలు

**సూర్యాపేట మండలం యర్కారంలో బిఆర్ఎస్ నేత మధు దారుణ హత్య**

**గోనె సంచిలోకట్టి కల్వర్టువద్ద పడేసిన మృతదేహం**

**ఓ హత్య కేసులో కీలక సాక్షిగా మధు**

3లో



శనివారం కేన్స్ నగరంలో జరుగుతున్న 79వ అంతర్జాతీయ చలనచిత్రోత్సవానికి హాజరైన ఐశ్వర్యరాయ్ బచ్చన్

## మూడోసారి పెట్రో షాక్

>> 3 పెంచగా, మళ్లీ 19న మరో 90 పైసలు పెంచారు. తాజా పెంపుతో కలిపి ఈ 10 రోజుల వ్యవధిలోనే పెట్రోల్, డీజిల్ ధరలు లీటరుకు దాదాపు రూ. 5 మేర పెరిగాయి. ఇక దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లోనూ ధరలు భారీగా పెరిగాయి. కోల్‌కతాలో లీటరు పెట్రోల్ ధర రూ. 110.64, డీజిల్ రూ. 97.02గా ఉంది. ముంబైలో పెట్రోల్ రూ. 108.49, డీజిల్ రూ. 95.02కు చేరింది. చెన్నైలో పెట్రోల్ ధర రూ. 105.31, డీజిల్ ధర రూ. 96.98 వద్ద కొనసాగుతోంది. ఇక తాజా పెంపుతో హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ. 112.81కు చేరగా, లీటర్ డీజిల్‌ధర రూ. 100.94కి పెరిగాయి. విశాఖపట్నంలో లీటర్ పెట్రోల్ ధర రూ. 113.53కు, లీటర్ డీజిల్ ధర రూ. 101.27కి చేరాయి. వరుస పెంపులతో వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## కీలక చర్చలు

>> తెలిసిందే. మరోవైపు ఇరాన్ ఉద్రిక్తతలు కొనసాగుతున్న తరుణంలో ఈ భేటీ జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ చర్చల్లో పాల్గొన్న అమెరికా రాయబారి సెర్గియో గోర్ భేటీ అనంతరం సోషల్‌మీడియా వేదికగా స్పందించారు. ప్రధాని మోడీతో సమావేశం అద్భుతంగా సాగింది. భద్రత, వాణిజ్యం, కీలక సాంకేతిక రంగాల్లో అమెరికా-భారత్ సహకారాన్ని మరింత బలోపేతం చేసే మార్గాలపై ఫలప్రదమైన చర్చలు జరిగాయి. ఈ రంగాలు ఇరు దేశాలను పటిష్ఠం చేయడమే కాకుండా.. స్వేచ్ఛా, బహిరంగ ఇండోపసిఫిక్ రీజియన్‌ను ముందుకు తీసుకెళతాయి. అమెరికాకు భారత్ అత్యంత కీలకమైన భాగస్వామి అని పోస్ట్ చేశారు. ప్రపంచ శాంతి భద్రతలపై చర్చించినట్లు ప్రధాని మోడీ ఎక్స్ వేదికగా వెల్లడించారు. పాకిస్థాన్ మధ్యవర్తిత్వం వహించిన శాంతి చర్చలు విఫలం కావడంతో ఇరాన్‌పై మళ్లీ దాడులు చేయడానికి ట్రంప్ యోచిస్తున్నారనే వార్తల నడుమ ఈ భేటీ జరిగింది. చర్చల్లో భాగంగా ఇరాన్ సంక్షోభం కూడా ప్రస్తావనకు వచ్చినట్లు తెలుస్తోంది. ప్రపంచ శ్రేయస్సు కోసం భారత్, అమెరికా కలిసి పనిచేస్తాయని మోడీ పేర్కొన్నారు.

## 27 కాదు.. 28న బక్రీద్

### తెలుగు రాష్ట్రాల్లో మారిన పండుగ తేదీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే23:** తెలుగు రాష్ట్రాల్లో బక్రీద్(ఈద్ అల్‌అధా) పండుగ తేదీ మారింది. దుల్ హిజ్జా నెలవంక దర్శనం ఆలస్యం కావడంతో మే 28న బక్రీద్ సెలవు దినంగా ప్రకటిస్తూ ప్రభుత్వాలు ఉత్తర్వులు జారీచేశాయి. దీంతో ఆ రోజున అన్ని ప్రభుత్వ కార్యాలయాలు సహా విద్యా సంస్థలు, బ్యాంకులకు సెలవు ఉండనుంది. అయితే.. చంద్రుని దర్శనం ఆధారంగా సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లలో మాత్రం ఈ నెల 27న(బుధవారం) ఈ పండుగను జరుపుకోనున్నారు. తొలుత ప్రకటించిన దాని ప్రకారం.. మే 27న ఉండగా, దానిని మే 28(గురువారం) నాటికి మారుస్తూ ఇరు తెలుగు రాష్ట్రాలు అధికారిక ఉత్తర్వులు జారీచేశాయి. వాస్తవానికి ముస్లింలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే పవిత్రమైనపండుగ బక్రీద్.. ఇస్లామిక్ క్యాలెండర్ లోని చివరి నెల అయిన దుల్‌హిజ్జా 10వ రోజు వస్తుంది. ఆ ప్రకారం ముస్లిం పండుగలు చంద్రదర్శనంపై ఆధారపడి ఉంటాయి. అయితే.. ఈసారి దుల్ హిజ్జా నెలవంక దర్శనం ఒకరోజు ఆలస్యం కావడంతో పండుగ తేదీ మారినట్టు మతపెద్దలు ప్రకటించారు. మైనారిటీ సంక్షేమ శాఖల నుంచి వచ్చిన విజ్ఞప్తులు, సిఫార్సులను పరిశీలించిన ప్రభుత్వం పండుగ సెలవును 28కి మార్చింది. నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ యాక్ట్ 1881 ప్రకారం మే 28న సాధారణ సెలవుదినంగా ప్రకటిస్తూ ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కె.రామకృష్ణారావు శనివారం ఉత్తర్వులు జారీచేశారు. మరోవైపు.. మే 28న సెలవు ఉంటుందని ఆంధ్రప్రదేశ్ లోని చంద్రబాబు ప్రభుత్వం రెండు రోజుల క్రితమే ఉత్తర్వులు జారీచేసింది.

## అంగన్‌వాడీ పోస్టుల భర్తీ

>> వైజర్లుగా పదోన్నతులు, కొందరికి ఇతర విభాగాల్లో శాశ్వత ఉద్యోగాలు రావడంతో భారీగా ఖాళీలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం అంగన్వాడీ కేంద్రాల్లో పనిచేయాల్సిన సిబ్బందికి సంబంధించి 22.33శాతం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పదోన్నతులు, పదవీ విరమణతో 202526 యేడాది నాటికి ఏర్పడిన ఖాళీలను పరిగణలోకి తీసుకుంటూ ఖాళీలను ప్రభుత్వం గుర్తించింది. కొత్త నియామక విధానానికి ఆమోదం లభించిన వెంటనే జిల్లాల వారీగా నోటిఫికేషన్లు వెలువడనున్నాయి. మరోపక్క ఉద్యోగాల భర్తీతో పాటు, అంగన్వాడీ కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్లు, శాశ్వత భవనాలు, ఆరోగ్యం పాట్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టింది. 3,300 కేంద్రాలకు తాగునీటి కనెక్షన్లు, 9వేల కేంద్రాలకు విద్యుత్ కనెక్షన్లు, 7,700 కేంద్రాలకు మరుగుదొడ్ల నిర్మాణం, వెయ్యి కేంద్రాలకు శాశ్వత భవనాలు, 5వేల అంగన్వాడీ కేంద్రాల్లో ఆర్వో ప్లాంట్లు, ఎల్ఇడి స్క్రీన్లు ఏర్పాటుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

## 219 మండలాల్లో ఎండ నిప్పులు

### అర్ధరాత్రిదాకా వడగాడ్పులతో జనం విలవిల

### కుమరంభీం ఆసిఫాబాద్: 46.2, ఖమ్మం : 46.1, ములుగు 46°

**హైదరాబాద్, మే 23, ప్రభాతవార్త:** తెలంగాణలో సూర్యతాపానికి ప్రజలు విలవిలలాడిపోతున్నారు. మండే ఎండలకు తోడు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. వడగాల్పులతో ఏడు జిల్లాల్లో శనివారం 16 మంది మృత్యువాత పడ్డారు. జగిత్యాల జిల్లా ధర్మపురి,కొరుట్ల, ఎండపల్లి, వైరా ఖమ్మం రూరల్‌లో సూర్యపేట్ మోతేములుగు జిల్లా తాడ్వాయి,మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి,తాండూరు 46.3 సెంటిగ్రేడ్‌ల ఉష్ణోగత్ర నమోదైంది. మొత్తం 69 మండలాలలో అత్యంత ఎక్కువ ఎండ వేడిమి నమోదైంది.45 సెం.గ్రే కంటే ఎక్కువ ఊష్ణోగ్రత ఆ మండలాలలో ఉంది. రాత్రి ఎనిమిది వరకు అదే వేడి సూపర్ ఎల్‌నీనోప్రభాతవంతో ఉండటంతో అనేక ంది డీహైడ్రేషన్‌తో బాధపడ్డారని వైద్యుల వద్దకు వెళ్లారని తెలిసింది. తెలంగాణ లోని 219 మండలాలలో వడగాల్పులు అర్ధరాత్రి వరకువీచాయి. తెలంగాణ డెవలప్‌మెంట్ ప్లానింగ్‌సొసైట ఆటోమెటిక్ వెదర్ స్టేషన్‌ల డాటా ప్రకారం కుమురంభీం ఆసిఫాబాద్ లో 46.2, సూర్యాపేటలో 46.2, ఖమ్మంలో 46.1, మంచిర్యాలలో 46.1, ములుగు 46, పెద్దపల్లి 45.9, భూపాలపల్లి 45.7, నల్గొండ 45.7 డిగ్రీలఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాబోయే వారం రోజుల్లో ఉత్తర, తూర్పుతెలంగాణ జిల్లాల్లో 43 నుంచి 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణశాఖ హెచ్చరించింది.

# కేంద్ర ఉద్యోగాల మేళా

>> 218 మంది యువతీయువకులకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. రోజ్‌గార్ మేళాను ఉద్దేశించి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం అన్ని ప్రభుత్వ శాఖలు, పీఎస్‌యూల్లో ఖాళీలు లేకుండా ఉద్యోగాలు భర్తీ చేస్తూ, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పిస్తోందని అన్నారు. ఇప్పుడు దేశ యువతీయువకులు ఉద్యోగార్థులుగా కాకుండా.. ఉద్యోగ సృష్టికర్తలుగా మారుతున్నారని ఆయన పేర్కొన్నారు. అంకుర సంస్థలు సైతం లక్షలాది ఉద్యోగాలను కల్పిస్తున్నాయని, మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం ద్వారా తయారీ రంగంలోనూ పెద్దఎత్తున ఉద్యోగాలు లభిస్తున్నాయని గుర్తుచేశారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ ఉద్యోగం లభించడం ద్వారా 20-30 ఏళ్లు దేశానికి సేవ చేసే అవకాశం లభించినందున, దేశాభివృద్ధి కోసం, ప్రజా సంక్షేమం కోసం అంకితభావం, సేవా దృక్పథంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. తమ కోసం ఎన్నో కష్టాలు పడిన తల్లిదండ్రులను నిరక్ష్యం చేయవద్దని, వారికి వృద్ధాప్యంలో తోడుగా ఉండాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ప్రైవేట్ కంపెనీల్లో కూడా కోట్ల సంఖ్యలో ఉద్యోగాలు వస్తున్నాయని అన్నారు.స్టార్టప్స్, యూనికార్న్లు వల్ల యువత ఉద్యోగాలు అడిగే స్థాయి నుంచి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి వచ్చిందని అన్నారు. రోడ్లు, ఎయిర్‌పోర్టులు, రైల్వేలు, మెట్రోలు, ఇండస్ట్రియల్ కారిడార్లు వంటి ప్రాజెక్టులతో భారీగా ఉపాధి పెరుగుతోందన్నారు. దేశంలో ప్రతి సంవత్సరం రూ.12 లక్షల కోట్ల ఇన్‌ఫ్రా పనులు జరుగుతున్నాయని వివరించారు. ప్రతి లక్ష కోట్ల పెట్టుబడికి 14 నుంచి 15 లక్షల ఉద్యోగాలు వస్తున్నాయన్నారు. యువతను మోడీ వికసిత భారతానికి సూపర్ హీరోలుగా చూస్తున్నారని అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా కోట్ల మంది యువతకు శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. సెమీకండక్టర్లు, స్పేస్, డ్రోన్ టెక్నాలజీలో భారత్ ముందుకు వెళ్తోందన్నారు. చంద్రుడి దక్షిణ ధృవానికి ముందుగా చేరిన దేశం భారత్ అని చెప్పుకొచ్చారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో స్వదేశీ డ్రోన్లు శత్రు క్షిపణులను అడ్డుకున్నాయని అన్నారు. 2047 నాటికి వికసిత భారత్ లక్ష్య సాధనలో యువత పాత్ర కీలకమన్నారు. భారత్ ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని అన్నారు. 2014కు ముందు వందల స్టార్టప్స్ మాత్రమే ఉండగా, ఇప్పుడు 1.2 లక్షలకు పైగా ఉన్నాయన్నారు. మైనింగ్, బొగ్గు రంగాల్లో కూడా మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని యువతకు సూచించారు. మైనింగ్, ఇంజనీరింగ్ వంటి కోర్సులపై యువత దృష్టి సారించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సూచనలు చేశారు. దేశవ్యాప్తంగా ఒకేసారి జరిగిన 19వ విడత రోజ్‌గార్ మేళాను ఉద్దేశించి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వర్చువల్‌గా ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాత్సవ, ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ సిద్ధార్థ్ కటి, సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ డాక్టర్ ఆర్.గోపాలకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

## వడగాడ్పులకు మరో 16 మంది మృత్యువాత

>> కలెక్టర్లు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్రంలో రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, తీవ్ర వడగాల్పుల పరిస్థితుల నేపథ్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం సచివాలయంలో ఉన్నతాధికారులతో అత్యవసర సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా హీట్ వేవ్ పరిస్థితులపై జిల్లాల వారీగా నివేదికలను పరిశీలించి, ప్రజల ప్రాణ రక్షణకు అత్యంత ప్రాధాన్యంతో పనిచేయాలని అధికార యంత్రాంగానికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో జిల్లాల కలెక్టర్ల నివేదిక ప్రకారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నలుగురు, వరంగల్ అర్బన్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో ముగ్గురు చొప్పున జోగులాంబ గద్వాల్, రంగారెడ్డి, సూర్యాపేట జిల్లాల్లో ఒక్కరు చొప్పున ఏడు జిల్లాల్లో 16 మంది వడదెబ్బతో మృతి చెందారని అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై మంత్రి స్పందిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన మేరకు వడదెబ్బ మృతు కుటుంబాలకు నాలుగు లక్షల రూపాయిల చొప్పున నష్ట పరిహారం ఇవ్వాలని ఇందుకు సంబంధించిన ప్రక్రియను త్వరిత గతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ఎండల తీవ్రత అసాధారణ స్థాయికి చేరుకుంటోంది. తీవ్రస్థాయి ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వడగాల్పుల తీవ్రత మరింత పెరిగింది. ఇలాంటి సమయంలో ప్రభుత్వ యంత్రాంగం మరింత అప్రమత్తంగా ఉండాలని ప్రజల ప్రాణాల రక్షణ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికీ తావుండకూడదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న మండలాలు, గ్రామాలను ప్రత్యేకంగా గుర్తించి అక్కడి ప్రజలకు ముందస్తు హెచ్చరికలు పంపాలని మీడియా, సోషల్ మీడియా, గ్రామస్థాయి ప్రకటనల ద్వారా ఎండలపై అప్రమత్తత కల్పించాలని ప్రజలకు అవసరమైన సమాచారం ప్రతి గంటకు చేరేలా చర్యలు తీసుకోవాలని అని అధికారులను ఆదేశించారు.బస్ స్టాండ్లు, మార్కెట్లు, ప్రధాన రహదారులు, కార్మికులు ఎక్కువగా పనిచేసే ప్రాంతాలు, ప్రజలు అధికంగా రాకపోకలు సాగించే చోట్ల చల్లని తాగునీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలి. ఒక్క ప్రాణం కూడా ఎండల కారణంగా ప్రమాదంలో పడకూడదని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణీలు, చిన్నారులు, అనారోగ్యంతో బాధపడుతున్నవారు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసర పరిస్థితులు తప్ప బయటకు రావొద్దని మంత్రి విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ కూలీలు, నిర్మాణ కార్మికులు, రోడ్లపై పనిచేసే కార్మికులకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.వాతావరణ శాఖ తాజా నివేదిక ప్రకారం ఈనెల 26వరకు కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి,ములుగు, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలో ఎండతీవ్రత, తీవ్రమైనఉష్ణోగ్రతలు, వడగాల్పులు కొనసాగుతాయని వాతావరణ శాఖ హెచ్చరించిందని ఈ జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉంటూ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.

## గోదావరి పుష్కరాలకు వెయ్యి కోట్లు

>> రెండు నాటికి దాదాపు లక్ష ఇళ్ల గృహ ప్రవేశాలు జరుగుతాయని మంత్రి వెల్లడించారు. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం కొలారి గ్రామంలో కొలాం ఆదివాసీలకు ప్రభుత్వం కట్టించిన 28 ఇందిరమ్మ ఇళ్లను జూన్ 1వ తేదీన ప్రారంభించాలని నిర్ణయించామని పేర్కొన్నారు. జూన్ 1వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులందరం అక్కడికి వెళ్లి ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. హైదరాబాద్ మహానగరం క్యూర్ పరిధిలోని 24 నియోజకవర్గాల్లో అల్పాదాయ వర్గాల వారి కోసం (ఎల్ఐజి) లక్ష ఇళ్లు నిర్మించి ఇవ్వాలని రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయించింది. క్యూర్ (హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియా) పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల కోసం సుమారు 7లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారని, స్థలాలు ఉన్న 18,500 మందికి ఈ నెలాఖరు వరకు ప్రొసీడింగ్స్ ఇస్తామని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలో వివిధ దఫాలుగా చేసిన సర్వేల ప్రకారం దాదాపు 15 వేల(14,800) కుటుంబాలు గుడిసెల్లో నివాసం ఉంటున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. వెంటనే ఆ కుటుంబాలన్నింటికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందించాలని రాష్ట్ర క్యాబినెట్ తీర్మానించింది. గుడిసెలు లేని ఆదర్శ రాష్ట్రంగా తెలంగాణను నిలపాలని క్యాబినెట్ నిర్ణయించిందని మంత్రి వివరించారు. విద్యుత్ పంపిణీ, మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆర్‌డిఎస్ఎస్‌లో చేరేందుకు తెలంగాణ డిస్కంలు తయారు చేసిన ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని వెల్లడించారు.రాష్ట్రంలోని డిసిఎంఎస్‌లను మార్క్‌ఫెడ్‌లో విలీనం చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది.

టిజిఆర్ఐసి (తెలంగాణ రూరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్)ని హాకాలో విలీనం చేయాలని క్యాబినెట్ నిర్ణయించిందని వెల్లడించారు. పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల పథకం భూ సేకరణ, పునరావాసం, మౌలిక వసతుల సదుపాయాల కల్పనకు రూ.587 కోట్లు కేటాయిస్తూ రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. తెలంగాణను 2030 నాటికి ప్రపంచంలోని టాప్ 5 లైఫ్ సైన్సెస్ హబ్‌లలో ఒకటిగా నిలబెట్టాలన్నది రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం. అందుకే నెక్స్ట్ జనరేషన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026-30ని రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించిందన్నారు. దావోస్‌లో ఈ పాలసీని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి లాంఛనంగా ఆవిష్కరించారని.. ఈ పాలసీ ద్వారా వచ్చే ఐదేళ్లలో 5 లక్షల ఉద్యోగాలతో పాటు 25 బిలియన్ డాలర్ల పెట్టుబడులు ఆకర్షించాలనేది లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి తెలిపారు.

లైఫ్ సైన్సెస్, ఫార్మా, బయోటెక్, మెడికల్ ఇన్నోవేషన్ రంగాల్లో భారీ పెట్టుబడులకు గమ్యస్థానంగా మారుస్తాం. యువతకు పరిశోధన, తయారీ, డిజిటల్ హెల్త్, గ్లోబల్ ఇన్నోవేషన్ రంగాల్లో మంచి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఇప్పటివరకు ఎక్కువగా తయారీ మీద దృష్టి ఉంటే, ఇక నుంచి విలువైన ఇన్నోవేషన్ మీద ఎక్కువ ఫోకస్ పెడతాం.రీసెర్చ్ అండ్ డెవెలప్మెంట్ (ఆర్ అండ్ డి) యూనిట్లను కూడా పరిశ్రమలుగా గుర్తించే విధంగా ఈ పాలసీలో మార్పు తీసుకొస్తున్నామని చెప్పారు.

గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు, గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్లు తెలంగాణకు రావడానికి ఈ పాలసీ ఉపయోగపడుతుందని తెలిపారు. అస్సాం రైఫిల్స్,బిఎస్ఎఫ్, సిఐఎస్ఎఫ్ గ్రూప్ సెంటర్ల ఏర్పాటుకు కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం వెలిది గ్రామంలో 4 ఎకరాలు, చొప్పదండి మండలం రుక్మాపూర్‌లో 5 ఎకరాలు, గన్నేరువరం మండలంలో 5 ఎకరాల కేటాయింపునకు క్యాబినెట్ ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండల కేంద్రంలోని నూతన డిగ్రీ కళాశాలకు 20 రెగ్యులర్ టీచింగ్ పోస్టులు, ఆరు నాన్ టీచింగ్ పోస్టులు, అవుట్సోర్సింగ్ పద్ధతిన 3 పోస్టుల మంజూరుకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం ఫైర్ స్టేషన్ కు 18 పోస్టుల మంజూరు చేస్తూ క్యాబినెట్ ఆమోదంతెలిపిందన్నారు. మీడియా సమావేశంలో పొంగులేటితో పాటు మంత్రులు అడ్లూరి లక్ష్మణ్,వాకిటి శ్రీహరి పాల్గొన్నారు.

## హిల్ట్ పాలసీపై విధివిధానాలు ఖరారు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే23:** హైదరాబాద్‌లోని పారిశ్రామిక వాడల్లోని భూములను మల్టీ-యూజ్ జోన్లుగా మార్చేందుకు ప్రభుత్వం హిల్ట్ పాలసీ విధివిధానాలను విడుదల చేసింది. మంత్రి శ్రీధర్‌బాబు టిజిఐఐసి చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి వీటిని ఆన్‌లైన్‌లో విడుదల చేశారు. వీటిపై సలహాల కోసం టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేస్తామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు.

ఓఆర్ఆర్ పరిధిలో ఉన్న సుమారు 9292 ఎకరాల పరిశ్రమల భూమి మార్పిడి లక్ష్యంగా ఈ పాలసీని రూపొందించారు. కాగా హిల్ట్ పాలసీపై శనివారం సాయంత్రం కేబినెట్ సమావేశంలో ఆమోదం పొందినట్లు తెలుస్తోంది.

### వారం - వర్జ్యం

24-05-2026, అధికజ్యేష్ఠ ఆదివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, రోహిణి కార్తె
నవమి తె.4.31
పూర్వఫల్గుణి రా.2.52
వర్జ్యం : ఉ.11.38-మ.12.30
దు.సా.5.12-సా.6.40
రాహుకాలం - సా.4.30-6.00

### వార్తాఫలం

**మేషం:** పెద్దల బాగోగుల విషయంపై కుటుంబంలో అభిప్రాయ భేదాలు వాగ్వివాదాలు సంభవం.శుభవార్తలు అందుకుంటారు.

**వృషభం:** ప్రత్యక్ష, పరోక్ష సంపాదన పెరుగుతుంది. వాహనం స్వయంగా నడిపే టప్పుడు చాలా జాగ్రత్తలు అవసరం.

**మిథునం:** ఆర్థికంగా సంకట స్థితి కాదు. కావలసిన ధనం, ఇవ్వవలసిన వాళ్ళు సమయానికి అందుబాటులో ఉండవు.

**కర్కాటకం:** చూసేవారికి సన్నిహితులకు, కుటుంబసభ్యులకు, మీ శ్రమ మాత్రమే కనిపిస్తుంది. సమావేశాలలో పాల్గొంటారు.

**సింహం:** దుష్ప్రచారములు శత్రు పీడల మూలముగా కొంత మానసిక ఆందోళనకు అవకాశమున్నది. ఆరోగ్యం జాగ్రత్త.

**కన్య:** విదేశీయానే ప్రయత్నములు, కంప్యూటర్ విద్య మరియు తత్సంబంధమైన వాటికి సఫల సూచనలు గోచరిస్తున్నాయి. వస్త్ర లాభం.

**తుల :** వాణిజ్య ప్రకటనలకు ఇంటర్వ్యూలకు ప్రచురణలకు అనుకూల సమయము. దూరప్రాంత ప్రయాణాలు చేస్తారు.

**వృశ్చికం:** కుటుంబ సభ్యుల ఆరోగ్య విషయములో జాగ్రత్త వహించండి. ముఖ్యమైన డాక్యుమెంట్స్‌పైన సంతకాలు చేస్తారు.

**ధనుస్సు:** వాతావరణ మార్పిడి, స్థలమార్పిడి జరిగే అవకాశముల ఉన్నవి. ఉద్యోగపరంగా బాధ్యతలు పెరుగుతాయి.బంధువుల కలయిక.

**మకరం:** కొత్త మిత్రులతో పరిచయములు అధికముగా ఉంటాయి. కొంతమంది ప్రోత్సాహము ఎంతో చైతన్యమును కలిగిస్తుంది.

**కుంభం:** అతిధి మర్యాదలకు గృహ అవసరములకు విలాస వస్తువులను కొనుటకు అధిక ధనమును ఖర్చుచేస్తారు.

**మీనం:** ధైర్యముతో చేయవలసిన పనిని సఫలము చేయగలుగుతారు. చిన్న పనికీ, పెద్దపనికీ ఒకే విధంగా శ్రమచేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



శనివారం న్యూఢిల్లీ కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా, రాహుల్, ప్రియాంకలతో భేటీ అయిన కేరళం సిఎం విడి సతీశన్

## పాలిటెక్నిక్‌లో 5 కొత్త కోర్సులు

>> చేరిన తెలంగాణ విద్యార్థులకు కూడా అప్రెంటిషిప్ కల్పిస్తారు. రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కాలేజీల్లో ఐదు కొత్త కోర్సులను ప్రవేశపెట్టారు. అయితే ఈ ఐదు అరుదైనవని, దేశంలో ఏ రాష్ట్రంలోను లేవని చెప్పారు. కొత్త ఐదు కోర్సుల్లో.. డిప్లొమా ఇన్ సెమికండక్టర్ టెక్నాలజీ, డిప్లొమా ఇన్ అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్ టెక్నాలజీ, డిప్లొమా ఇన్ సివిల్ ఇంజినీరింగ్ రియల్ ఎస్టేట్ అండ్ వాల్యుయేషన్, డిప్లొమా ఇన్ లాండ్ స్కేప్ డిజైన్, డిప్లొమా ఇన్ మల్టీ మీడియా అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ కోర్సులన్నాయి. డిప్లమా ఇన్ ప్రింటింగ్ టెక్నాలజీ అండ్ డేటా అనలెటిక్స్ కోర్సు నిర్వహణ బాధ్యతలను కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సిఐఐ) నిర్వహించడానికి ముందుకొచ్చిందని కమిషనర్ తెలిపారు. రాష్ట్రంలోని 59 ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలను అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లు (ఎటిసి)గా అభివృద్ధి చేయనున్నామని, ఇందుకోసం రూ. 3వేల కోట్లు ఖర్చుచేయనున్నట్టు కమిషనర్ శ్రీదేవసేన తెలిపారు. పాలిటెక్నిక్ కాలేజీ లెక్చరర్లకు ఐఐటీ హైదరాబాద్ చేత ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాముల్లో శిక్షణనిప్పించాలని నిర్ణయించినట్టు తెలిపారు. కొత్త కోర్సుల బోధనకు ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్ విధానంలో ఇండస్ట్రీ నిపుణుల చేతే పాఠాలు బోధింపచేస్తామన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో మరమ్మతులతోపాటు రంగులేయడానికి రూ.41 కోట్లు కేటాయించినట్టు తెలిపారు. విద్యార్థులకు మంచి ప్లేస్మెంట్స్‌ను కల్పించడం కోసం ఇంటర్న్‌షిప్‌లు కల్పించేందుకు పరిశ్రమ వర్గాలతో చేసుకున్న ఎంవోయులను జూన్ 12న తెలియజేస్తామని కమిషనర్ శ్రీదేవసేన తెలిపారు. రాష్ట్రంలో డిగ్రీలో 11 కొత్త ఎఇడిపి కోర్సులను ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. మూడు సంవత్సరాల డిగ్రీ కోర్సులో చివరి సంవత్సరం మొత్తం ఇంటర్న్‌షిప్‌ను కొనసాగించనున్నట్టు తెలిపారు. మొదటి విడత దోస్త్‌లో ఎఇడిపి కోర్సుల్లో 50 శాతం సీట్లు భర్తీ అయినట్టు తెలిపారు.

## హైకోర్టు లాయర్ హత్య

>> జామున ఐదు గంటలకు ఆయన వాకింగ్, స్విమ్మింగ్ పూర్తి చేసి ఇంటికి వచ్చారు. తిరిగి అత్యవసర పనిమీద బయటకు వెళ్లేందుకు 5.45 గంటల సమయంలో కారులో బయటకు వెళ్లేందుకు కిందకు వచ్చి కారు ఎక్కేందుకు ప్రయత్నిస్తుండగా వెనక నుంచి నంబర్ ప్లేట్‌లేని మరో కారులో వేగంగా వచ్చిన గుర్తు తెలియని దుండగులు మొయిజుద్దీన్‌ను ఢీకొట్టారు. ఈ ఘటనలో ఆయన ఢీకొన్న కారు బైనట్‌పై పడిపోగా ఆ కారు అలాగే ముందుకు దూసుకుపోయింది. కారు బైనట్‌పై పడ్డ మొయినుజుద్దీన్ పది మీటర్ల దూరం వెళ్లాక రోడ్డుకు ఎడమవైపు పడిపోగా ఇదే సమయంలో రోడ్డుపై పెద్దగా శబ్దం రావడంతో అపార్ట్‌మెంట్ వాసులు బయటకు వచ్చారు. రోడ్డుపై మొయిజుద్దీన్ పడి వుండడం గమనించి మొదట రోడ్డు ప్రమాదంగా భావించి ఆయనను వెంటనే కుటుంబ సభ్యులతో కలిసి మొదట మహావీర్ ఆసుపత్రికి తరలించారు. అటు పిమ్మట మరో ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ నాలుగు గంటల తరువాత ఆయన మరణించారు. దీని తరువాత ఆయన కుటుంబ సభ్యులు సిసిటివి ఫుటేజిలను పరిశీలించగా ఇది రోడ్డు ప్రమాదం కాదని, హత్యగా నిర్ధారణకు వచ్చారు. దీనిపై కుటుంబ సభ్యులు వెంటనే నాంపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటన తరువాత పోలీసులు రంగంలో దిగి సిసిటివి ఫుటేజిలను పరిశీలించి మొయిజుద్దీన్‌ది హత్యగా నిర్ధారించారు. ఆయనను కారుతో ఢీకొన్న కారుకు నంబర్ ప్లేట్ లేనప్పటికి ఆ కారు ఆయన ప్రత్యర్థులని నిర్ధారణకు వచ్చారు. ఆ కారు నాంపల్లిలోని ఓ చోట వుంచినట్లు పోలీసులకు సమాచారం అందగా దాని కోసం గాలిస్తున్నారు. ఈ ఘటనలో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

**నా తండ్రి హత్యకు కారణం కాంగ్రెస్ నాయకుడు ఆలంఖాన్:హతుడి కుమారుడి ఆరోపణ**

ఇదిలావుండగా తనతండ్రి మొయిజుద్దీన్ హత్యకు కాంగ్రెస్ నాయకుడు ఆలంఖాన్ కారణమని ఆయన కుమారుడు ఫర్హాన్ ఆరోపించారు. దీనిపై అతను మీడియాతో మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు ఆస్తులను ఆలం ఖాన్, అతడి తండ్రి ఆక్రమించి కాలేజీలు నిర్మించారని వాటి రక్షణ గురించి ఎంతో కాలం నుండి కేసులు వేస్తూ తన తండ్రి వక్ఫ్ బోర్డు ఆస్తులు కాపాడేందుకు కొన్ని దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నాడని తెలిపారు. ఆరు నెలలక్రితం అలంఖాన్ మా ఆఫీసుకు వచ్చి నన్ను బెదిరించి దాడులకు పాల్పడదని తెలిపారు. గతంలో మా ఆఫీసుకువచ్చి మరిదాడులు చేశాడని, మా తండ్రిపై దాడిజరగడం ఇది ఆరవసారని ఫర్హాన్ వివరించారు.

## రాజ్యసభ పిటిషన్లకమిటీ చైర్మన్‌గా రాఘవ్‌ఛద్దా

**న్యూఢిల్లీ, మే 23:** రాజ్యసభ ఎంపి రాఘవ్‌చద్దాకు ఎగువసభలో పిటిషన్ల కమిటీ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఇటీవలే ఆప్‌నుంచి బిజెపిలోకిమారిన ఎంపికి బిజెపి ప్రోత్సాహంఇస్తూ ఈ పదవిని అప్పగించింది. రాజ్యసభ చైర్మన్ సిపి రాధాకృష్ణన్ చైర్మన్‌తోపాటు పది మంది సభ్యులను కూడా ఈ కమిటీలో నియమించారు. ఈనెల 20వ తేదీనే ఈ కమిటీని ఏర్పాటుచేసినట్లు రాజ్యసభ సచివాలయం నోటిఫికేషన్ వెలువరించింది. సభ్యులుగా హర్ష్‌మహాజన్, గులామ్ ఆలీ, శంభుశరన్ పటేల్, మాయాంక్ కుమార్ నాయక్, బీదా మస్తాన్‌రావ్ యాదవ్, జెబీ మాథేర్ హిషమ్, సుభాసిస్ కుంతియా, ర్వాంగ్వారా నర్జారీ, సందోష్‌కుమార్‌లు సభ్యులుగా నియమితులయ్యారు. అలాగే రాజ్యసభ సభ్యురాలు డా.మేనకా గురుస్వామి కార్పొరేట్‌చట్టాల సవరణబిల్లు 2026 జాయింట్ పార్లమెంటరీ కమిటీలో సభ్యురాలిగా నియ మిస్తూ రాజ్య సభ చైర్మన్ రాధాకృష్ణన్ ఉత్తర్వులు జారీచేసారు. అలాగే లోక్‌సభస్పీకర్ ఓంబిర్లాకూడా అరవింద్ గన్‌పత్ సావంత్‌ను కార్పొరేట్‌చట్టాల సవరణబిల్లులో సభ్యుడిగా నిమమించినట్లు నోటిఫికేషన్ విడుదలచేసారు.

## కరీంనగర్‌లో కేంద్ర బలగాల గ్రూప్ సెంటర్‌కు భూమిని కేటాయించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ లేఖ

### అంగీకరించిన రాష్ట్ర ప్రభుత్వం

**హైదరాబాద్,మే23:** కరీంనగర్‌లో కేంద్ర పారా మిలటరీ బలగాలకు సంబంధించి గ్రూప్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చేస్తున్న యత్నాలు కొలిక్కి వచ్చాయి. అస్సాం రైఫిల్స్, బీఎస్ఎఫ్, ఐటీబీపీ, సీఆర్పీఎఫ్ బలగాల గ్రూప్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరుతూ కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సంబంధిత విభాగాల డీజీపీలతో ఇటీవల చర్చలు జరిపారు. రాష్ట్ర ప్రభుత్వం భూమిని కేటాయిస్తే గ్రూప్ సెంటర్ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించవచ్చని ఆయా డీజీపీలు పేర్కొన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకున్న బండి సంజయ్ గత మార్చి 10న కేంద్ర పారా మిలటరీ బలగాల గ్రూప్ సెంటర్ కోసం కరీంనగర్‌లో తగిన స్థలం కేటాయించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాశారు. కేంద్ర మంత్రి లేఖకు సానుకూలంగా స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపాలని సంబంధితశాఖ అధికారులను ఆదేశించింది. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ పంపిన ప్రతిపాదనలను సీసీఎల్ఏకు పంపారు. పరిశీలించిన సీసీఎల్ఏ ఆయా ప్రతిపాదనలను రాష్ట్ర కేబినెట్‌కు పంపింది. శనివారం సాయంత్రం సమావేశమైన రాష్ట్ర మంత్రివర్గం మానకొండూరులోని వెల్దిలో 4ఎకరాలు, చొప్పదండిలోని రుక్మాపూర్‌లో 5 ఎకరాలు గన్నేరువరంలో 5ఎకరాలు వెరసి మొత్తం 14ఎకరాల స్థలాన్ని కేటాయిస్తూ తీర్మానించింది. ఈ నేపథ్యంలో కరీంనగర్‌లో పారామిలటరీ బలగాల గ్రూప్ సెంటర్ ఏర్పాటుపై మరో అడుగు ముందుకు పడ్డట్లయింది.

## గ్రీన్‌కార్డ్ కొత్త నిబంధనలు అన్ని దేశాలకు వర్తించవు: రుబియో

**న్యూఢిల్లీ, మే 23:** అమెరికాలో చట్టబద్ధంగా నివసిస్తున్న వలసదారులు గ్రీన్‌కార్డ్ కోసం తమ దేశాల నుంచే దరఖాస్తు చేసుకోవాలనే కొత్త నిబంధన కేవలం భారతదేశాన్ని మాత్రమే ఉద్దేశించింది కాదని, ఇది ప్రపంచవ్యాప్తంగా అందరికీ వర్తిస్తుందని ఉద్ఘాటించారు. ఇది కేవలం భారత్‌కే కాదు ప్రపంచం మొత్తానికి వర్తిస్తుందని,మా వలస విధానాన్ని మరింత మెరుగుపరచాలని నిర్ణయం తీసుకున్నామని, దీనిని ప్రతి దేశం అర్థం చేసుకుంటుందని నేను భావిస్తున్నట్లు చెప్పారు. గ్రీన్‌కార్డు దరఖాస్తుచేసే అభ్యర్థులు తమ స్వదేశంనుంచి మాత్రమే దరఖాస్తుచేసుకోవాలని అమెరికా వలసలవిభాగం కొత్త నిబంధన తెచ్చిన సంగతి తెలిసిందే. ఈనిబంధనపై రుబియో మాట్లాడుతూ కొన్నేళ్ల కిందట దురదృష్టవశాత్తూ మా దేశం తీవ్రమైన వలస సంక్షోభాన్ని ఎదుర్కొన్నదని రూబియో తెలిపారు. దాదాపు 20 మిలియన్ల మందికిపైగా అమెరికాలోకి చట్టవిరుద్ధంగా ప్రవేశించారని అనేక సందర్భాల్లో గ్రీన్‌కార్డ్ విధానం దుర్వినియోగం జరుగుతోందని, అందుకే ఈ వ్యవస్థను సంస్కరించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఒక వ్యవస్థను సంస్కరించేటప్పుడు అంతరాయాలు, ఇబ్బందులు, అసౌకర్యాలు ఎదురవడం సహజం అన్నారు. ఇదే సమయంలో డొనాల్డ్ ట్రంప్ తరఫున ప్రధాని మోడీని అమెరికాకు రూబియో ఆహ్వానించారు. విద్యార్థులు, పరిశోధకులు, పర్యాటకులు, హెచ్1బి వీసాదారులు సహా తాత్కాలిక వీసా హోల్డర్లపై గణనీయమైన ప్రభావం చూపే అవకాశం ఉంది. సాధారణంగా వీరిలో చాలామంది తమకు ఎంప్లాయర్ లేదా కుటుంబ స్పాన్సర్‌షిప్ లభించిన తర్వాత అమెరికాలోనే ఉంటూ తమ వీసా హోదాను మార్చుకుంటారు. దీర్ఘకాలంలో ఈ విధానం, వ్యవస్థ మరింత స్థిరంగా మారుతుందని రూబియో చెప్పారు.ఇది మరింత లాభదాయకంగా మారుతుందని, అమెరికాకు రావాలనుకునే భారతీయులకు దీర్ఘకాలంలో ఈ వ్యవస్థ మరింత సమర్థవంతంగా మెరుగ్గా పని చేస్తుందని భావిస్తున్నామని అమెరికా విదేశాంగమంత్రి తెలిపారు.

## చంచల్‌గూడ జైలుకు డిప్యూటీ కలెక్టర్ వంశీమోహన్

**హైదరాబాద్, మే 23, ప్రభాతవార్త:** ఆదాయానికి మించి ఆస్తులు కలిగిన కేసులో ఎసిబికి పట్టుబడ్డ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ (అర్బన్ లాండ్ సీలింగ్) మద్రి వంశీమోహన్‌ను శనివారం ఉదయం రిమాండుకు తరలించారు. శుక్రవారం నాడు వంశీమోహన్ ను అక్రమాస్తుల కేసులో ఎసిబి అరెస్టు చేయడం తెలిసిందే. రాత్రి బాగా పొద్దుపోయే వరకు కొనసాగిన సోదాల్లో ఆరు కోట్ల 22 లక్షల రూపా యలకు పైగా ఆస్తులు వెలుగు చూడడం విదితమే. బహిరంగ మార్కెట్లో దీని విలువ 200 కోట్ల రూపాయల వరకు వుంటుందని అధికారులు చెబుతున్నారు. ఈ కేసులో శనివారం ఉదయం వంశీమోహన్‌ను ఎసిబి అధికారులు నాంపల్లి ఎసిబి కోర్టుల న్యాయమూర్తి ఇంట్లో హాజరు పర చగా ఈ కేసును విచారించిన ఆయన నిందితుడికి రెండు వారాల రిమాండు విధించారు. అనంతరం వంశీమోహన్‌ను చంచల్‌గూడ జైలుకు తరలించారు. కాగా వంశీమోహన్ అక్రమాస్తులపై ఎసిబి అధికారులు అంతర్గతంగా విచారణ చేస్తున్నారు. ఈ ఆస్తులను ఆయన ఎలా సంపాదించాడనే దానిపై ఆరా తీస్తున్నారు.

## చికిత్స పొందుతూ బిఎస్సీ విద్యార్థిని మృతి

### వైద్యుల నిర్లక్ష్యమని తల్లిదండ్రుల ఆరోపణ

**హైదరాబాద్ (సికిందరాబాద్), మే 23, ప్రభాతవార్త:** గాంధీ నర్సింగ్ కాలేజీలో బిఎస్సీ చదువుతున్న విద్యార్థిని గాంధీ ఆస్పత్రిలోనే చికిత్స పొందుతూ మృతి చెందింది. సర్జరీ తర్వాత చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచింది. అయితే వైద్యుల నిరక్ష్యం వలనే మృతి చెంది నట్లు కుటుంబసభ్యులు ఆరోపించారు. జియాగూడ, పురానాపూల్‌కు చెందిన వెంకటేష్‌గౌడ్ కుమార్తె పల్లవిగౌడ్(19) గాంధీ నర్సింగ్ కాలే జీలో బిఎస్సీ ఆపరేషన్ థియేటర్(ఓటీ) కోర్సు సెకండియర్ చదువుతోంది. ఛాతీపై కుడివైపు వాపు (గడ్డ) రావడంతో తల్లి సంతోషిగౌడ్‌తో కలిసి ఈనెల 16న గాంధీ ఆస్పత్రిలో వైద్యపరీక్షలు చేయించుకుని 18న అడ్మిట్ కాగా, 19న వైద్యులు సర్జరీ చేశారు. 20వ తేదీ ఉదయం రౌండ్స్‌కు వచ్చిన వైద్యులు పల్లవిగౌడ్‌ను పరీక్షించి ఆపరేషన్ థియేటర్‌కు తీసుకువెళ్లి మరోసారి సర్జరీ చేశారు. ఈసారి కోలుకున్నట్లు కనిపించినప్పటికీ క్రమంగా పరిస్థితి విషమించడంతో క్రిటికల్ కేర్ యూనిట్‌కు తరలించి వైద్యసేవలు అందించారు. చికిత్స పొందుతూ ఈ నెల 22వ తేదీ అర్ధరాత్రి పల్లవి మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కాగా, వైద్యుల నిరక్ష్యం వల్లనే తమ కుమార్తె మృతి చెందిందని తల్లితండ్రులు వెంకటేష్, సంతోషి ఆరోపించారు. జూనియర్లతో సర్జరీ చేయించడంతో మృతి చెందిదని, తమ కుమార్తె ప్రాణాలపై ప్రయోగాలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మృతురాలి తండ్రి వెంకటేష్ గౌడ్ ఫిర్యాదు మేరకు చిలకలగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



పల్లవిగౌడ్ (ఫైల్)

**వైద్యుల నిరక్ష్యం లేదు: ప్రొ.వాణి, గాంధీ సూపరింటెండెంట్**

పల్లవి మృతి బాధాకరమైన ఘటన అని, దీనిలో వైద్యుల నిరక్ష్యం ఎంతమాత్రం లేదని గాంధీ సూపరింటెండెంట్ ప్రొ.వాణి స్పష్టం చేశారు. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి నివేదిక అందించేందుకు ముగ్గురు వైద్యులతో కమిటీని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

## 28 నుండి చర్లపల్లి-తిరుపతి మధ్య

# కొత్త ఎక్స్‌ప్రెస్ రైలు

### రెగ్యులర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ ప్రారంభిస్తున్నట్లు ప్రకటించిన దక్షిణ మధ్యరైల్వే

**హైదరాబాద్ మే 23, ప్రభాతవార్త :** హైదరాబాద్ నుంచి తిరుమల శ్రీవెంకటేశ్వ రస్వామి దర్శనానికి వెళ్లే భక్తులకు రైల్వే శాఖ శుభవార్త చెప్పింది. చర్లపల్లి- తిరుపతి మధ్య రెగ్యులర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలును కొత్తగా ప్రారంభిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. ఈ కొత్త రైలు నల్గొండ-కడప మార్గంలో ప్రయాణిస్తుందని తెలిపింది. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వారికి తిరుపతి చేరుకోవడం సులభమవుతుంది. ఇప్పటివరకు హైదరాబాద్ నుంచి తిరుపతికి పద్మావతి ఎక్స్‌ప్రెస్ వరంగల్-విజయవాడ మార్గంలో, వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ మహబూబ్‌నగర్-గుత్తి మార్గంలో, నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్, వందే భారత్ రైళ్లు నల్గొండ-గుంటూరు మార్గంలో నడుస్తున్నాయి. ఇప్పుడు ప్రవేశపెట్టిన కొత్తరైలు ప్రత్యామ్నాయ మార్గంలో అందుబాటులోకి రానుండటం గమనార్హం. ఈ సర్వీస్ ఈ నెల 28న ప్రారంభం కానుంది. ఇప్పటివరకు చర్లపల్లి-తిరుపతి మార్గంలో ప్రత్యేక రైలుగా నడిచిన సర్వీసును ఇకనుంచి రెగ్యులర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్‌గా కొన సాగిస్తారు. తిరుపతి నుంచి గురువారం సాయంత్రం నాలుగున్నర గంటలకు బయలుదేరి రేణిగుంట, రాజంపేట, కడప, ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు, నంద్యాల, గిద్ద లూరు, మార్కాపురం రోడ్, పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ మీదుగా మరుసటిరోజు ఉదయం 8.25 గంటలకు చర్లపల్లికి చేరుకుం టుంది. అలాగే, చర్లపల్లి నుంచి ప్రతి శుక్రవారం సాయంత్రం 4.20 గంట లకు బయలుదేరి బీబీనగర్, నల్గొండ, మిర్యాల గూడ, నడికుడి, పిడుగు రాళ్ల, మార్కాపురంరోడ్, గిద్దలూరు, నంద్యాల, ప్రొద్దు టూరు, ఎర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట మీదుగా ప్రయా ణించి శనివారం ఉదయం 7.30 గంటలకు తిరుపతి చేరుకోనుంది. ఈ సర్వీసు ఈ నెల 29వ తేదీ నుంచి ప్రారంభం కానుంది.


తెలంగాణ ప్రభుత్వం
దేవాదాయ ధర్మాదాయ శాఖ
శ్రీ గణేష్ దేవాలయము, స్టేషన్ రోడ్, సికింద్రాబాదు,
ఫోన్ నం.: 040- 27701885

**ఇ-టెండరు/సీల్డు టెండరు /బహిరంగ వేలము టెండరు ప్రకటన**

నోటీస్ నం. 03/యస్.జి.టి/2026, తేది: 23.05.2026

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా సదరు దేవాలయములో కొబ్బరికాయలు పూజా సామాగ్రి అమ్ముకొను హక్కు నిమిత్తము ఆసక్తి గల వారి నుండి ఎక్కువ మొత్తములో కోట్ చేయుటకు మరియు సదరు దేవాలయము యొక్క రెడిమెంటల్ బజారులో ఉన్న పాత ఇల్లు కూలగొట్టుటకు దార్లస్ తక్కువ మొత్తములో కోట్ చేయుటకు ఇ-టెండరు/ సీల్డు టెండరు మరియు బహిరంగ వేలము ద్వారా టెండర్లు కోరనైనది. టెండరు వివరములు:1. కొబ్బరికాయలు పూజా సామాగ్రి అమ్ముకొను హక్కు నిమిత్తము ఒక సంవత్సరమునకు అనగా తేది.01.07.2026 నుండి 30.06.2027 వరకు. 2. దేవాలయము యొక్క రెడిమెంటల్ బజారులో ఉన్న పాత ఇల్లు కూలగొట్టుటకు దార్లస్ ఇ-టెండరు/సీల్డు టెండరు మరియు బహిరంగ వేలము ద్వారా టెండర్లు కోరనైనది. ఇ-టెండరులో పాల్గొనుటకు ఆసక్తిగల వారు వివరముల కొరకు www.tender.telangana.gov.in నందు చూడగలరు మరియు పై టెండర్లకు సంబంధించిన షెడ్యూలు ఫారములు దేవస్థాన కార్యాలయము నందు పొందగలరు. తేది.25.05.2026 నుండి 04.06.2026 వరకు సా.5.00గం.ల వరకు పొందవచ్చును. పూర్తి చేసిన టెండరు పాటు ధరావత్తు డి.డి.లతో అతవరి తేది.05.06.2026 మ.1-00గం.లలోపు దేవస్థాన సీల్డు టెండరు డబ్బా నందు వేయవలెను. సీల్డు టెండర్లు తేది.05.06.2026 మ.3-00గం.లకు దేవస్థాన కార్యాలయములో దేవస్థాన కార్యనిర్వహణాధికారి, పర్యవేక్షణాధికారులు మరియు టెండరుదారుల సమక్షములో తెరువబడును. మరియు ఆన్ లైన్ టెండర్ల టెక్నికల్ బిడ్ మ.2.00లకు మరియు ఫైనాన్సియల్ బిడ్ మ.3.00లకు తెరువబడును ఫోన్ నెం: 9491000657 మరియు సం. 94404956334.

సం/-. యం. రామకృష్ణారావు, ఉప కమిషనరు మరియు కార్యనిర్వహణాధికారి,

DIPR.NO. 2958-PP/CL/ADVT/1/2026-27 తేదీ: 23.05.2026



hmda

హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ
4వ అంతస్తు, స్వర్ణజయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట్, హైదరాబాద్
బహిరంగ ప్రకటన, ప్రణాళికా విభాగం

**ఫైల్ నెం: 016650/HMDA/04330/SWFL/SKP2/2026**

సంగారెడ్డి జిల్లా, సంగారెడ్డి మండలం, ఇస్మాయిల్‌ఖాన్‌పేట గ్రామం యొక్క సర్వే నం.లు 145, 146, 166, 169, 170, 171, 173, 174, 175లో ఓపెన్ ప్లాటెడ్‌తో, డ్రాఫ్ట్ లే అవుట్ అనుమతి కొరకు గతంలో M/s లక్ష్మీనరసింహా వెంచర్స్ మరియు డెవలపర్స్ శ్రీ ఎం. పూర్ణచంద్ర శేఖర్, ఎం. నవీతచే ప్రాతినిధ్యం గల వారు 33947.93 చ.మీ. విస్తీర్ణానికి దరఖాస్తు పెట్టుకున్నారు మరియు ఫైల్ నం. 056300/SKP/LT/U6/HMDA/18082022 తేదీ: 04.01.2023 ప్రకారం ఈ కార్యాలయంచే అది అనుమతి పొందింది.

ఇస్మాయిల్‌ఖాన్‌పేట గ్రామం, సంగారెడ్డి మండలం, సంగారెడ్డి జిల్లా వద్ద 33643 చ.మీకు సర్వే నం.లు 145, 146, 166, 169, 170, 171, 173, 174, 175లలో వున్నదానికి ఓపెన్ ప్లాటెడ్ డెవలప్‌మెంట్ అనుమతితో సవరించబడిన-కం-ఫైనల్ లే అవుట్ యొక్క అనుమతి కొరకు M/s లక్ష్మీ నరసింహా వెంచర్స్ మరియు డెవలపర్స్ శ్రీ ఎం. పూర్ణచంద్రశేఖర్, ఎం.నవీతచే ప్రాతినిధ్యం గలవారు యొక్క తేదీ: 29.03.2026 ప్రకారం దరఖాస్తు పెట్టారు.

కాబట్టి సంగారెడ్డి జిల్లా, సంగారెడ్డి మండలం, ఇస్మాయిల్‌ఖాన్‌పేట గ్రామం వద్ద వున్న సర్వే నం.లు 145, 146, 166, 169, 170, 171, 173, 174, 175లలోని సదరు సవరించబడిన-కం-ఫైనల్ లే అవుట్ యొక్క ప్లాట్ యజమానులు/కొనుగోలుదారులు/ అగ్రిమెంట్ హోల్డర్లు వారి అభ్యంతరాలు/సూచనలు లిఖితపూర్వకంగా ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి (15) రోజులలోపుగా ఈ కార్యాలయానికి దాఖలు చేయవచ్చును. పై పీరియడ్‌లో ఎటువంటి అభ్యంతరాలు/సూచనలు రానట్లయితే సంగారెడ్డి జిల్లా, సంగారెడ్డి మండలం, ఇస్మాయిల్‌ఖాన్‌పేట గ్రామం వద్దవున్న సర్వేనం.లు 145, 146, 166, 169, 170, 171, 173, 174, 175లలోని సదరు సవరింపబడిన-కం-ఫైనల్ లే అవుట్ 33643చ.మీ. యొక్క విస్తీర్ణానికి పెట్టుకొన్న దరఖాస్తు యొక్క అభ్యర్థన ఈ కార్యాలయంతో అందుబాటులో ఉన్న మెటీరియల్ పత్రాలపై ఆధారపడి పరిగణింపబడుతుంది.

సం/-. మెట్రోపాలిటన్ కమిషనర్, డైరక్టర్ ప్లానింగ్-II, HMDA తరపున.

DIPR.NO. 2960-PP/CL/ADVT/1/2026-27 తేదీ: 23.05.2026


# యాదగిరిగుట్ట అభివృద్ధికి రూ. 100 కోట్లు

### వేద పాఠశాల, దీక్షాపాల మండపం నిర్మాణాలకు శ్రీకారం

### కంచి కామకోటి పీఠాధిపతి సమక్షంలో వైభవంగా పూజలు

### హైఅలర్ట్, భారీ పోలీస్ బందోబస్తు

**యాదాద్రి భువనగిరి బ్యూరో, యాదగిరిగుట్ట, మే 23 ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం యాదగిరిగుట్టలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో అట్టహాసంగా నిర్వహించిన భూమి పూజ కార్యక్రమంలో పాల్గొని రూ.100 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. వేద పాఠశాల, దీక్షాపాల మండపం, వాయువ్య దిశలో షెడ్లు, మెట్ల మార్గం పైకప్పు నిర్మాణం తదితర పనులకు సంబంధించి జరిగిన ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక వైభవం, అధికారిక హంగులతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సిఎం రాక నేపథ్యంలో యాదగిరిగుట్ట మొత్తం ఉదయం నుంచే పోలీస్ ఆధీనంలోకి వెళ్లింది. ఉదయం 6.30 గంటల నుంచే భారీ సంఖ్యలో భద్రతా సిబ్బంది వైకుంఠద్వారం, పాత బస్టాండ్, తులసి కాటేజీ, కొండపైన టెంపుల్‌సిటీ, కొత్త బస్టాండ్, వాహన పార్కింగ్ ప్రాంతాలు, రింగ్‌రోడ్డు తదితర ప్రాంతాలను తమ నియంత్రణలోకి తీసుకున్నారు. ఉదయం 7 గంటల నుంచే యాదగిరి గుట్టలో హైఅలర్ట్ ప్రకటించి ప్రతి వాహనం, ప్రతివ్యక్తిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సీఎం హెలి కాప్టర్ కొండపై హెలిప్యాడ్ వద్ద దిగుతారని భావించిన అధికారులు, భద్రతా సిబ్బంది ముందస్తు ఏర్పాట్లు చేశారు. అయితే సీఎం రేవంత్ రెడ్డి నేరుగా టెంపుల్‌సిటీకి చేరుకోవడంతో అధికారులు ఒక్కసారిగా అప్రమత్తమయ్యారు. కొండపై ఉన్న అధికారులు హుటాహుటిన టెంపుల్ సిటీకి చేరుకుని సిఎంకు ఘనస్వాగతం పలికారు. కొద్దిసేపు హెలిపాడ్ వద్దనే నిరీక్షించిన సిఎం అనంతరం భూమిపూజ జరిగే ప్రాంతానికి చేరుకున్నారు. భూమిపూజ కార్యక్రమం కోసం దేవస్థానం అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. 200 మంది కూర్చునేలా భారీ షెడ్డును నిర్మించి, వీఐపీలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయ కులు, భక్తులు, సామాన్య ప్రజల కోసం ప్రత్యేక గ్యాలరీలను ఏర్పాటు చేశారు.

ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని తాగునీరు, కూర్చునే సదుపాయాలు, వైద్యసహాయం తదితర ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచే వేదపండితులు చతుర్వేద పారాయణాలతో ఆధ్యాత్మిక వాతా వరణాన్ని సృష్టించారు. వేదఘోషల మధ్య సిఎం రేవంత్‌రెడ్డి కార్య క్రమ ప్రాంగణానికి చేరుకోగా భక్తులు, ప్రజాప్రతినిధులు హర్షధ్వా నాలతో స్వాగతం పలికారు. ఉదయం 9 గంటల 37 నిమిషాలకు కర్కాటక లగ్న పుష్కరాంశ సుముహూర్తంలో భూమిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సాంప్రదాయ దుస్తుల్లో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, డిప్యూటీ చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎంపిలు వేం నరేందర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, భువనగిరి శాసనసభ్యుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు, నకిరేకల్ శాసనసభ్యుడు వేముల వీరేశం, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిఎంఒ కార్యదర్శి శ్రీనివాసరాజు, దేవదాయ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామ య్యర్, దేవాదాయ కమిషనర్ ఎం.హనుమంతరావు, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అక్షాంశ్‌యాదవ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి ఉన్నతాధి కారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. భూమిపూజ కార్యక్రమానికి విజయేంద్ర సరస్వతి స్వామీజీ ప్రత్యేకంగా హాజరై వేదమంత్రోచ్చారణల నడుమ పూజలు నిర్వహించారు. కంచి కామకోటి పీఠానికి చెందిన 200 మంది విద్యార్థులు వేదపారా యణాలతో కార్యక్రమానికి ప్రత్యేక ఆధ్యాత్మిక శోభను తీసుకు వచ్చారు. గణపతి పూజ, కలశ స్థాపన, శంకుస్థాపన, నవగ్రహ పూజలు మంగళవాయిద్యాల నడుమ గంటన్నరపాటు వైభవం గా సాగాయి. సిఎం రాకకు ముందుగానే భూమిపూజ జరిగే ప్రాంతంలో రెండు అడుగుల లోతువరకు తవ్వకాలు పూర్తిచేసి పూజాకార్యక్రమాలకు సిద్ధం చేశారు. అనంతరం చేపట్టనున్న నాలుగు ప్రధాన నిర్మాణాలకు సంబంధించి ప్రత్యేక శిలాఫలకాలను ఏర్పాటుచేశారు. వాటికి విజయేంద్ర సరస్వతి స్వామీజీ చేతుల మీదుగా తిలకందిద్ది ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమం ముగిసిన అనంతరం సిఎం రేవంత్‌రెడ్డి ఆలయ అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహిం చినట్లు సమాచారం. యాదగిరిగుట్టను దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని అధికారులు పేర్కొన్నారు. సిఎం పర్యటన నేపథ్యంలో యాదగిరిగుట్ట పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమలుచేయడంతో కొంతసేపు భక్తులకు ఇబ్బందులు ఎదురైనప్పటికీ, పోలీస్ శాఖ సమన్వయంతో పరిస్థితిని అదుపులో ఉంచింది. మొత్తం కార్యక్రమం ఆధ్యాత్మిక, రాజకీయ, అధికారిక హంగులతో ఘనంగా ముగిసింది.



శనివారం యాదగిరిగుట్టలో వేదపాఠశాలకు శంకుస్థాపన దృశ్యం, చిత్రంలో కంచి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతీస్వామి, సిఎం రేవంత్, మంత్రులు కోమటిరెడ్డి, కొండా సురేఖ

## యాదాద్రిలో హెలిపాడ్ గందరగోళంతో

# అధికార యంత్రాంగం పరుగులు

### కొండ కింద వేచిచూసిన అధికారులు

### గుట్టపై దిగిన సిఎం హెలికాప్టర్

**యాదాద్రి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:** యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా చోటుచేసుకున్న సమన్వయలోపం జిల్లా వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ముఖ్యమంత్రి పర్యటన కోసం భారీ స్థాయిలో ఏర్పాట్లు చేసినప్పటికీ, హెలిపాడ్ విషయంలో స్పష్టమైన సమాచారం అధికారులకు అందకపోవడంతో యాదాద్రిలో కొంతసేపు హైటెన్షన్ వాతావరణం నెలకొంది. ముఖ్యమంత్రి హెలికాప్టర్ ఎక్కడ దిగుతుందనే విషయంలో చివరి నిమిషంలో ఏర్పడిన గందరగోళం అధికార యంత్రాంగాన్ని పరుగులు పెట్టిం చింది. ముందస్తు ఏర్పాట్లు భారీగా.. సీఎం పర్యటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం రెండు రోజుల ముందుగానే విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. కొండ కింద ఉన్న హెలిపాడ్ వద్ద భద్రతా తనిఖీలు నిర్వహించి, సీఎం కాన్వాయ్ కోసం ప్రత్యేక రూట్ మ్యాప్ సిద్ధం చేశారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ పర్యవేక్షణలో వందలాది మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. దేవస్థానం అధికారులు, రెవెన్యూ, పోలీసు, ఆర్టీసీ, విద్యుత్, వైద్య శాఖల అధికారులు అప్రమత్తంగా విధుల్లో నిమగ్నమయ్యారు. సీఎం రాక సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, అధికార పార్టీ నాయకులు కూడా కొండ కింద హెలిపాడ్ వద్దకు చేరుకుని స్వాగతం పలికేందుకు సిద్ధమయ్యారు. ప్రోటోకాల్ ప్రకారం సీఎం హెలికాప్టర్ అక్కడ దిగుతుందని అందరికీ సమాచారం అందడంతో అన్ని ఏర్పాట్లు అదే కేంద్రంగా జరిగాయి.

**ఒక్కసారిగా మారిన పరిస్థితి..**

అయితే నిర్ణీత సమయానికి యాదాద్రికి చేరుకున్న సీఎం హెలికాప్టర్ కొండ కింద కాకుండా టెంపుల్ సిటీపై ఉన్న హెలిపాడ్ వైపు మళ్లింది. కొద్ది సేపటికే అక్కడ ల్యాండ్ కావడంతో అధికారులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. సీఎం హెలికాప్టర్ దిశ మారిందనే సమాచారం మొదట భద్రతా సిబ్బందికి కూడా స్పష్టంగా అందలేదని తెలిసింది. హెలికాప్టర్ పైభాగంలో దిగిందన్న విషయం తెలిసిన వెంటనే కొండ కింద ఉన్న అధికారులు పరస్పరం ఫోన్లు చేసుకుంటూ అసలు పరిస్థితిని తెలుసుకునే ప్రయత్నం చేశారు. కొంతసేపు సీఎం ఎక్కడ దిగారు..? అన్న సందిగ్ధ పరిస్థితి నెలకొంది. కొందరు అధికారులు హెలికాప్టర్ తిరిగి కిందకు వస్తుందని భావించగా, మరికొందరు పైభాగానికి వెళ్లేందుకు హుటాహుటిన ఏర్పాట్లు చేసినట్లు సమాచారం.

**హెలికాప్టర్‌లోనే సిఎం వేచి..**

టెంపుల్ సిటీ హెలిపాడ్ వద్ద సీఎంకు స్వాగతం పలికేందుకు ఎవరూ సిద్ధంగా లేకపోవడం పరిస్థితిని మరింత ఇబ్బందికరంగా మార్చింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన వెంట వచ్చిన మంత్రులు, ఉన్నతాధికారులు దాదాపు పది నిమిషాలకు పైగా హెలికాప్టర్‌లోనే వేచి ఉండాల్సి వచ్చినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న వెంటనే అధికారులు టెంపుల్ సిటీ వైపు పరుగులు తీశారు. కొండ కింద ఉన్న కాన్వాయ్ వాహనాలు, భద్రతా బలగాలు వేగంగా పైభాగానికి చేరుకున్నాయి. తర్వాత సీఎంకు అధికారిక స్వాగతం పలికి ఆలయ కార్యక్రమాలను ప్రారంభించారు.

# ఓటర్లను అక్రమంగా తొలగిస్తే అడ్డుకొంటాం

### కేబినెట్ విస్తరణలో నా జోక్యం ఉండదు

### సిఎంతో నేను కలిసి పనిచేయడం కొందరికి ఇష్టం లేదు

### మీడియాతో 'ఇష్టాగోష్టి'లో పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్

**హైదరాబాద్, మే 23, ప్రభాతవార్త:** ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణలో ఓటర్లను అక్రమంగా తొల గించడానికి ఏదైనా కుట్రలు చేస్తే అడ్డు కొంటామని ప్రతి వయోజనుడికి ఓటు హక్కును కలిగి ఉండేలా చూసేందుకు కాంగ్రెస్ కార్యకర్తను క్షేత్రస్థాయిలో అప్రమత్తతో ఉంటారని పిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ అన్నారు.

గాంధీభవన్‌లో శని వారం విలేఖరులతో ఇష్టాగోష్టిగా ఆయన మాట్లా డుతూ పశ్చిమ బెంగాల్‌లో 31లక్షల ఓట్లు చేర్చి 93 లక్షల ఓట్లు తొలగించారనీ ఇటీవల ఆ రాష్ట్రంలో 30లక్షల ఓట్ల తేడాతో మమతబెనర్జీ పార్టీ ఓడిందని తెలిపారు. ఫ్యూచర్ సిటీ దేశానికే దిక్సూచిగా మారుతుందనీ బిఆర్‌ఎస్‌కు దూరదృష్టి లేదనీ ఆరోపించారు.

హైదరాబాద్ పరిధిని పెంచ లేదు సీటీ విస్తరిస్తే అభివృద్ధి జరుగుతుందనీ అన్నారు. హైదరాబాద్ అభివృద్ధి అవసరం లేదని హరీశ్‌రావు అంటున్నారా? అని ప్రశ్నించారు. తెలంగాణపై కేంద్రం సవితితల్లి ప్రేమ చూపి స్తోందనీ స్టాలిన్ లాగే మేము గత ప్రభుత్వ పథకాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. వర్కింగ్ ప్రెసిడెంట్ల పేర్లను ఎఐసిసికి పంపించాం త్వరలోనే వర్కింగ్ ప్రెసిడెంట్లను ప్రకటిస్తామని తెలిపారు. కేబినెట్ విస్తరణ సీఎం చూసుకుం టారని విస్తరణలో నా జోక్యం ఏముండదనీ తెలిపారు. పిసిసి అధ్యక్షుడి మార్పు విషయంలో అధిష్టానానిదే తుది నిర్ణయం నేను సరైన వ్యక్తిని అనే నాకు పదవి ఇచ్చారనీ తెలి పారు. ఎఐసిసి దృష్టిలో నేను బెస్ట్, కెసి వేణుగోపాల్ నన్ను అనేకసార్లు అభినందిం చారని గుర్తించారు. నేను, సిఎం కలిసి పనిచేయడం కొందరికి మింగు డుపడడం లేదనీ ఆయన ఆవేదన చెందారు. నా పనితీరుని బేరీజు వేయాల్సింది మా ముఖ్య మంత్రి, నా కార్యకర్తలు అని అన్నారు.

# భగ్గుమన్న రాజకీయ కక్షలు

### సూర్యాపేట మండలం యర్కారంలో బిఆర్‌ఎస్ నేత మధు దారుణ హత్య

### గోనెసంచిలో కట్టి కల్వర్టు వద్ద పడేసిన మృతదేహం

### ఓ హత్య కేసులో కీలక సాక్షిగా మధు

**సూర్యాపేట బ్యూరో, ప్రభాతవార్త :** సూర్యాపేట మండలం యర్కారంలో మరోసారి రాజకీయ కక్షలు భగ్గుమన్నాయి. బిఆర్‌ఎస్ పార్టీ జిల్లా నాయకుడు, యర్కారం మాజీ సర్పంచ్ మోనిక భర్త చింతలపాటి మధు (42) దారుణ హత్యకు గురికావడం జిల్లాలో సంచలనంగా మారింది. పాత ఫ్యాక్షన్ విభేదాలు, రాజకీయ కక్షలే ఈ హత్యకు కారణమై ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో మధు సూర్యాపేటలోని తన నివాసం నుంచి పని నిమిత్తం బయటకు వెళ్లాడు. అనంతరం అతను ఫోన్ ఎత్తకపోవడంతో భార్య మోనిక పలుమార్లు సంప్రదించే ప్రయత్నం చేసింది. ఫోన్ అందుబాటులో లేకపోవడంతో ఆమె రూరల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయడానికి ప్రయత్నించగా, ఘటన పట్టణ పరిధికి సంబంధించినదిగా భావించిన పోలీసులు టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. మోనిక టౌన్ పోలీసులను ఆశ్రయించడంతో వారు వెంటనే రంగంలోకి దిగి ఫోన్ సిగ్నల్ ఆధారంగా గాలింపు చర్యలు చేపట్టారు.

ఇదిలా ఉండగా మధు శుక్రవారం సాయంత్రం వరకు పార్టీ కార్యాలయం వద్ద ఉన్నట్లు సమాచారం. అనంతరం సాయంత్రం 6:00 గంటల సమయంలో అతని స్నేహితుడు చింతా సైదులు ఫోన్‌చేసి తాళ్లగడ్డలో తాటిపాముల జానయ్య ఇంటికి రావాలని, కలిసి మద్యం సేవిద్దామని పిలిచినట్లు తెలిసింది. దీంతో మధు అక్కడికి వెళ్లగా, ఇద్దరూ కలిసి మద్యం సేవించినట్లు సమాచారం. కొద్దిసేపటి తర్వాత అక్కడికి చేరుకున్న ప్రత్యర్థులు పదునైన ఆయుధాలతో మధుపై కిరాతకంగా దాడిచేసి హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. హత్య అనంతరం మృతదేహాన్ని గోనె సంచిలో కట్టి సూర్యాపేట-జనగాం రోడ్డులో యర్కారం గ్రామ శివారులోని కల్వర్ట్ వద్ద పడేసినట్లు గుర్తించారు. శనివారం అర్ధరాత్రి తర్వాత పోలీసులు గాలింపు చర్యల్లో భాగంగా కల్వర్ట్ సమీపంలో గోనె సంచిలో ఉన్న మృతదేహాన్ని గుర్తించారు. శనివారం రాత్రి రెండు గంటల సమయంలో పోలీసులు మధు భార్య మోనికకు సమాచారం అందించి సంఘటనా స్థలానికి తీసుకెళ్లారు. అక్కడ మృతదేహాన్ని చూసిన మోనిక అది తన భర్త మధుదేనని గుర్తించింది. అనంతరం పోలీసులు మృతదేహాన్ని సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిమిత్తం మార్చురీలో భద్రపరిచారు. మార్చురీలో ఉన్న మధు మృతదేహాన్ని జిల్లా ఎస్పీ కొత్తపల్లి నరసింహా, మాజీమంత్రి సూర్యాపేట ఎమ్మెల్యే గుంతకల్ల జగదీశ్ రెడ్డి, బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున సందర్శించి కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. మృతుడు మధు గతంలో చనిపోయిన ఒంటెద్దు వెంకన్న హత్య కేసులో ప్రధాన సాక్షిగా ఉన్నాడు.



చింతలపాటి మధు (ఫైల్)

**మధు హత్య కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం**

**మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి**

చింతలపాటి మధు హత్య ఘటనపై మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి తీవ్రఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మధు మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లా డారు. మధు హత్య పూర్తిగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమని, ఈ ఘటనలో పోలీసుల పాత్రపై కూడా అనుమానాలు ఉన్నాయని ఆరో పించారు.

**మధు హత్య కేసును సీరియస్‌గా తీసుకున్నాం : జిల్లా ఎస్పీ నరసింహా**

సూర్యాపేట మండలం ఎర్కారం గ్రామానికి చెందిన చింతలపాటి మధు మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రిలో జిల్లా ఎస్పీ కె. నరసింహ సందర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, మధు కనిపించడం లేదని ఆయన భార్య మోనిక టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో వెంటనే కేసు నమోదు చేసి డీఎస్పీ ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టామని తెలిపారు. యల్కారం స్టేజి సమీపంలోని కల్వర్టు కింద గోనెసంచిలో మృతదేహాన్ని గుర్తించి, కుటుంబ సభ్యులతో ధృవీకరించిన అనంతరం హత్య కేసుగా నమోదు చేసినట్లు చెప్పారు. ఈ కేసును అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్నామని, ఇప్పటికే ఐదు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు కొనసాగిస్తున్నామని వెల్లడించారు.


తెలంగాణ ప్రభుత్వం
రెవిన్యూ (LA) విభాగం

**ఫారం-C**

**ప్రకటన**

(10ఎ మినహాయింపు ఇవ్వబడిన చట్టం యొక్క సెక్షన్ 11 క్రింద)
(నిబంధన 6/12 చూడండి)

గెజిట్ నెం. 95 — తేది: 11.05.2026
కలెక్టరు కార్యాలయం ఫైల్ నెం: G2/1454/2025 — తేది: .04.2026
RDO కార్యాలయం ఫైల్ నెం: I/LA/96/2026 — తేది: .04.2026

ఇది ఇలా ఉండగా తెలంగాణ ప్రభుత్వం/రంగారెడ్డి కలెక్టర్‌గారు రంగారెడ్డి జిల్లా, గండిపేట మండలం యొక్క నార్సింగ్ గ్రామంలోని ఎక.3.33 గుంటల మొత్తం భూమి ప్రజా ప్రయోజనార్థం అనగా అలేఖ్య వద్ద హైదరాబాద్ కోకాపేట్ మెయిన్ రోడ్ వరకు గ్రిడ్ రోడ్ యొక్క కొనసాగింపు కొరకు భూమి సేకరణ, అవసరమైఉందని భావించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం GO.RT.NO 8 మెట్రోపాలిటన్ ఏరియా మరియు అర్బన్ డెవలప్‌మెంట్ (PLG-I) డిపార్ట్‌మెంట్ తేదీ: 02.01.2026 ప్రకారం 21/2017 చట్టం యొక్క సెక్షన్ 10ఎ అనుసరించి ఛాప్టర్ II & III ప్రకారం సామాజిక ప్రభావమదింపుకు మినహాయింపు ఇచ్చింది.

రెవిన్యూ డివిజనల్ అధికారి, రాజేంద్రనగర్ డివిజన్ వారిని చట్టం యొక్క ఏర్పాట్లు అనుసరించి R&R అంశాలకు సంబంధించిన వివిధ కార్యకలాపాలు చేపట్టడానికి ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్‌గా నియమించడమైనది.

అందువలన రంగారెడ్డి జిల్లా, గండిపేట మండలం యొక్క నార్సింగి గ్రామంలో సదరు ప్రాజెక్ట్‌కు ఎక.3.33 గుంటలు viz 1.348 హెక్టార్ల ప్రామాణిక కొలత ఎక్కువ లేదా తక్కువ భూభాగం, దేని సవివర వివరణ ఈ క్రింది విధంగా ఉందో, ఆ భూమి సేకరణ నిమిత్తం ప్రతిపాదించబడింది.

**షెడ్యూలు**

జిల్లా : రంగారెడ్డి — మండలం : గండిపేట — జిల్లా : నార్సింగి

| క్ర. సం. | సర్వే నెం. | టైటిల్ యొక్క రకం | భూమి యొక్క రకం | భూ సేకరణ చేయు విస్తీర్ణం (ఎ.గుం.లో) | అనుభవదారు పేరు మరియు చిరునామా | నరిహద్దులు: ఉత్తరం | దక్షిణం | తూర్పు | పడమర | చెట్లు: రకం | సంఖ్య | నిర్మాణములు: రకం | ప్లింత్ ఏరియా |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 1 | 168 | పట్టా | మెట్ట | 0.20 | ఇంటి స్థలాలు | సర్వేనెం. 168 | సర్వేనెం. 131 | సర్వేనెం. 118 | సర్వేనెం. 167 | - | - | - | - |
| 2 | 167 | పట్టా | మెట్ట | 0.20 | శ్రీ కృష్ణ గోసేవ మండల్ | సర్వేనెం. 169 | సర్వేనెం. 165 | సర్వేనెం. 168 | సర్వేనెం. 166 | - | - | - | - |
| 3 | 169 | పట్టా | మెట్ట | 0.13 | శ్రీ కృష్ణ గోసేవ మండల్ | సర్వేనెం. 175 | సర్వేనెం. 167 | సర్వేనెం. 108 | సర్వేనెం. 170 | - | - | - | - |
| 4 | 129 | పట్టా | మెట్ట | 0.01 | ఎస్.ఆదర్శ్ దేవ్ తండ్రి: లేట్ సురేష్‌బాబు రాహుల్ దేవ్ తండ్రి:లేట్ సురేష్‌బాబు | సర్వేనెం. 119 | సర్వేనెం. 130 | సర్వేనెం. 127 | సర్వేనెం. 131 | - | - | - | - |
| 5 | 120 | పట్టా | మెట్ట | 0.01 | కె ముత్యం రెడ్డి తండ్రి: వెంకటరెడ్డి పోరెడ్డి పద్మావతి తండ్రి: వెంకటేశ్వరరెడ్డి బండ సుజీవన్‌రెడ్డి తండ్రి: బండ యాదగిరిరెడ్డి ముదిరెడ్డి అశోక్ రెడ్డి తండ్రి: ముదిరెడ్డి రంగారెడ్డి దాడి శ్రీనివాస్ రెడ్డి తండ్రి: ధర్మా రెడ్డి | సర్వేనెం. 122 | సర్వేనెం. 127 | సర్వేనెం. 121 | సర్వేనెం. 119 | - | - | - | - |
| 6 | 102 | పట్టా | మెట్ట | 0.16 | ఇంటి స్థలాలు | సర్వేనెం. 103 | సర్వేనెం. 123 | సర్వేనెం. 101&100 | సర్వేనెం. 114 | - | - | - | - |
| 7 | రోడ్ | పట్టా | మెట్ట | 0.02 | రోడ్ | సర్వేనెం. 96 | సర్వేనెం. 102&101 | సర్వేనెం. 96 | సర్వేనెం. 102 | - | - | - | - |
| 8 | 123 | పట్టా | మెట్ట | 0.02 | ఇంటి స్థలాలు | సర్వేనెం. 102 | సర్వేనెం. 124 | సర్వేనెం. 124 | సర్వేనెం. 122 | - | - | - | - |
| 9 | 122 | పట్టా | మెట్ట | 0.13 | ఇంటి స్థలాలు | సర్వేనెం. 116 | సర్వేనెం. 121 | సర్వేనెం. 123 | సర్వేనెం. 120 | - | - | - | - |
| 10 | 116 | పట్టా | మెట్ట | 0.19 | జి.ప్రకాష్ తండ్రి: వైకుంఠం | సర్వేనెం. 114 | సర్వేనెం. 122 | సర్వేనెం. 102 | సర్వేనెం. 115 | - | - | - | - |
| 11 | 114 | పట్టా | మెట్ట | 0.02 | ఇంటి స్థలాలు | సర్వేనెం. 103 | సర్వేనెం. 116 | సర్వేనెం. 102 | సర్వేనెం. 108 | - | - | - | - |
| 12 | 115 | పట్టా | మెట్ట | 0.08 | ఇంటి స్థలాలు | సర్వేనెం. 108 | సర్వేనెం. 118 | సర్వేనెం. 116 | సర్వేనెం. 168 | - | - | - | - |
| 13 | 108 | పట్టా | మెట్ట | 0.09 | ఇంటి స్థలాలు | సర్వేనెం. 107 | సర్వేనెం. 115 | సర్వేనెం. 106&112 | సర్వేనెం. 169 | - | - | - | - |
| 14 | 118 | పట్టా | మెట్ట | 0.02 | ఇంటి స్థలాలు | సర్వేనెం. 115 | సర్వేనెం. 129 | సర్వేనెం. 119 | సర్వేనెం. 168 | - | - | - | - |
| 15 | 124 | పట్టా | మెట్ట | 0.12 | ఇంటి స్థలాలు | సర్వేనెం. 123&99 | సర్వేనెం. 125&126 | సర్వేనెం. 89 | సర్వేనెం. 121&122 | - | - | - | - |
| 16 | 119 | పట్టా | మెట్ట | 0.06 | ఇంటి స్థలాలు | సర్వేనెం. 117 | సర్వేనెం. 128 | సర్వేనెం. 120 | సర్వేనెం. 118 | - | - | - | - |
| 17 | 121 | పట్టా | మెట్ట | 0.07 | ఇంటి స్థలాలు | సర్వేనెం. 122 | సర్వేనెం. 127 | సర్వేనెం. 124 | సర్వేనెం. 120 | - | - | - | - |
| | మొత్తం | | | ఎ.3.33 | | | | | | | | | |

ఇట్టి ప్రకటన భూసేకరణ పునరావాస పునరుపాధి కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013 (కేంద్ర చట్టం నం.30/2013) యొక్క సెక్షన్ 11(1) యొక్క ఏర్పాట్లు క్రింద హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు మరియు భూసేకరణలో పారదర్శకత, పునరావాస మరియు పునరుపాధి చట్టంచే సవరింపబడిన విధంగా (తెలంగాణ సవరణ) చట్టం, 2016 (2017 యొక్క చట్టం నం.21) సంబంధించిన వారి అందరికీ ఈ ప్రకటన జారీ చేయడమైనది.

సదరు భూమి యొక్క ప్లాన్‌ను జిల్లా కలెక్టర్ మరియు మేజిస్ట్రేట్ రంగారెడ్డి జిల్లా వారి కార్యాలయంలో ఏదేని పని దినమున పని వేళలలో తనిఖీ చేసుకొనవచ్చును.

సదరు చట్టం యొక్క సెక్షన్-12లో నిర్దేశించబడిన మరియు సమకూర్చబడిన విధంగా వారి పని సక్రమంగా అమలు చేయుటానికి అవసరమైన అన్ని ఇతర పనులు చేయుటానికి మరియు సబ్-సాయిల్‌లోనికి బోర్ లేదా త్రవ్వడం ఏదైనా భూమి యొక్క లెవెల్స్ తీసుకోవటం, భూమి సర్వే మరియు అందులో ప్రవేశానికి రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ డివిజన్, రెవిన్యూ డివిజనల్ అధికారి మరియు వారి సిబ్బందికి అధికారం ఇవ్వటానికి తెలంగాణ ప్రభుత్వం/ కలెక్టర్-కం-యుక్తమైన ప్రభుత్వం సంతోషంతో సమ్మతిస్తోంది.

చట్టం యొక్క 11(4) సెక్షన్ అనుసరించి కలెక్టర్ గారి ముందస్తు అనుమతి లేకుండా సదరు ప్రకటన ప్రచురణ యొక్క తేదీ నుండి సదరు భూమిపై చిక్కులు సృష్టించటం లేదా క్రయ/విక్రయాలు అనగా భూమి యొక్క ఎటువంటి వ్యవహారాలు కారణం లేదా లావాదేవీలు ఏ వ్యక్తి కూడా చేయకూడదు.

భూసేకరణ వల్ల ఏవైనా అభ్యంతరాలు మరియు క్లైములు ఆసక్తి/ప్రభావం, సంప్రదింపులచే పరిహారం యొక్క పరిష్కారం కోరే అందరు వ్యక్తులు భూమిపై ఆసక్తి గల వ్యక్తులు చట్టం యొక్క సెక్షన్ 15 క్రింద ఏర్పాటు అయిన విధంగా ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి (60) రోజులలోపు తమ ఆక్షేపణలను జిల్లా కలెక్టర్/అధీకృత అధికారి వారి సమక్షంలో దాఖలు చేయవలెనుయజమానులు లేదా ఆసక్తి గల వ్యక్తులు సేకరణకు స్వచ్ఛందంగా అంగీకరించదలచిన వారు, వారి దరఖాస్తు ఈ ప్రకటన ప్రచురణ అనంతరం ఫారం Eలో దాఖలు చేయవచ్చును.

సం/-. తహసిల్దార్ గండిపేట (M) — సం/-. RDO/LAO రాజేంద్రనగర్ డివిజన్ — సం/-. అడిషనల్ కలెక్టర్ (రెవిన్యూ)రంగారెడ్డి జిల్లా — సం/-. జిల్లా కలెక్టర్ రంగారెడ్డి జిల్లా

DIPR RO.NO: 240/LA/PP/Advt/Pub/2026-27

# ఎల్‌నినో సూపర్ ఎల్‌నినోగా మారనుందా?

**రాచమల్ల భోగేశ్వర్ రెడ్డి**

వాతావరణ ఉష్ణోగ్రతల్లో ఏర్పడుతున్న పరిస్థితులు ఆధారంగా ఎల్‌నినో ప్రభావం ఎక్కువ వర్షాభావ ప్రాంతంగా గుర్తింపు ఉన్న రాయలసీమ జిల్లాలపై తీవ్రంగా పడుతుందా అన్నది రైతుల్లో ఆందోళన నెలకొంది. ఎల్‌నినో రాబోయే రోజుల్లో సూపర్ ఎలిమినోగా మారే అవకాశం లేకపోలేదని కొందరు శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో రాయలసీమ జిల్లాలపై ఆ ప్రభావం ఏ మేరకుఉంటుంది. నిజంగానే ఎల్‌నినో ప్రభావం ఉంటుందని అనుకుంటే ఎలాంటి పంటలు సాగు వేసుకోవాలి? అందుకు ముందస్తుగా చర్యలేం తీసుకోవాలన్నది సీమరైతుల్లో బలంగా చర్చ సాగుతోంది. ఎల్‌నినో ప్రభావం దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలపై ఏదో విధంగా ప్రభావం చూపే అవకాశం ఉన్నప్పటికీ వర్షాభావ ప్రాంతమైన రాయలసీమ జిల్లాలపై ఇంకా ఎక్కువ చూపే అవకాశం ఉందని రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతుంది. రాయలసీమ జిల్లాల్లో దాదాపు 34 లక్షల హెక్టార్ల సాగు భూమి 85 లక్షల ఎకరాల భూమి ఉంది. ఇందులో అనంతపురం శ్రీసత్యసాయి జిల్లాల్లో దాదాపు పది లక్షల హెక్టార్ల సాగు భూమి, కర్నూలు నంద్యాల జిల్లాల్లో ఆరు నుంచి ఏడు లక్షలు ఎట్టాల సాగు భూమి, వైయస్సార్ కడప జిల్లాలో నాలుగు లక్షల హెక్టార్ల సాగు భూమి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో దాదాపు 3.9 లక్షలు హెక్టార్ల సాగు భూమి ఉంది. రాయలసీమ జిల్లాల్లో 15 నుంచి 20 శాతం భూములకు మాత్రమే చెరువులు, కాలువల ద్వారా శాశ్వత సాగునీరు అందుతుంది. దీంతో 80 శాతం సాగు భూములకు వర్షాధారంగా మెట్ట పంటలపైనే రైతులు ఆధారపడతారు. ఈ పరిస్థితుల్లో ఎల్‌నినో ప్రభావం వల్ల వచ్చే ఖరీఫ్‌సీజన్లో వర్షపాత పరిస్థితులు ఎలా ఉంటాయో అన్నది సీమ రైతుల్లో ఆందోళన నెలకొంది. ఇప్పటికే అనంతపురం శ్రీ సత్యసాయి లాంటి జిల్లాల్లో పలు మండలాల్లో భూగర్భ జలాలు పలు మండలాల్లో ఆందోళనకర పరిస్థితిలో ఉన్నాయి. వర్షాభావ పరిస్థితుల వల్ల గతంలో ఎన్నో కరవు కాటకాలను సీమ ప్రజలు ఎదుర్కొన్నారు. గత రెండు దశాబ్దాల కాలాన్ని పరిశీలిస్తే రాయలసీమ జిల్లాలో 2002-2003, 2004-2005, 2009-2010, 2011-2012, 2014-2015, 2018-2019 సంవత్సరాల్లో కరవులు వచ్చినట్లు గత పాలక ప్రభుత్వాలు కూడా గుర్తించాయి. ఈ పరిస్థితుల్లో ప్రస్తుతం వాతావరణంలో వస్తున్న మార్పులు వల్ల ఎల్‌నినో సూపర్ ఎల్‌నినోగా మారుతూ వస్తే సీమ ప్రజల ముఖ్యంగా రైతుల పరిస్థితి ఏంటి అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. సామాజిక మాధ్యమాల్లో వస్తున్న చర్చ వల్ల



రానున్న వర్షకాలంలో మన ప్రాంతంలో ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉంటుందా? ఆమె రైతులు ఎక్కడ చూసినా చర్చించుకుంటున్నారు. ఇప్పటికే ఫసిఫిక్ మహా సముద్రంలో నెలకొంటున్న వాతావరణ మార్పులను బట్టి ప్రపంచ వ్యాప్తంగా ఎల్‌నినో విస్తరించే ప్రభావం ఉంటుందని అంతర్జాతీయ వాతావరణ సంస్థలు హెచ్చరించాయి. మన భారత వాతావరణ సంస్థ ఐఎండి ప్రకటించిన వర్షపాత వివరాలు ప్రకారం దేశంలో తక్కువ వర్షాలు లేదా సాధారణం కన్నా తక్కువగా పడే అవకాశం ఉందని ఇటీవల ప్రకటించింది. ఐఎండి తన అంచనాలను శాస్త్రీయంగా ప్రకటిస్తుంది. ఉపగ్రహ అధ్యాయనం ద్వారా వాతావరణ మార్పులను రాడార్ గుర్తిస్తుంది. దాని ఆధారంగా అధ్యయనాలు వెల్లడిస్తారు. గతం కన్నా ఇప్పుడు శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం ఎక్కువగా అందుబాటులోకి రావడం, వాతావరణ పరిస్థితులను ముందుగానే పసిగడుతున్నారు. పసిఫిక్ మహాసముద్రంలో ఏప్రిల్, మే నెలలో జరిగే మార్పులు ప్రపంచవాతావరణాన్ని ఏవిధంగా ఉండాలనేది నిర్దేశిస్తాయి. ఈసముద్రంలో ఉపరితల ఉష్ణోగ్రత తక్కుగా ఉంటే లానినో అంటారు. దీనివల్ల అధిక వర్షాలు, వరదలు సంభవిస్తాయి. దాదాపు గత కొన్నేళ్లుగా మనం లానినోనే ఎదుర్కొంటున్నాము. అక్కడి సముద్రంలో ఉపరితల ఉష్ణోగ్రత పెరిగితే ప్రపంచ వ్యాప్తంగా వాతావరణంలో ఎల్‌నినో ఏర్పడుతుంది. దీనివల్ల రుతుపవనాలు దిశ, దశ మార్చుకొని గందరగోళంగా మారిపోయి సకాలంలో వర్షాలు పడకపోవడం, లేదాతక్కువగా కురవడం లాంటిది సంభవిస్తుంటుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1999, 2003 సంవత్సరాల మధ్య ఎల్‌నినో ప్రభావం తీవ్రమై భయంకరమైన కరవులను రైతులు, ప్రజలు చవిచూశారు అని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈఏడాది కూడా ఎల్‌నినో సంభవిస్తుందని అంచనా వేయగా తాజాగా ప్రముఖ మెట్రాలజీస్ట్ క్రిష్ డోల్స్ తన అధ్యాయనం ప్రకారం ఎల్‌నినో వేగంగా బలపడుతూ విస్తరిస్తోందని అంచనాలకన్నా తీవ్ర స్థాయిలో ఉందని నివేదించారు. ఇంతవరకు ఎప్పుడు లేని విధంగా సూపర్ ఎల్‌నినో కావొచ్చని డోల్స్ అంచనా వేశారు. ఆయన కథనాన్ని అంతర్జాతీయ సీఎన్ఎన్ వెథర్ చానెల్ ఈ నెల 15వ తేదీన ప్రముఖంగా టెలికాస్ట్ వేసింది అని తెలియవచ్చింది. ఎల్‌నినోలో రెండు మూడు మార్పులను గమనించడమే కాకుండా పసిఫిక్ సముద్రంపై బాగా బలంగా విస్తరిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు, దీనివల్ల గాలులు దిశ, దశ పూర్తిగా మారిపోయి వాతావరణం పొడిగా అవుతోంది. తద్వారా రుతుపవనాలు బలపడే అవకాశాలు తగ్గిపోయాయి. మనకు పసిఫిక్ సముద్రం నుంచి ఇండియన్ ఓషియన్ మీదుగాశ్రీలంక, మాల్దీవుల నుంచి అరేబియా సముద్రానికి రుతుపవనాలు విస్తరిస్తాయి. అక్కడి నుంచి కేరళ తీరానికి తాకి తద్వారా దేశం అంతా విస్తరిస్తాయి. కాస్త అటు ఇటుగా మేనెలాఖరుకు కేరళ తీరానికి రెండు తెలుగురాష్ట్రాలకు ముఖ్యంగా రాయలసీమ జిల్లాలకు చేరడానికి వారం, పదిరోజులు పడుతుంది. ఈ ఏడాది మే 29నాటికి కేరళ తీరానికి తాక వచ్చని ఐఎండి ప్రకటించింది. ఎల్‌నినో బలపడి విస్తరిస్తే రుతుపవనాలు తీరాన్ని సకాలంలో తాకినప్పటికీ వర్షాలు పడే అవకాశాలు తగ్గిపోతాయి. వర్షాలు పడినప్పటికీ తక్కువగా కురవడం లేదా తక్కువ రోజులు పడడం సహజంగా మారిపోతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే వాతావరణంలో ఉష్ణోగ్రత పెరిగి, గాలిలో తేమశాతం తగ్గిపోవడం లాంటి కారణాలవల్ల పొడివాతావరణం విస్తరించి కరవు పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇదే జరిగితే మన దేశంలో వర్షాధారంగా పంటలు పండించే ప్రాంతాలు ఎడారులుగా మారిపోతాయి. నదుల్లో నీటి లభ్యత తగ్గి జలాశయాలు వెలవెలపోతాయి. తద్వారా ఆయకట్టుకునీరు లభించదు. పంటలు పండవు. ఆఖరికి తాగు నీటి సమస్య సైతం ఎదురవుతుంది. దీని ప్రభావం వ్యవసాయ ఉత్పత్తిపైనే ఎక్కువ పడుతుందని మేధావులు అభిప్రాయపడు తున్నారు. ఈపరిస్థితుల్లో ఎల్‌నినోఎదురైతే రైతులు ఇబ్బందిపడతారు. ●

క్లైమేట్ ప్రిడెక్షన్ సెంటర్ తెలిపిన వివరాల ప్రకారం పసిఫిక్ మహాసముద్రంలో 0.5 డిగ్రీల ఉష్ణోగ్రత పెరిగింది. ఈ నెలఖరునాటికి ఇదిఒకటి నుంచి రెండు డిగ్రీలు వరకు పెరిగే అవకా శాలు 96శాతం వరకు ఉన్నాయని అంచనా వేస్తున్నారు. అదే జరిగితే ఎల్‌నినో సూపర్ ఎల్‌నినోగామారి నవంబర్, జనవరిల మధ్యపరిస్థితులు ఘోరంగా తయారవుతాయని భయపడుతున్నారు. దీని ప్రకారం ఏయే ప్రాంతాలు తడిబారిన పడతాయి, ఏయే ప్రాంతాలు పొడిగా మారి కరవుతో ఎడారిల పరిస్థితులను తలపిస్తాయనేదిఅంచనా కూడా వేసినట్లు తెలుస్తోంది. ఆ అంచనాలను ఉదహరిస్తూ ప్రముఖ మెట్రలజీస్ట్ జాన్ బరానిక్ ప్రపంచవ్యాప్తంగా ఖండాలు, ప్రాంతాల వారీగా నివేదికను వెల్లడించారు. ఆయన నివేదిక ప్రకారం ఆసియాఖండంలో పొడివాతావరణం తీవ్ర మవుతుంది. సూపర్ ఎలినినో పసిఫిక్ సముద్రంలో బలపడుతుందని ఆయన ధ్రువీకరించారు. సాధారణంగా పశ్చిమాసియా, తూర్పు ఆసియాలతోపాటు భారతదేశంలోనూ సాధారణ పరిస్థితుల్లో జూన్ నుంచిజనవరిల మధ్య మంచివర్షాలు కురవాల్సి ఉంది. కానీ ఇప్పుడు ఉష్ణోగ్రతలు పెరుగుతూ, రుతుపవానాలు దాదాపు అంతరించిపోయేవాతావరణం నెలకొంటోంది. దీని వలన భారీ వర్షాలు పడే ప్రాంతాలు సైతం వర్షాభావ పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుందని జాన్ తననివేదికలో పేర్కొన్నారు. ఫలితంగా రాయలసీమ జిల్లాల్లో వాతావరణం అనుకూలించక కరవు పరిస్థితులతో నీటిప్రభావం ఫలితంగా కరవులుఏర్పడి వ్యవసాయం దెబ్బతింటుందన్నారు. ఈ ప్రభావం వర్షాకాలం అనంతరం వచ్చే శీతాకాలం పైన కూడా ప్రభావం చూపుతుందని అంచనా వేశారు. అంటే శీతాకాలంలో చలి తక్కువగా ఉంటుందని మనం అనుకోవచ్చు. మొత్తానికి ఈ అంచనాలే వాస్తవం అయితే తీవ్ర కరవు పరిస్థితులను ఎదుర్కోవడానికి ప్రజలు, ప్రభుత్వం ముఖ్యంగా రాయలసీమ రైతులు సిద్ధంగా ఉండాల్సిన అవసరం ఉంది.

# కొత్త 'గేమ్' మొదలు!

**ఎ.వి.వి ప్రసాద్**

తమిళనాడు

మెరిసేదంతా బంగారం కానట్లే.. ముఖ్యమంత్రిపదవి కూడా అందరికీ పూల కిరీటం కాదు. కొందరికి ఆ పూల మధ్య ముళ్లు కూడా తగులుతూంటాయి, గుచ్చుకొని బాధ పెడుతూంటాయి. రెండు వారాల క్రితం తమిళ ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన జోసెఫ్ విజయ్‌కి ఈ విషయం కొంచెం కొంచెం అర్థమవుతున్నట్లే కనిపిస్తోంది. ఇటీవల ఐదు అసెంబ్లీలకు జరిగిన ఎన్నికల్లో మిగిలిన నాలుగు చోట్ల సుస్థిర ప్రభుత్వాలు ఏర్పడగా, ఒక్క తమిళనాట మాత్రమే 'అతుకుల బొంత' తయారయింది. ఎన్టీఆర్, ఎమ్జీఆర్ తర్వాత నిజంగానే విజయ్‌కి ప్రజలు అద్భుతమైన అవకాశం ఇచ్చారు. పెట్టిన పార్టీని రెండేళ్ల లోపునే అధికారంలోకి తెచ్చారు. గతంలో శివాజీ గణేశన్, విజయ్ కాంత్, రజనీకాంత్, కమల్ హాసన్ వంటి అగ్ర సినీ నటులు కూడా ఇలాంటి ప్రయత్నమే చేసినా, వారికి ఇవ్వని సువర్ణావకాశం ప్రజలు విజయ్‌కి పువ్వుల్లో పెట్టి అందించారు. కానీ ఆ పూల మధ్య మిగిలిన కొన్ని ముళ్లే ఇప్పుడు విజయ్‌ని ఎక్కువగా బాధిస్తున్నట్లనిపిస్తుంది. కొన్ని నిర్ణయాలు తీసుకోవడం, అంతలోనే వాటిని ఉపసంహరించుకోవడం అనుభవ రాహిత్యం వల్లనే. ముఖ్యమంత్రి హోదాలో తీసుకునే నిర్ణయాలకు తగిన మద్దతు లభించనప్పుడు ఆ సీటులో కూర్చున్నవారెవరికైనా ఎంత కష్టంగా ఉంటుందో విజయ్‌కి ఇప్పుడిప్పుడే అనుభవంలోకి వస్తోంది. ముఖ్యమంత్రి సింహాసనంపై కూర్చున్న వారికి ఎప్పుడైతే తగిన 'సొంత బలం' లేదో, అప్పుడు చుట్టూ ఉండే 'మిత్రులు' ఆడే ఆట కూడా భిన్నంగానే ఉంటుంది. ఇప్పుడదే కనిపిస్తోంది. 'మిత్రుల' పేరుతో విజయ్ చుట్టూ చాలామందే చేరారు. వారంతా ప్రత్యర్థి పార్టీ మిత్రులు. ఎవరి వద్దకు వెళ్లకూడదనుకున్నారో చివరికి వారి మద్దతునే విజయ్ కోరారు. 35 శాతం ఓట్లిచ్చిన ప్రజలు మరో పది సీట్లు ఇవ్వకపోవడంతో వాటి కోసం విజయ్ పడరాని పాట్లు పడ్డారు. పది రోజుల పాటు కంటిపై కునుకు లేకుండా ప్రయత్నించారు. ఆ 'పది' కనిపిస్తే గాని తాను ఆహ్వానించబోనని గవర్నర్ భీష్మించడంతో విజయ్ తొక్కని గడప లేదనే చెప్పాలి. కరుణానిధి పార్టీతో కొన్ని దశాబ్దాల పాటు కలిసి నడిచిన కాంగ్రెస్ ఆ 'గొడుగు' బయటకు వచ్చి టివికె గూటికి చేరడంతో విజయ్‌కి నిజంగానే తొలుత పెద్ద బలం చేకూరినట్లయింది. ఆ పార్టీకి ఉన్నవి ఐదు సీట్లే అయినా, ఓ జాతీయ పార్టీ తమ వెంట ఉందనే అభిప్రాయం విజయ్‌కి బలం పెంచింది. అయినా 'నంబర్' చాలక డిఎంకె లోని మరికొన్ని మిత్రపక్షాల మద్దతు కోసం విజయ్ ఎడతెగని ప్రయత్నాలు చేశారు. చివరికి ఐయుఎంఎల్, సిపిఎం మద్దతు ఇచ్చినా ఇంకా రెండు సీట్ల దూరంలో విజయ్ నిలబడ్డారు. ముప్పుతిప్పలు పెట్టి చివరికి ఆ రెండు సీట్లను విసికె ఇచ్చాక విజయ్ పీఠం అధిష్ఠించి బల పరీక్షకు సిద్ధమయ్యారు.



ముఖ్యమంత్రి విజయ్

ఆ దశలో ఆయనకు అనూహ్యంగా 144 మంది సభ్యుల మద్దతు లభించడంతో తన 'బలం' పై ఆయన భారీగానే ఆశలు పెంచుకున్నారు. అయితే అసలు 'ఆట' కూడా అప్పుడే మొదలయింది. అన్నాడిఎంకె లోని రెబెల్ వర్గం 26 మంది విజయ్‌కి మద్దతు ఇవ్వడంతో గేమ్ మారింది. అదొక పెద్ద ఆట అని తర్వాత పరిణామాలను బట్టి తెలుస్తోంది. డిఎంకె అధినేత స్టాలిన్ గతవారం ఒక ప్రకటన చేస్తూ విజయ్ ప్రభుత్వం ఏ క్షణంలోనైనా కూలిపోతుందనీ, మధ్యంతర ఎన్నికలకు సిద్ధంగా ఉండాలనీ పార్టీ కార్యకర్తలకు పిలుపునివ్వడం కూడా పెద్ద సంచలనమే సృష్టించింది. ఆట మరో మలుపు తిరుగుతోందని అప్పుడే అనిపించింది. ఎందుకంటే, విజయ్ చుట్టూ ఉన్న మిత్రులందరూ డిఎంకె వర్గమే. విజయ్ ప్రభుత్వం డిఎంకె మిత్రులపై ఆధారపడి నడుస్తోందనీ, అందువల్ల అతడు జాగ్రత్తగా వ్యవహరించాలనీ స్టాలిన్ చేసిన హెచ్చరిక ప్రకంపనలు సృష్టించింది. ఆ వెంటనే విజయ్ గత బుధవారం మంత్రి వర్గాన్ని విస్తరించి కొత్తగా 23 మందిని చేర్చుకున్నారు. వారిలో ఇద్దరు కాంగ్రెస్ వారు కావడం విశేషం. అక్కడితో ఆగకుండా, 48 గంటలు తిరగకుండానే శుక్రవారం మరో ఇద్దరిని కేబినెట్‌లోకి తీసుకున్నారు. దానితో మొత్తం మంత్రులసంఖ్య35కు పెరిగింది. ఐయుఎంఎల్, విసికె పార్టీల నుంచి కూడా కేబినెట్ లోకి రావడంతో అన్నాడిఎంకె రెబెల్స్ కూడా మంత్రి పదవుల కోసం ఆశపడ్డారు. విజయ్ అందుకు కూడా సిద్ధమైనా, సిపిఎం, విసికె వ్యతిరేకించడంతో మళ్లీ వెనక్కి తగ్గారు. ఇప్పుడిది కొత్త సమస్యగా మారింది. ఇక తమకు మంత్రి పదవులు రావని భావించిన అన్నాడిఎంకె రెబెల్స్ మళ్లీ ప్లేటు మార్చి తాము తమ పార్టీ లోనే ఉన్నామనీ, జయలలిత ప్రభుత్వాన్ని మళ్లీ చూస్తామనీ ప్రకటించడం ఆట ఎటు తిరుగుతోందో తెలుపుతోంది. ఈ కథ నడవడానికి ముందు, రజనీకాంత్ స్టాలిన్‌తో సమావేశం కావడం ఒకసారి గుర్తుచేసుకోవలసి ఉంది. బిజెపి ఆలోచన మేరకు అన్నాడిఎంకె, డిఎంకె మధ్య సయోధ్య కోసం ఆ భేటీ జరిగినట్లు అనుకొన్నారు. దానిలో వాస్తవం లేకపోలేదు. స్టాలిన్ తాజాగా చేసిన హెచ్చరిక, అంతకు ముందు జరిగిన ఆ భేటీ, అన్నాడిఎంకె రెబెల్స్ ప్లేటు మార్చడం తేలికగా తీసివేసే విషయాలు కావు. డిఎంకె సిగ్నల్ ఇస్తే 'మిత్రుల' అభిప్రాయాలు మారిపోవచ్చు. వైరి వర్గాలైన డిఎంకె, అన్నాడిఎంకె మధ్య సయోధ్య కుదురుతుందా, లేదా అన్నది ఇప్పుడే చెప్పలేం. అది విజయ్‌పాలన తీరుపై ఆధారపడి ఉంటుంది. అప్పుడు 'గేమ్' మళ్లీ మొదటికి రావచ్చు. చెప్పలేం. రాజకీయాల్లో ఎవరూ ఎవరికీ 'నిత్య మిత్రులు'కారు. అదే విధంగా శత్రువులూ కారు. ఎవరి ఆట వారిది. ఎన్నికల్లో కంటే ఈ ఆటలో గెలవడమే విజయ్ వ్యూహ నిపుణతకు అసలైన పరీక్ష. అభిమాన సంఘాలు ఎన్నికల్లో ఓట్లు తెచ్చాయి కానీ పాలనలో పదవి చేజారకుండా నిలబెట్టగలవా! ఆట ఎలా మారుతుందో చూడాలి. ●

# సంస్కరణల దిశగా కొత్తపాలన!

**గన్ని మోహన్**

హాంగేరి

మధ్యయూరోప్‌లో ఏడుదేశాల సరిహద్దులు కలిగి ఉన్న అతి చిన్నదేశం హాంగెరీలో కమ్యూనిస్టుల పాలన తర్వాత మొదటిసారి స్వేచ్ఛగా ఎన్నికలు జరిగాయి. పీటర్ మాగ్యార్ దేశ నూతనప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. దీనితో అప్పటి వరకూ ఉన్న నియతృత్వ పాలన శకానికి తెర పడింది. 16 ఏళ్లపాటు తన నిరంకుశ పాలనతో దేశాన్ని శాసించిన విక్టర్ ఓర్బాన్ గత నెలలో జరిగిన ఎన్నికలలో, మాగ్యార్‌కు చెందిన టిస్జా పార్టీ, ఓర్బాన్ జాతీయవాద పార్టీ అయిన ఫిడెజ్‌ను అనూహ్యంగా ఓడించింది. హాంగేరి కమ్యూనిజం అనంతర చరిత్రలో పార్లమెంటులో మరే ఇతర పార్టీ కంటే కూడా ఎక్కువ ఓట్లు సాధించింది. టిస్జా పార్టీకి పార్లమెంటులో మూడింట రెండు వంతుల మెజారిటీ లభించడంతో ఓర్బాన్‌కు ఓటమిని అంగీకరించక తప్ప లేదు దీనికితోడు ప్రపంచ దేశాలు కూడా ఎన్నికలను స్వాగతించాయి. అలాగే మాగ్యార్ ప్రధాని ఎన్నికపైనా శుభాకాంక్షలు తెలియజేస్తుండటంతో ఇప్పుడు ఓర్బాన్ భవిష్యత్తు ప్రశ్నార్థకం అవుతోంది. ప్రపంచంలోని ప్రతి స్వేచ్ఛాభిమాని హాంగేరియన్‌గా ఉండాలని కోరుకుంటున్నారు. అత్యంత క్రూరమైన నిరంకుశత్వాన్ని కూడా అత్యంత సామాన్య, రక్తమాంసాలు గల ప్రజలే ఓడించగలరని మీరు దేశానికి, ప్రపంచానికి స్పష్టం చేసారని మాగ్యార్ తొలి ప్రసంగంలో పేర్కొనడం చూస్తుంటే ఇకదేశంలో నియంతృత్వ పాలనకు కాలం చెల్లిందన్న హెచ్చరికలు చేసినట్లనిపించింది. హాంగేరి నూతన నాయకుడిగా, ఓర్బాన్ పాలనలో తీవ్రంగా దెబ్బతిన్న ప్రజాస్వామ్య సంస్థలను,ప్రభుత్వ అధికారాల సమతుల్యతను పునరుద్ధరిస్తానని, అవినీతిపై ఉక్కు పాదం మోపాల్సిందేనని మాగ్యార్ ప్రతిజ్ఞ చేశారు. ఆయన పరిపాలన యూరోపియన్ యూనియన్‌లోని రాజకీయ గతిని మార్చివేస్తుందని భావిస్తున్నారు. అక్కడ మాజీప్రధానమంత్రి కీలక నిర్ణయాలను,పొరుగు దేశమైన ఉక్రెయిన్‌కు మద్దతుకు సంబంధించిన నిర్ణయాన్ని, తరచు వీటో చేస్తూ రష్యాకు చేరువ అయిన ఓర్బాన్ విధానాలు పునఃసమీక్షిస్తానని ప్రకటించిన మాగ్యార్ ఆ దిశగా దూసుకుపోతున్నారు. కేవలం రెండేళ్లక్రితమే టిస్జా పార్టీని స్థాపించి అధికారంలోకి తెచ్చిన మాగ్యార్ టిస్జాకు అపూర్వ విజయం తెచ్చారు. హాంగేరిలోని 199 స్థానాలు గల పార్లమెంట్‌లో, టిస్జా ఇప్పుడు 141 స్థానాలను సాధించింది. ఓర్బాన్ ఫిడెజ్‌కేడీఎన్‌పీ కూటమి 135 నుండి 52 స్థానాలకు పడిపోయి అధికారం కోల్పోయింది. తన ప్రమాణస్వీకారాన్ని, ఓర్బాన్ శకం ముగింపును పురస్కరించుకుని, కొస్సూత్ స్క్వేర్‌లో జరిగే 'పాలన మార్పు' వేడుకకు హాజరు కావాలని మాగ్యార్ హాంగేరియన్లకు పిలుపునిచ్చారు.




పీటర్ మాగ్యార్

సామాజిక సమీకరణల ప్రకారం విభజించి పాలించే తీరును తాను అనుసరించబోనన్న వాగ్దానం చేయడంతో ప్రజలు మాగ్యార్‌కు ఓట్లవర్షం కురిపించారు. ఇప్పటివరకూ మహిళలకు ప్రాతినిధ్యం అంతంతమాత్రంగానే ఉండేది. కానీ మాగ్యార్ హయాంలో హాంగేరి పార్లమెంటులో 54మంది మహిళా చట్టసభ్యులున్నారు. వీరిలో ఎక్కువ మంది టిస్జా పార్టీకి చెందినవారే కావడం గమనార్హం. ఈప్రాతినిధ్యం హాంగేరి చరిత్రలోనే అత్యధికమని నిపుణులు సైతం అంగీకరించారు. ప్రత్యేకించి ఉక్రెయిన్‌పై అనుసరించే వైఖరుల్లో గతంలోని ఓర్బాన్‌రష్యావైపునకు వెళ్లడం హాంగేరి ప్రజలకు ఎంతమాత్రం రుచించలేదు. ఉక్రెయిన్‌లో గడచిన మూడున్నరేళ్లుగా సాగుతున్న యుద్ధకాండపై హాంగేరీ వాసుల్లోను ఉక్రోషం పెరుగుతోంది. అందువల్లనే నియంతృత్వ వాదిగా ముద్రపడిన ఓర్బాన్‌ను ఈసారి ఖచ్చితంగా ఓడించి తీరాలన్న పట్టుదలతోనే మాగ్యార్‌కు పట్టం కట్టారు. ఓర్బాన్ పాలనలో, యూరోపియన్ యూనియన్‌లోని దాదాపు అన్ని ఇతర 26దేశాలతో పోలిస్తే ప్రభుత్వంలో మహిళల సంఖ్య తక్కువగాఉండేది. మహిళలు ఈ కొత్త, అందమైన ప్రజాస్వామ్య వ్యవస్థలో దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని అందుకేవారి ప్రాతినిధ్యం పెంచినట్లు మాగ్యార్ స్వయంగా ప్రకటించారు. యూరోపియన్ యూనియన్‌తో సంబంధాలను పునరుద్ధరించడం ఓర్బాన్ తెగిపోయేంత వరకు నెట్టిన యూరోపియన్ యూనియన్‌తో తన దేశ సంబంధాలను పునరుద్ధరిస్తానని, ఓర్బాన్ రష్యాకు మరింత దగ్గరవ్వడంతో పాశ్చాత్య ప్రజాస్వామ్య దేశాల సరసన హంగేరి స్థానం ప్రశ్నార్థకంగా మారిన నేపథ్యంలో దానికి పూర్వ వైభవాన్ని తెస్తానని మాగ్యార్ హామీ ఇచ్చారు. అంతేకాదు పార్లమెంటు భవనంపై తొలిసారి ఈయు జెండాను ఎగురవేసారు. హాంగెరికి స్వేచ్ఛా ప్రజాస్వామ్య వాతావరణం కల్పిస్తానని హామీలు కుమ్మరించిన మాగ్యార్‌కు ముందున్న ముళ్లబాటలో సవాళ్లు కూడాఅధికమే. శాంతిభద్రతలు, అవినీతి ఆందోళనల కారణంగా ఓర్బాన్ హయాంలో స్తంభింపజేసిన హాంగేరికి చెందిన సుమారు 20 బిలియన్ డాలర్ల ఈయూ నిధులను ముందు విడుదలచేయించాలి. గత నాలుగేళ్లుగా సంక్షోభంలో చిక్కుకున్న హాంగేరి ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించడానికి నిధులు చాలా అవసరం. అంతేకాకుండా వీలైనంత త్వరగా రష్యాప్రభావాన్ని దేశంపై పడకుండా చూసుకోవాలని కూడా ఆయనకు ప్రజలనుంచి వత్తిడి వస్తోంది. టిస్జాకు ఓటు వేసిన దాదాపు 34 లక్షల మంది హాంగేరియన్లలో చాలామంది, పదవీ విరమణ చేస్తున్న ప్రభుత్వం దుష్ప్రవర్తనగా భావిస్తున్న దానికి ఫిడెజ్ అధికారులు వారి వ్యాపార మిత్రులను జవాబుదారీగా చేయాలని మాగ్యార్‌ను డిమాండ్‌చేస్తున్నారు. ఓర్బాన్ పదవీ కాలంలో దుర్వినియోగం చేయబడిన ప్రజా నిధులను దర్యాప్తుచేసి, తిరిగి రాబట్టే బాధ్యతతో కూడిన జాతీయ ఆస్తుల రికవరీ,పరిరక్షణ సంస్థ ఏర్పాటుచేసి దేశ ఆర్థికపరిస్థితిని గాడిలోకి తెస్తానని చెపుతున్న ప్రధానికి దేశ ప్రజల నుంచి ఆయనకు సంపూర్ణ మద్దతు లభిస్తున్నా ఈయూ నుంచి ఎదురయ్యే సహాకారమే ఇప్పుడు ఆయనకు అత్యంత కీలకం అవుతోంది. ●

# నీట్ రద్దుతో విద్యార్థుల కలలకు విఘాతం!

**తండ సదానందం**

సమాజంలో అత్యంత గౌరవం,హోదా, ప్రతిష్ఠలు కలిగిన వృత్తి అంటే వైద్యవృత్తి. ప్రాణాలను రక్షించే వారు వైద్యులు. అటువంటి వృత్తిని చేపట్టడానికి విద్యార్థులు బాల్యం నుండే కలలు కంటారు. కలలు కనడమే కాదు వానిని సహకారం చేసుకోవడానికి ఎంతో కష్టపడతారు. విద్యార్థులు మాత్రమే కాదు, వారి తల్లిదండ్రులు కూడా ఎంతో త్యాగం చేయవలసి ఉంటుంది. వైద్య వృత్తిలోకి ప్రవేశించడానికి దేశవ్యాప్తంగా నిర్వహించే నీట్ పరీక్షను రాయవలసి ఉంటుంది. అందుకుగాను లక్షలాది రూపాయలు కుమ్మరించి కార్పొరేట్ కళాశాలలో ఇంటర్‌తో పాటు నీట్ కోచింగ్ తీసుకుంటేనే సీటుసాధించడం సాధ్యమవుతుంది. కాలచక్రంతో పరిగెత్తుతూ లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి నిరంతరం శ్రమించి నీట్‌పరీక్ష బాగానే రాశాము,డాక్టర్ అవుతామని కలలు కంటుంటే ,వారి నెత్తిన పిడుగు పడ్డట్టు నీట్ రద్దు వార్తవచ్చింది. నీట్ ప్రశ్నపత్రం లీక్ అయిందని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని అక్రమార్కులకు లాభం జరగకూడదని సదుద్దేశంతో నీట్ రద్దు చేస్తున్నామని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వాహకులు, సంబంధిత విద్యా మంత్రి చావు కబురు చల్లగా అది కూడా విద్యార్థుల ప్రయోజనం కొరకు పాటుపడుతున్నట్లు ప్రకటించడం మొసలి కన్నీరు కార్చడమే. పరీక్ష రద్దు చేయడం వల్ల విద్యార్థులకు మేలు కలుగుతుందా? అహోరాత్రులు కార్పొరేట్ కళాశాలలో తిని తినక చిక్కిశల్యమై, అమ్మానాన్నలు నగలు, ఆస్తులు అమ్మి ఫీజుకడితే ఆ గుండె భారాన్ని తమలోనే దిగమింగుకొని, వారి కష్టాన్ని గుర్తుచేసుకొని, వారి కలలను నెరవేర్చడానికి పరీక్ష బాగా రాసి సీటు వస్తుందని ఆశిస్తున్న విద్యార్థులకు ఆశనిపాతం. ఈ నెల మూడున దేశవ్యాప్తంగా 551 నగరాలు, విదేశాల్లోని 14 నగరాల్లో నిర్వహించడం జరిగింది. ఈ పరీక్షకు 23 లక్షల మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా 96.92 హాజరైనారు. తాజాగా నీట్ పరీక్ష ప్రశ్నపత్రం లీక్ అయిందని రద్దు చేస్తే అది తట్టుకోలేక విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారు. విద్యార్థుల బలిదానం కొత్తేమీకాదు, ప్రతి ఏటా ఎంతోమంది విద్యార్థులు ఒత్తిడిని తట్టుకోలేక బలవన్మరణాలకు పాల్పడుతూనే ఉన్నారు. నీట్ పరీక్ష లీక్ అనేది ప్రతి ఏటా ఉత్తరాది రాష్ట్రాలలో జరుగుతుందని నిపుణుల అభిప్రాయం. ఈసారి చేత్తో రాసిన ప్రాక్టీస్ క్యాస్షన్ బ్యాంకులో 281 ప్రశ్నలుంటే 138 ప్రశ్నలు పరీక్షలు వచ్చాయి ఈ పేపరు పరీక్షకు ముందే రాజస్థాన్లో బాగా సర్కులేట్ అయింది. నీట్‌పరీక్ష దేశవ్యాప్తంగా 2017 నుండి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుంది. కానీ ఆది నుండి అక్రమాలు జరుగుతున్నాయి. 2024లో భారీ కుంభకోణం, 2025లోను లీక్ అయిందనే వార్త ఇప్పుడు వెలుగులోకి వస్తుంది. 2026 లో మళ్లీ పూనే కేంద్రంగా లీకై రాజస్థాన్ గుండా దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన బడా బాబులకు, కార్పొరేట్ కోచింగ్ సెంటర్లకు అందినట్లు తెలుస్తుంది. నీట్ పరీక్ష నిర్వహణలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పూర్తిగా వైఫల్యం చెందింది. ప్రతి ఏటా లీక్ అవ్వడం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడడమే. ప్రతిష్టాత్మకంగా పకడ్బందీగా పారదర్శకంగా దేశవ్యాప్తంగా నిర్వహించాల్సిన పరీక్ష, పేలవంగా ప్రతిసారి లీక్ అవ్వడం అంటే విద్యార్థుల భవిష్యత్తు పట్ల,విద్యా వ్యవస్థ పట్ల నిర్వాహకులకు ఎంత శ్రద్ధ ఉందో అర్థం అవుతుంది. ఎన్ టి ఏ నుండి పేపర్ లీక్ అయితే పరీక్షను పారదర్శకంగా నిర్వహించేది ఎవరు? పేపర్ తయారీ కమిటీ మెంబర్లు పేపర్‌అమ్ముకుంటే పరీక్ష గోప్యతను కాపాడేదెవరు? దీని వెనుక పెద్ద ఎత్తున కోట్లాది రూపాయలు చేతులు మారడం, పెద్ద తలకాయల జోక్యం కూడా ఉండి ఉంటుంది. నీట్ పరీక్ష జరిగిన వెంటనే ప్రతి ఏటా ఆరోపణలు వెలువెత్తుతున్న దొరికితే దొంగ లేకపోతే దొర అన్న రీతిలో పరీక్ష కొనసాగుతూ వచ్చింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా విద్యార్థులు వారితల్లిదండ్రులు మొత్తంవ్యవస్థ ప్రభావితమైందని,పరీక్ష వ్యవస్థపై ఉన్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఉండేందుకు మళ్లీ పరీక్ష నిర్వహించాలని నిర్ణయించడం జరిగిందని, తప్పు జరిగిందని దానికి తాము బాధ్యత వహిస్తామని ఎన్‌టిఏ డైరెక్టర్ చెప్పడం విడ్డూరంగా ఉంది. విద్యార్థులు ప్రాణాలు కోల్పోతుంటే తప్పు జరిగింది అంటే సరిపోతుందా? బాధ్యత వహించడం అంటే వారి ప్రాణాలను వెనక్కి తేగలరా? ఉజ్వల భవిష్యత్తు కలిగిన మానవ వనరులుగా దేశానికి సేవ చేద్దామనుకున్నా వారి ప్రాణాలను హరించడం బాధ్యత వహిస్తామని వట్టి మాటలతో చెప్పడం, ప్రతి సంవత్సరం ఇలాగే పునరావృతం అవుతున్నను,మళ్లీ పునరావృతం కాకుండా చూస్తామనడం హాస్యాస్పదం. ఎన్టిఏ ఏర్పడిన నాటి నుండి ఏనాడు ఈ నీట్ పరీక్షలు పారదర్శకంగా నిర్వహించిన దాఖలాలు లేవు.





ప్రతిసారి ఏవో కొన్నిఆరోపణలు అక్రమాలతో నెట్టుకొస్తుంది. సాక్షాత్తు ఎన్ టి ఏ ఆధ్వర్యంలోని నీట్ కమిటీ మెంబర్ల ద్వారా లీక్ అవ్వడం, ఆ తయారీదారులు సొంతంగా కోచింగ్ సెంటర్లు నిర్వహించడాన్ని బట్టి పరీక్షా పారదర్శకతను అర్థం చేసుకోవచ్చు. ఒక హాస్టల్ నిర్వాహకుడు ఎన్ టి ఏ కు సమాచారమిచ్చేదాకా ఈ లీక్ వ్యవహారం వెలుగులోకి రాలేదంటే మన నిఘా వ్యవస్థలు ఎంత నిద్రపోతున్నాయో, లేదా తెలిసి కూడా కావాలని ఉపేక్షించినాయో వారికే తెలియాలి. పరీక్ష పేపర్ లీక్ వార్త రాగానే మొదట్లో ఎన్టిఏ తేలికగా తీసుకొని కొట్టిపారేయడం,తర్వాత ఒత్తిళ్లకు తలొగ్గి దర్యాప్తు మొదలుపెట్టడం, గతంలో జరిగిన ఘటనల నుండి నేటి వరకు అదే కథ. పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించలేకపోయాం అన్నది చెప్పకుండా ప్రతిసారి రద్దు అవసరాన్ని చెప్పుకురావడం శోచనీయం. పరీక్ష ఫీజు వాపస్‌తో విద్యార్థులకు జరిగిన అన్యాయం తీరుతుందా? ఈ అన్యాయానికి ఎవరు బాధ్యత వహిస్తారు?ఎలాన్యాయం చేస్తారు? మళ్లీ పరీక్ష నిర్వహించడం న్యాయం ఎట్లా అవుతుంది? కొద్దిమంది అక్రమార్కులు ఉంటే లక్షలాదిమంది విద్యార్థులకు శిక్ష వేయడం ఏన్యాయ సూత్రం? వందమంది దోషులు తప్పించుకున్న ఒక నిర్దోషికి శిక్ష పడవద్దు అనేది సామాజిక న్యాయ సూత్రం. దానికి విరుద్ధంగా రాజ్యం చేసిన తప్పుకుచిన్నారుల భవిష్యత్తు తలకిందులు కావడం అన్యాయమా? న్యాయమా? ఏలికలకే తెలియాలి. మళ్లీ చదవడం, పరీక్ష రాయడం, ఉత్తమ ఫలితం రావడం అనేది విద్యార్థుల మానసిక స్థాయి పై ఆధారపడి ఉంటుంది. విద్యార్థులు అధైర్యపడి డిప్రెషన్స్‌లోనై అసలు పరీక్ష రాయకుండా ఉండే అవకాశం కూడా ఉంటుంది. గతంలో చాలామంది డిప్రెషన్‌కి లోనై వదిలేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఆ పసి మనసులకు ఏర్పడినగాయం వారి భవిష్యత్తుకు విఘాతం. ఒకవేళ ధైర్యంగా రాసినా గతంలో కనబరిచిన ప్రతిభ కనబరచకపోవచ్చు. దీంతో డాక్టర్ కావలసిన విద్యార్థులు, ఆ విద్యార్థుల తల్లిదండ్రులు భరించరాని మానసిక వేదనను అనుభవిస్తూమానసిక రోగులుగా మారే ప్రమాదం ఉందని, అలా గత అనుభవాలు చెబుతున్నాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో వైద్యవృత్తిలో ప్రవేశానికి నిర్వహించే పరీక్షలు రాష్ట్ర వ్యాప్తంగా ఆయా రాష్ట్రాల పరిధిలో జరిగేవి. ఆయా రాష్ట్రాలు తమ పరిధిలో పకడ్బందీగా పారదర్శకంగా కట్టుదిట్టంగా పరీక్షలు నిర్వహించి ప్రవేశాలు జరిపాయి. 2017తర్వాత కేంద్రీకృతం చేసి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని ఏర్పాటు చేసి నీట్ పరీక్షను నిర్వహిస్తుండడంతో ఈ అనర్థాలు వెలుగులోకి వస్తున్నాయి. దీనిలో స్థానిక భాషలలో ప్రశ్నాపత్రం లేకపోవడం వల్ల వెనుకబడిన రాష్ట్రాల గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. నీట్ పరీక్షను పాస్ కాలేక, వైద్యవృత్తిని అందుకోలేక ఎంతోమంది విద్యార్థులు ప్రాణాలను తీసుకుంటున్నారు. దక్షిణాది రాష్ట్రాల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు, ఆది నుండి తమిళనాడు రాష్ట్రం ఈ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ వస్తున్నది. అయినను దీనిపై సమీక్ష చేయకుండా, ఈ అనర్థాలను తొలగించకుండా ప్రజాస్వామ్య విరుద్ధంగా, సమాఖ్య విధానానికి తూట్లు పొడిచి కేంద్రీకృత విధానంతో కొనసాగించడం, ఈ అక్రమాలకు తావు ఏర్పడేలా చేయడం అప్రజస్వామికమే. ప్రతి ఏటా విద్యార్థులు పిట్టల రాలిపోతున్న కనికరం లేకుండా ఈ విధానంలో మార్పులు చేయకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనం. ఇకనైనా చిన్నారుల భవిష్యత్తును త్రుంచి వేయకుండా విశ్వాసనీయంగా పారదర్శకంగా పకడ్బందీగా నిర్వహించి తద్వారా వ్యవస్థ పై ఉన్న నమ్మకాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ●

# ఇరాన్‌పై మళ్లీ అమెరికా దాడి!

## దౌత్యయత్నాలు విఫలమైతే సైనిక చర్యకు ట్రంప్ ప్రణాళిక

**వాషింగ్టన్, మే 23:** అమెరికా-ఇరాన్ మధ్య శాంతి ఒప్పందానికి సంబంధించి ఏ క్షణంలోనైనా ప్రకటన రావొచ్చని వార్తలు వస్తుండగా మరోవైపు ఇరాన్‌పై మరోసారి దాడులకు అమెరికా సన్నద్ధమవుతుందనే నివేదికలు వెలువడుతున్నాయి. చివరి నిమిషంలో దౌత్య ప్రయత్నాలు విఫలమైతే సైనిక చర్యకు దిగే విషయాన్ని అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు అమెరికా అధికారులను ఉటంకిస్తూ అక్కడి మీడియాలో కథనాలు వస్తున్నాయి. ఉపాధ్యక్షుడు జెడి వాన్స్, రక్షణమంత్రి పీట్ హెగ్సెత్‌తోపాటు కీలక అధికారులతో ట్రంప్ శుక్రవారం ఉన్నతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో ఇరాన్‌పై తదుపరి తీసుకోవాల్సిన చర్యల గురించి అధ్య




క్షుడు వారితో చర్చించినట్లు తెలుస్తోంది. ఇరాన్‌తో చర్చలు విఫలమైతే వెంటనే సైన్యాన్ని రంగంలోకి దించే విషయం గురించి వారు మాట్లాడుకున్నారని అధికార వర్గాలు తెలిపాయి. అయితే, దాడులకు సంబంధించి ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని వెల్లడించాయి. ఈ సమావేశం తర్వాత వైట్‌హౌస్ అధ్యక్షుడి కార్యక్రమాలకు సంబంధించి కీలక మార్పులు చేసినట్లు తెలుస్తోంది. మోమోరియల్ డే సందర్భంగా న్యూజెర్సీకి వెళ్లాలని ట్రంప్ తొలుత నిర్ణయించుకున్నారు. అయితే, దాన్ని రద్దు చేసుకున్న ఆయన వైట్‌హౌస్‌లోనే ఉండనున్నారు. ఇక, అమెరికాకు చెందిన పలువురు సైనిక, నిఘా అధికారులు కూడా తమ ప్రణాళికలను రద్దు చేసుకున్నారు.

**నా కుమారుడి పెళ్లి వెళ్లడం లేదు : ట్రంప్**

ఇరాన్‌పై దాడులకు అమెరికా సన్నద్ధమవుతుందనే వార్తల నేపథ్యంలో ట్రంప్ కీలక ప్రకటన చేశారు. తన కుమారుడు డొనాల్డ్ ట్రంప్ జూనియర్ వివాహానికి హాజరుకావడం లేదన్నారు. ట్రంప్ జూనియర్, బెట్టినా ఆండర్సన్‌ల పెళ్లి చూడాలని తనకు ఎంతో ఆశగా ఉందంటూ అధ్యక్షుడు ట్రూత్ సోషల్‌లో పోస్టు పెట్టారు. అయితే, ప్రభుత్వ కార్యక్రమాల వల్ల తాను అక్కడికి వెళ్లలేక పోతున్నానని తెలిపారు. ఈ కీలక సమయంలో తాను వైట్‌హౌస్‌లోనే ఉండటం అత్యంత ముఖ్యమని భావిస్తున్నట్లు వెల్లడించారు.



## అమెరికా 'గ్రీన్‌కార్డ్‌'కు స్వదేశం నుంచి దరఖాస్తు!

### నిబంధనల్లో మార్పులు చేసిన ట్రంప్ ప్రభుత్వం

### కొందరిని మినహాయిస్తున్నట్లు వెల్లడి

**వాషింగ్టన్, మే 23:** అమెరికాలో శాశ్వత నివాస హక్కు (గ్రీన్‌కార్డు) కోరే తాత్కాలిక వలసదారులు ఇకపై దరఖాస్తులు సమర్పించడానికి స్వదేశానికి వెళ్లాల్సి ఉంటుందని అమెరికా పౌరసత్వ, వలస సేవల సంస్థ (యుఎస్‌సిఐఎస్) స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. అయితే ఈ రూల్ అందరికీ కాదని తెలుస్తోంది. తాజాగా అగ్రరాజ్యం ఇందులో కొన్ని మినహాయింపులు ప్రకటించింది. 'అమెరికా జాతీయ ప్రయోజనాలు లేక ఆర్థిక ప్రయోజనాలు ముఖ్యం అనుకునే వలసదారులకు ఈ రూల్స్ నుంచి మినహాయింపులు ఇస్తాం. గ్రీన్‌కార్డు ఆశావహులు సమర్పించిన దరఖాస్తుల ఆధారంగా మా దేశానికి ప్రయోజనం ఉందని భావిస్తే.. వాటిని మేం పరిగణనలోకి తీసుకుంటాం. దాంతో వారు ప్రస్తుతం నిబంధనల ప్రకారమే కొనసాగే అవకాశం ఉంటుంది. మిగతా వారిని వారి మాతృదేశానికి వెళ్లి దరఖాస్తు చేసుకోమని సూచిస్తాం' అని యుఎస్‌సిఐఎస్ ప్రతినిధి జాక్ కహ్లర్ వెల్లడించారు. అవి తమ దేశానికి ప్రయోజనం కలిగించే వ్యక్తుల నుంచి వచ్చిన దరఖాస్తులు అని ఎలా నిర్ణయిస్తారో మాత్రం వెల్లడించలేదు. ముందురోజు వెలువరించిన గ్రీన్‌కార్డు నిబంధనల ప్రకారం అసాధారణ పరిస్థితుల్లోనే ఇందుకు మినహాయింపు ఉంటుందని జాక్ కహ్లర్ వెల్లడించిన సంగతి తెలిసిందే. అలాంటి మినహాయింపు కోరుతూ దరఖాస్తు చేసుకొనే వారి విషయంలో అధికారులు అన్ని పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి, తగిన నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. కొత్త నిబంధనలతో చట్టంలోని లోపాలను ఉపయోగించుకుంటూ ఈ వ్యవస్థను దుర్వినియోగం చేసే అవకాశాలు తగ్గిపోతాయని పేర్కొన్నారు.



## సింధుజలాల వినియోగానికి రూ.22వేల కోట్లతో రెండు భారీప్రాజెక్టులు

**శ్రీనగర్, మే 23:** పహల్గాంవ్ ఉగ్రదాడి అనంతరం ఆపరేషన్‌సింధూర్‌చేపట్టిన భారత్ సింధుజలాల నిలిపివేతను కూడా అమలుచేసి పాక్‌ను చిక్కుల్లోకి నెట్టినసంగతి తెలిసిందే. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ పాకిస్థాన్ తో ఉన్న 1960 నాటి సింధు జలాల ఒప్పందాన్ని భారత్ తాత్కాలికంగా నిలిపివేసింది. పాకిస్థాన్‌లో ఉగ్రవాదం పూర్తిగా అణిచివేసేంత వరకూ ఈ ఒప్పందాన్ని పునరుద్ధరించలేమని భారత్ స్పష్టం చేసింది. పశ్చిమ నదులపై ముఖ్యంగా చీనాబ్ నదిపై హక్కులను పూర్తిగా వినియోగించుకోవడానికి భారత్ భారీ ప్రాజెక్ట్‌లను వేగవంతం చేసింది. కేంద్ర ప్రభుత్వం జమ్మూ కాశ్మీర్‌లోని చీనాబ్ నదిపై సుమారు రూ. 3,200 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించ తలపెట్టిన దుల్హస్తీ స్టేజ్2 జలవిద్యుత్ ప్రాజెక్ట్‌కు పర్యావరణ అనుమతులు లభించాయి. ఇది గతంలో ఉన్న 390 మెగావాట్ల దుల్హస్తీ స్టేజ్ 1 ప్రాజెక్ట్ కు పొడిగింపుగాఉంది. చీనాబ్ నదిపై అత్యంత కీలకమైన, దశాబ్దాలుగా పెండింగ్ లో ఉన్న 1,856మెగావాట్ల సవాల్ కోట్ ప్రాజెక్ట్ పనులకు కేంద్రం వేగవంతం చేసింది. ఈ మేరకు నేషనల్ హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ ఈ డ్యామ్, టన్నెల్స్ నిర్మాణానికి అంతర్జాతీయ టెండర్లను ఆహ్వానించింది. ఈమొత్తం ప్రాజెక్ట్ వ్యయం సుమారు రూ.22,700 కోట్లు ఉంటుందని అంచనా. ఇక ప్రస్తుతం సింధూ నది జలాలా ఒప్పందం నిలిపివేత నేపథ్యంలో దశాబ్దాలుగా పాకిస్థాన్ అభ్యంతరాల వల్ల ఆగిపోయిన సవాల్ కోట్, పాకల్ దుల్, రాతల్, కిరు వంటి మెగా ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేసి జమ్మూ కాశ్మీర్ ఇంధన అవసరాలను తీర్చాలని భారత్ నిర్ణయం తీసుకుంది.

## పశ్చిమాసియాలో ముసిరిన యుద్ధమేఘాలు

### గగనతలం మూసివేసిన ఇరాన్



**టెహ్రాన్, మే 23:** అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి తీవ్ర స్థాయికి చేరాయి. ఇరాన్‌పై కొత్త దాడులు చేసేందుకు అమెరికా సన్నద్ధమవుతోందన్న వార్తల నేపథ్యంలో ఇరు దేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. ఈ పరిణామాల నేపథ్యంలో ముందుజాగ్రత్త చర్యగా ఇరాన్ తమ గగనతలాన్ని పూర్తిగా మూసివేస్తున్నట్లు ప్రకటించింది. ఇరు దేశాల మధ్య శాంతి చర్చలు నిలిచిపోవడంతో పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారింది. రాబోయే 24 గంటల్లో దౌత్యపరంగా కీలక పురోగతి లేకపోతే ఇరాన్‌పై భారీ సైనిక చర్యలకు ఆమోదం తెలిపేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మొగ్గు చూపుతున్నారు. దాడులపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని కూడా తెలుస్తోంది. ఈ ఉద్రిక్తతల కారణంగా అమెరికా సైనిక, నిఘా వర్గాలకు చెందిన పలువురు అధికారులు తమ మెమోరియల్ డే వారాంతపు ప్రణాళికలను రద్దు చేసుకున్నట్లు తెలిసింది. శనివారం పరిస్థితులు తీవ్రరూపం దాల్చడంతో న్యూజెర్సీలో తన వారాంతపు పర్యటనను రద్దు చేసుకున్న ట్రంప్ హుటాహుటిన వాషింగ్టన్‌కు తిరిగి వచ్చారు. ఈ సంక్షోభం తీవ్రతకు అద్దం పట్టేలా తన కుమారుడు డొనాల్డ్ ట్రంప్ జూనియర్ వివాహానికి కూడా తాను హాజరుకాలేనని ట్రంప్ స్వయంగా ప్రకటించారు. ప్రభుత్వానికి సంబంధించిన పరిస్థితుల దృష్ట్యా నేను వాషింగ్టన్‌లోనే ఉండటం ముఖ్యమని ఆయన తన ట్రూత్ సోషల్ ఖాతాలో పోస్ట్ చేశారు. ఇది ప్రస్తుతం నెలకొన్న గంభీర స్థితిని తెలియజేస్తోంది. గత ఏప్రిల్‌లో ట్రంప్ ప్రకటించిన తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం ఇప్పటివరకు కొనసాగినప్పటికీ, ఇరు దేశాల మధ్య చర్చలు ముందుకు సాగడం లేదు. ఇరాన్ శుద్ధి చేసిన యురేనియం నిల్వలపై నెలకొన్న ప్రతిష్టంభనే దీనికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఇరాన్‌ను అణ్వాయుధం కలిగి ఉండటానికి అనుమతించబోమని, శుద్ధి చేసిన యురేనియం నిల్వలను దేశం విడిచి తరలించాలని అమెరికా పట్టుబడుతోంది. మరోవైపు తమ యురేనియం నిల్వలను విదేశాలకు తరలించే ప్రసక్తే లేదని ఇరాన్ స్పష్టం చేస్తోంది. ఈ నేపథ్యంలో పశ్చిమాసియాలో మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి.

## భారత్ పర్యాటకులకు థాయిలాండ్ వీసా ఆన్ అరైవల్



**బ్యాంకాక్, మే 23:** భారతీయ పర్యాటకులకు అత్యంత ఇష్టమైన విహారయాత్ర గమ్యస్థానాల్లో ఒకటైన థాయ్‌లాండ్, తన వీసా నిబంధనల్లో సంచలన మార్పులు చేసింది. పర్యాటకాన్ని ప్రోత్స హించేందుకు గతంలో ప్రవేశపెట్టిన 60 రోజుల ఉచిత వీసా పథకాన్ని భారత్ సహా 93 దేశాలకు రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. వీసా కేటగిరీలను క్రమబద్ధీకరించి, సులభతరం చేయడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు థాయ్‌లాండ్ ప్రభుత్వం స్పష్టం చేసింది. థాయ్‌లాండ్ విదేశాంగ మంత్రిత్వ శాఖ పరిధిలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ కాన్సులర్ అఫైర్స్ ప్రకారం ఈ నెల 19న జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ కొత్త వీసా విధానాలకు ఆమోదం లభించింది. ఒక దేశం, ఒక వీసా మినహాయింపు హక్కుఅనే కొత్త మార్గదర్శక సూత్రం ఆధారంగా ఈ మార్పులు చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ కొత్త నిబంధనలు రాయల్ గెజిట్‌లో ప్రచురించిన 15 రోజుల తర్వాత అమల్లోకి వస్తాయి. ఈ మార్పులతో భారత పర్యాటకులకు ఇప్పటివరకు లభించిన వీసా రహిత ప్రవేశ సౌకర్యం దూరమవుతుంది. జులై 2024లో భారత్‌కు 60 రోజుల ఉచిత వీసా పథకాన్ని థాయ్‌లాండ్ వర్తింపజేసింది. దీని ద్వారా ఎక్కువ రోజులు విహారయాత్రకు ప్లాన్ చేసుకునే వారికి థాయ్‌లాండ్ మరింత ఆకర్షణీయంగా మారింది. తాజా నిబంధనల ప్రకారం, భారతదేశాన్ని వీసా ఆన్ అరైవల్ (వీఓఏ) కేటగిరీకి మార్చారు. ఇకపై భారత పర్యాటకులు థాయ్‌లాండ్ చేరుకున్నాక అక్కడి ఇమ్మిగ్రేషన్ చెక్‌పాయింట్ల వద్ద అవసరమైన పత్రాలు సమర్పించి వీసా పొందాల్సి ఉంటుంది. ఈ కేటగిరీ కింద కేవలం 15 రోజులు మాత్రమే దేశంలో ఉండేందుకు అనుమతి లభిస్తుంది. సుదీర్ఘ సెలవులకు బదులుగా చిన్న పర్యటనలకు మాత్రమే ఇది అనుకూలంగా ఉంటుంది. మొదట పర్యాటకాన్ని, ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టేందుకు 60 రోజుల ఉచిత వీసా పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ విధానం వల్ల భద్రతాపరమైన ఆందోళనలు పెరిగాయని థాయ్‌లాండ్ ప్రభుత్వం గుర్తించింది. ముఖ్యంగా అక్రమ ఉపాధి, బినామీ వ్యాపారాలు, అంత ర్జాతీయ నేరాలు పెరిగాయనే ఆరోపణలు వెల్లు వెత్తాయి. పర్యాటకుల సంఖ్య కంటే నాణ్యమైన పర్యాటకులను ఆకర్షించడంపైనే ఇప్పుడు దృష్టి సారిస్తున్నామని, ఆర్థిక ప్రయోజనాలు, దేశ భద్ర తను సమన్వయం చేయడమే తమ లక్ష్యమని థాయ్‌లాండ్ పర్యాటక, క్రీడల శాఖ మంత్రి సురసక్ ఫంచరోయెన్‌వొరాకుల్ గతంలోనే సూచనప్రాయంగా తెలిపారు. వీసా ఆన్ అరైవల్ (వీఓఏ) కేవలం 4 దేశాలకు అజర్‌బైజాన్, బెలారస్, సెర్బియా, భారత్‌లకే పరిమితం. వీరికి 15 రోజుల బసకు అనుమతి ఉంటుంది.

## మేజర్ అభిలాషబార్‌కు ఐక్యరాజ్యసమితి అరుదైన గౌరవం

## మిలిటరీ జెండర్ అడ్వకేట్ అవార్డుకు ఎంపిక



**న్యూయార్కు, మే 23:** భారత రక్షణరంగంలో పనిచేసి యుఎన్ పీస్ కీపింగ్ ఫోర్స్ లో పనిచేసిన మేజర్ అభిలాష బరాక్‌కు అరుదైన గౌరవం దక్కింది. లెబనాన్‌లో ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షక మిషన్‌లో పాల్గొన్న మేజర్ అభిలాషను ప్రతిష్టాత్మక మిలిటరీ జెండర్ అడ్వకేట్ అవార్డుకు సమితి ఎంపిక చేసింది. 2025 యునైటెడ్ నేషనల్ మిలిటరీ జెండర్ అడ్వకేడ్ ఆఫ్ ద ఇయర్ అవార్డును గెలుచుకున్నట్లు యూఎన్ భారత విభాగం తెలిపింది. పశ్చిమ ఆసియా దేశాల్లోని మహిళలు, టీనేజీ అమ్మాయిల్లో జెండర్ అంశాల్లో చైతన్యం కలిగించిన నేపథ్యంలో అభిలాషకు ఆ గుర్తింపు వచ్చినట్లు యూఎన్‌లోని ఇండియన్ పర్మినెంట్ మిషన్ తన ఎక్స్ అకౌంట్‌లో పేర్కొన్నది. లెబనాన్‌లో ఉన్న భారత బెటాలియన్‌లోని ఫిమేల్ ఎంగేజ్మెంట్ టీమ్‌కు ఆమె కమాండర్‌గా ఉన్నారు. లెబనాన్‌లోని యూఎన్ ఇంటీరియం ఫోర్స్‌లో ఆమె సేవలు అందిస్తోంది. భారతీయ ఆర్మీకి చెందిన మహిళా యుద్ధ హెలికాప్టర్ పైలట్‌గా ఆమెకు రికార్డు ఉన్నది. యూఎన్ పీస్‌కీపర్స్ అంతర్జాయతీ దినోత్సవం సందర్భంగా ఈనెల 29వ తేదీన ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయంలో జరిగే ఈవెంట్‌లో అభిలాషను అవార్డుతో సత్కరించనున్నారు. యూఎన్ పీస్‌కీపర్స్ అవార్డు అందుకున్న మూడవ భారతీయ మహిళగా ఆమె గుర్తింపు పొందారు. గతంలో మేజర్ సుమన్ గవాని, మేజర్ రాధికా సేన్ కూడా యూఎన్ పీస్‌కీపర్స్ అవార్డు గెలుచుకున్నారు.



## లడక్‌లో కుప్పకూలిన హెలికాప్టర్

**లేహ్, మే 23:** లడఖ్ లోని లేహ్ ప్రాంతంలో శనివారం భారత ఆర్మీకి చెందిన ఒక చీతా హెలికాప్టర్ ప్రమాదానికి గురైంది. సాంకేతిక లోపం కారణంగా అది కూలిపోయినట్లు తెలుస్తోంది. అయితే ఈ ప్రమాదంలో ఆర్మీ అధికారులు ముగ్గురు త్రుటిలో ప్రాణాలతో బయటపడడం విశేషం. హెలికాప్టర్ పూర్తిగా ధ్వంసమైనప్పటికీ అధికారులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మృత్యుంజయుల సెల్ఫీ తీసుకుని విడుదలచేసిన వైనం అన్ని వర్గాలను ఆకర్షించింది. ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డ తర్వాత కూలిపోయిన హెలికాప్టర్ శిథిలాల ముందు నిలబడి అధికారులు చిరునవ్వుతో సెల్ఫీ క్లిక్‌మనిపించారు.

## తమిళనాడులో పదేళ్ల బాలిక కిడ్నాప్, హత్య

### నేరాలు పెరిగాయంటూ డిఎంకె ధ్వజం

### నిందితులను అరెస్టు చేశాం, కఠిన చర్యలు తప్పవు: సీఎం విజయ్



**కోయంబత్తూరు, మే 23:** తమిళనాడులోని కోయంబత్తూరు నగరంలోని సూలూరు ఏరియాలో కిరాణా సామాన్లు తేవడానికి వెళ్లిన పదేళ్ల బాలిక కిడ్నాప్‌కు గురైంది. ఆపై ఆ చిన్నారిని దుండగులు దారుణంగా హత్య చేశారు. చెరువు సమీపంలో మృతదేహం దొరికింది. ఈ ఘటనపై తమిళనాడు కొత్త సీఎం విజయ్ తీవ్రంగా స్పందించారు. ఇలాంటి అమానవీయ చర్యలను అస్సలు సహించబోమని స్పష్టం చేశారు. ఈ ఘోర ఘటన దిగ్భ్రాంతిని, వేదనను కలిగించింది. ఇలాంటి అమానవీయ నేరాలను సహించబోం. కుటుంబ సభ్యులకు నా సానుభూతి. ఈ కేసుకు సంబంధించి ఇద్దరు నిందితులను ఇప్పటికే అరెస్ట్ చేశారు. సమగ్రంగా విచారణ జరిపి తక్షణమే చార్జ్‌షీట్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించాం. మహిళలు, పిల్లలపై ఇలాంటి ఘోరాలకు ఒడిగట్టే వారికి చట్టప్రకారం కఠిన శిక్ష పడేలా తమిళనాడు ప్రభుత్వం కచ్చితంగా చర్యలు తీసుకుంటుందని విజయ్ స్పందించారు. ఈ హత్య రాష్ట్రంలో పెద్ద రాజకీయ దుమారం రేపింది. కొత్త ప్రభుత్వంపై ప్రతిపక్ష డీఎంకే తీవ్ర విమర్శలు చేసింది. సీఎం విజయ్ పదవి చేపట్టిన 12 రోజుల్లోనే నేరాలు పెరిగాయని ఉదయనిధి స్టాలిన్ ఆరోపించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని మండిపడ్డారు. మరోవైపు గత డీఎంకే ప్రభుత్వమే వ్యవస్థను నాశనం చేసిందని బీజేపీ విమర్శించింది. ఈ కేసులో కార్తీక్, మోహన్ రాజ్ అనే ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. విచారణను వేగవంతం చేయడానికి తమిళనాడు డీజీపీ స్వయంగా కోయంబత్తూర్ వెళ్లారు. సీఎం నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు మృతదేహాన్ని తీసుకోబోమని కుటుంబ సభ్యులు ఆందోళన చేశారు. దీంతో మంత్రులు, ఎమ్మెల్యేలు ఆసుపత్రికి వెళ్లి బాధితులకు న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు.



## నల్లకోటు న్యాయవాదుల్లో 40% మంది నకిలీలే!

### బార్ కౌన్సిల్ చైర్మన్ సిజెఐకి నివేదిక

**న్యూఢిల్లీ, మే 23:** దేశంలో నల్ల కోట్లు వేసుకుని కోర్టుల్లో తిరుగుతున్న న్యాయవాదుల్లో దాదాపు 35 నుంచి 40 శాతం మంది నకిలీలేనని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) ఛైర్మన్, సీనియర్ అడ్వకేట్ మనన్ కుమార్ మిశ్రా సంచలన నివేదిక ఇచ్చారు. వీరంతా నకిలీ సర్టిఫికెట్లు కొనుగోలు చేసి లేదా సృష్టించి కోర్టుల్లో ప్రాక్టీస్ చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ వ్యవహారం తమ దృష్టికి వచ్చిందని, దీనిపై చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఈ నకిలీ డిగ్రీల వ్యవహారాన్ని అడ్డుకోవడానికి బీసీఐ కసరత్తు ప్రారంభించింది. అడ్వొకేట్ల డిగ్రీ సర్టిఫికెట్లను పరిశీలించే ప్రక్రియను బీసీఐ మొదలుపెట్టగా దాదాపు 40 శాతం మంది తమ వెరిఫికేషన్ ఫారాలను పూరించలేదు. ఫారాలు నింపని వీరంతా నకిలీ న్యాయవాదులేనని బీసీఐ అనుమానిస్తోంది. ఈ విషయాన్ని ఇప్పటికే భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) దృష్టికి తీసుకెళ్లినట్లు మనన్ మిశ్రా వెల్లడించారు. సోషల్ మీడియాలో సంచలనంగా మారిన కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమం వెనుక ఉన్న నేపథ్యాన్ని కూడా బీసీఐ మనన్ కుమార్ వివరించారు. గత వారం ఒక పిటిషన్‌ను విచారిస్తున్న సమయంలో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ లాయర్ల డిగ్రీలపై అనుమానం వ్యక్తం చేశారు. నకిలీ డిగ్రీలతో కోర్టుల్లోకి వస్తున్న యువతను ఉద్దేశించే ఆయన కాక్రోచ్ వ్యాఖ్యలు చేశారని, దీనిపై సీబీఐ విచారణ కోరాలని భావిస్తున్నట్లు సీజేఐ చెప్పారని మిశ్రా స్పష్టం చేశారు.

## సంక్షిప్తంగా..

## ఇవాంకా ట్రంప్ హత్యకు కుట్ర?



**వాషింగ్టన్, మే 23:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పెద్ద కుమార్తె ఇవాంకా ట్రంప్ హత్యకు కుట్ర జరిగినట్లు తెలుస్తోంది. ఐఆర్‌జిసితో సంబంధాలున్న ఓ ఉగ్రవాది ఈ కుట్ర పన్నినట్లు అంతర్జాతీయ మీడియా కథనం వెల్లడించింది. 2020లో ఇరాన్ అగ్రశ్రేణి కమాండర్ ఖాసీం సులేమాని హత్యకు ప్రతీ కారంగా ఆమెను హతమార్చేందుకు ఈ పథక రచన చేశాడని పేర్కొంది. కానీ, అతడు ప్లాన్ అమలు చేసేలోపే అరెస్టు అయ్యాడని తెలియజేసింది. 32 యేళ్ల మహమ్మద్ బాఖర్ సాద్ దావూద్ అల్ సాదీ కొంతకాలం క్రితం తుర్కియేలో అరెస్టు అయ్యాడు. ఆ తర్వాత అతడిని అమెరికాకు తరలించారు. అతడిని విచారించిన దర్యాప్తు అధికారులు కీలక విషయాలను గుర్తించారు. మహమ్మద్ వద్ద ఇవాంక కుటుంబం నివసిస్తోన్న ఇంటి బ్లూప్రింట్ ఉందని వెల్లడించారు. ఫ్లోరిడాలోని ఆమె నివాసం ఫొటోను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసినట్లు తెలుస్తోంది.

## రోడ్లపై నమాజ్ నిషేధానికి కేంద్ర మంత్రి మద్దతు



**లక్నో, మే 23:** బహిరంగ ప్రదేశాలు, రోడ్లపై నమాజ్ చేయడాన్ని నిషేధిస్తూ ఉత్తరాఖండ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ శనివారం పూర్తి మద్దతు ప్రకటించారు. మత పరమైన పండుగల సమయంలో శాంతిభద్రతలను కాపాడటానికే అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొ న్నారు. ఈ మేరకు ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామీని ఆయన ప్రత్యేకంగా అభినం దించారు. కొందరు వ్యక్తులు కావాలనే దేశంలో వాతావరణాన్ని పాడు చేయడానికి ప్రయత్నిస్తున్నారని గిరిరాజ్ సింగ్ మండిపడ్డారు. శాంతిభద్రతల దృష్ట్యా ఇటువంటి నిబంధనలు తెచ్చిన ముఖ్య మంత్రులందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## బొగ్గుగనిలో గ్యాస్ పేలుడు: 82 మంది కార్మికులు మృతి



**బీజింగ్, మే 23:** చైనాలోని ఓ బొగ్గు గనిలో గ్యాస్ పేలుడు సంభవించడంతో పెద్ద ఎత్తున ప్రాణనష్టం వాటిల్లింది. ఉత్తర చైనా ప్రాంతంలో జరిగిన ఈ ప్రమాదంలో ఇప్పటివరకు 82 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. మరో తొమ్మిది మంది ఆచూకీ ఇంకా లభించలేదని అక్కడి ప్రభుత్వ అధికారిక మీడియా శనివారం వెల్లడించింది. షాంక్సీ ప్రావిన్స్‌లోని లూషెన్యు బొగ్గు గనిలో ఈ ఘోర ప్రమాదం జరిగింది. గనిలో ఒక్కసారిగా ప్రమాదకరమైన కార్బన్ మోనాక్సైడ్ గ్యాస్ లీకైంది. ఆ విషవాయువు పరిమితికి మించి వేగంగా వ్యాపించడంతో పేలుడు సంభవించింది. ప్రమాదం జరిగిన సమయంలో గని లోపల వందల సంఖ్యలో కార్మికులు పని చేస్తున్నట్లు సమాచారం.

## గ్యాంగ్‌స్టర్ ఉజైర్‌బలోచ్ విందులో క్రికెటర్ ఆఫ్రిది



**కరాచి, మే 23:** పాకిస్థాన్ మాజీ క్రికెట్ కెప్టెన్ షాహిద్ అఫ్రిదీ మరోసారి వివాదంలో చిక్కుకున్నారు. కరాచీకి చెందిన కరడుగట్టిన గ్యాంగ్‌స్టర్ రహమాన్‌డకైట్ సోదరుడు ఉజైర్ బలోచ్‌తో కలిసి ఆయన విందులో పాల్గొన్న పాత ఫోటో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తీవ్ర దుమారం రేగు తోంది. ఈ ఫోటోపై నెటిజన్ల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఫోటో 2013లో కరాచీలో తీసినట్లు తెలుస్తోంది. ఇందులో అఫ్రిదీ, ఉజైర్ బలోచ్ మరికొందరితో కలిసి డిన్నర్ చేస్తూ కన్పిస్తున్నారు. ఉజైర్ బలోచ్ కరాచీలోని లియారీ గ్యాంగ్‌కు నాయకుడిగా పేరుగాంచాడు. హత్యలు, దోపి డీలు, బెదిరింపులు వంటి అనేక నేరారోపణలు ఎదుర్కొంటున్న అతడిని 2016లో పాక్ అధికారులు అరెస్ట్ చేశారు.

## తులసి గబ్బర్డ్ రాజీనామాకు ట్రంప్ ఆమోదం



**వాషింగ్టన్, మే 23:** అమెరికా జాతీయ నిఘా సంస్థ (డిఎన్ఐ) డైరెక్టర్, భారత సంతతి మహిళ తులసి గబార్డ్ రాజీనామాను ఆమోదిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. తులసి రాజీనామాను ఆమోదించిన అధ్యక్షుడు ట్రంప్, ఆమె సేవలను ప్రశంసించారు. తులసి అద్భుతంగా పనిచేశారు, ఆమె లేని లోటు మాకు తెలుస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. ప్రిన్సిపల్ డిప్యూటీ డైరెక్టర్ ఆరోన్ లూకాస్ తాత్కాలిక డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తారని వైట్‌హౌస్ ప్రకటించింది. తన భర్త అబ్రహం విలియమ్స్‌కు అరుదైన బోన్ క్యాన్సర్ సోకినందున, ఆయనకు తోడుగా ఉండేందుకు ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు ఆమె వెల్లడించారు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు పంపిన తన రాజీనామా లేఖను సోషల్ మీడియాలో పంచుకున్నారు.

## ఉగ్రవాది అంత్యక్రియలకు టాప్ ఉగ్రవాదనేతలు హాజరు..

**ఇస్లామాబాద్, మే 23:** ఉగ్రవాదానికి తమ దేశం కేంద్రం కాదని పాకిస్థాన్ చెప్పే మాటలు మరోసారి నీటిమూటలయ్యాయి. ప్రపంచంలోనే మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్టులకు పాకిస్థాన్ సురక్షితమైన అడ్డాగా మారిందన్న ఆరోపణలకు బలం చేకూరుస్తూ, ఇస్లామాబాద్‌లోనే ఓ కీలక పరిణామం చోటుచేసుకుంది. హత్యకు గురయిన ఓ ఉగ్రవాది అంత్యక్రియలకు అనేక మంది టాప్ టెర్రరిస్టులు బహిరంగంగా హాజరై, పాకిస్థాన్ అసలు స్వరూపాన్ని ప్రపంచానికి చూపించారు. నిషేధిత అల్‌బద్ర్ ఉగ్రవాద సంస్థకు చెందిన టాప్ కమాండర్, డాక్టర్ అనే కోడ్‌నేమ్‌తో పనిచేసిన అర్జుమంద్ గుల్జార్ దార్ అలియాస్ హంజా బుర్హాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో గుర్తుతెలియని వ్యక్తుల కాల్పుల్లో మరణించాడు. శుక్రవారం అతని మృతదేహానికి ఇస్లామాబాద్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అమెరికాచే ఉగ్రవాదిగా ప్రకటించబడిన హిజ్బుల్ ముజాహిదీన్ చీఫ్ సయ్యద్ సలావుద్దీన్‌తో పాటు అల్ బద్ర్ చీఫ్ బఖ్త్ జమీన్ ఖాన్ వంటి కీలక ఉగ్రవాదులు హాజరయ్యారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఫొటోలు, వీడియోలలో ఈ దృశ్యాలు స్పష్టంగా కనిపించాయి. ముఖ్యంగా బఖ్త్ జమీన్ ఖాన్ చుట్టూ ఏకే47 వంటి ఆధునిక ఆయుధాలతో ఉగ్రవాదులు కట్టుదిట్టమైన భద్రతా వలయాన్ని ఏర్పాటు చేయడం గమనార్హం. జమ్మూకశ్మీర్‌లోని పుల్వామా జిల్లా రత్నిపొరకు చెందిన బుర్హాన్, చట్టబద్ధమైన పత్రాలతో పాకిస్థాన్‌కు ప్రయాణించి అల్‌బద్ర్ సంస్థలో చేరాడు.

2019లో 40 మంది సీఆర్ పీఎఫ్ జవాన్లను పొట్టనపెట్టుకున్న పుల్వామా దాడిలో ఇతని పేరు తొలిసారిగా తెరపైకి వచ్చింది. కశ్మీర్‌లోని యువతను ఉగ్రవాదం వైపు మళ్లించడం, నియామకాలు చేపట్టడం, పాకిస్థాన్ నుంచి నిధులు సమకూర్చడంలో బుర్హాన్ కీలక పాత్ర పోషించాడని భారత భద్రతా ఏజెన్సీలు చెబుతున్నాయి. 2022లో భారత్ ఇతడిని ఉగ్రవాదిగా ప్రకటించింది.


## త్రిసూరులో ఏనుగు భీబత్సం: అనేక వాహనాలు ధ్వంసం

**త్రిస్సూర్, మే 23:** కేరళలోని త్రిస్సూర్‌లో ఒక దేవాలయంలో జరిగే ఉత్సవం కోసం తీసుకువచ్చిన ఏనుగు కట్టడినుంచి తప్పించుకుని రెండు కిలోమీటర్లు పెరుగెత్తింది. అంతేకాకుండా అడ్డుగా ఉన్న అన్నింటిని కూల్చివేస్తూ విధ్వంసం సృష్టించింది. రెండుకిలోమీటర్లమేర పరుగులుపెట్టిన ఈ ఏనుగు వాహనాలు, ప్రహారీగోడలు, వాటి గేట్లు నివాసిత ప్రాంతాల్లో ఆస్తులను కూడా ధ్వంసంచేసింది. ఆలయవేడుకల కోసం శివమ్ లక్ష్మీ అయ్యప్పన్ అనే ఏనుగును కొల్లంనుంచి తీసుకునివచ్చారు. ఉదయం వేడుకలకు ముందే 9.15 గంటలకు చెంబుక్కవు టౌన్‌హాల్‌ప్రాంతంలో ఏనుగు భీభత్సం సృష్టించింది. ప్రతిరోజులాగా ఉదయం ఏనుగును స్నానంచేసేందుకు ఉపక్రమిస్తుండగా మావటిలనుంచి తప్పించుకుని ఒక్కసారిగా ఆవేశపూరితంగా మారింది. అక్కడినుంచి పరారవుతూ పార్కింగ్‌చేసి ఉన్న కార్లు, ఆటోరిక్షాలు, మోటారు సైకిళ్లను ధ్వంసంచేసి వాటిని తిరగబెడుతూ వెళ్లింది. చెంబుక్కవు పోస్టాఫీసు ఆవరణలో కూడా విధ్వంసం సృష్టించింది. చేవురు గాంధీనగర్ హౌసింగ్ కాలనీలో కూడా ప్రవేశించి నివాసితులను భయభ్రాంతులకు గురిచేసింది. ఎవ్వరికీ ప్రాణాపాయం లేనప్పటికీ ఏనుగు భారీ విధ్వంసం సృష్టించిందని, ఆస్తినష్టం రిగిందని అధికారులు చెపుతున్నారు. సంగీత అనే ఒక మహిళతోపాటు కారులోప్రయాణిస్తున్న ఒక బాలికకు కూడా ఏనుగుదాడిలో గాయాలయ్యాయి. పోలీసులు,



అటవీ అధికారులు, ఏనుగును కట్టడిచేసే స్క్వాడ్ బృంసభ్యులు, స్థానిక అధికారులు స్పాట్‌కువెళ్లి సుదీర్ఘ కసరత్తులు తర్వాత ఏనుగును తమ అధీనంలోకి తీసుకున్నారు. కాళ్లకు చైన్లు వేయడంద్వారా ఏనుగు ఆవేశాన్ని కట్టడిచేసారు.

# ప్రైవేట్ భాగస్వామ్యంతో వడివడిగా పర్యాటక ప్రాజెక్టులు



## ఎటువంటి ఆటంకాలు లేకుండా అనుమతులు మంజూరు

## పర్యాటక రంగంలో కొత్త ఆవిష్కరణలు, సృజనాత్మకతకు పెద్దపీట

## పర్యాటక సదస్సులో మంత్రి జూపల్లి కృష్ణారావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 23:** పర్యాటక రంగాన్ని రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ప్రధాన ఇంజిన్‌గా మారుస్తామని, తెలంగాణను అంతర్జాతీయ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. గచ్చిబౌలిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ ప్రాంగణంలో శనివారం 'డెస్టినేషన్ తెలంగాణ - రోడ్ అహెడ్' పేరిట నిర్వహించిన ప్రతిష్టాత్మక పర్యాటక సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పర్యాటక వారోత్సవాల ముగింపు సందర్భంగా ఈ సదస్సును నిర్వహించారు. రాష్ట్రంలోని పర్యాటక రంగ అభివృద్ధికి ప్రభుత్వం సంపూర్ణ సహకారాన్ని అందిస్తుందని, ప్రైవేట్ భాగస్వామ్యంతో పర్యాటక ప్రాజెక్టులను వేగవంతం చేస్తామని అన్నారు. తెలంగాణను అంతర్జాతీయ పర్యాటక గమ్యస్థానంగా మార్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇందుకోసం కొత్త పర్యాటక పాలసీని తీసుకువచ్చామని తెలిపారు. పర్యాటక రంగంపై పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు, యాజమాన్యాలు ముందుకు రావాలని మంత్రి పిలుపునిచ్చారు. ప్రతిపాదనలతో పాటు డీపీఆర్‌లను సమర్పిస్తే, ఎలాంటి జాప్యం లేకుండా అనుమతులు ఇస్తామని హామీ ఇచ్చారు. ఈజ్ ఆఫ్ డూయింగ్‌లో భాగంగా పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం పూర్తి మద్దతునిస్తుందని, నూతన పర్యాటక విధానంలో భాగంగా అన్ని రకాల ప్రోత్సాహకాలు కల్పిస్తామని స్పష్టం చేశారు. నిరర్థకంగా ఉన్న ఆస్తులను పర్యాటక అవసరాల కోసం దీర్ఘకాలిక లీజు పద్ధతిలో కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, దీని ద్వారా పర్యాటక ప్రాజెక్టుల నిర్వహణ సులభతరం అవుతుందని చెప్పారు. పర్యాటక ప్రాజెక్టుల నిర్వహణలో ఆసక్తి గలవారు కొత్త ఆవిష్కరణలు, సృజనాత్మక ప్రతిపాదనలతో రావాలని కోరారు. ఎంపిక చేసిన పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ ప్రకటనలు జారీ చేయనుందని, దీని ద్వారా ఎంపికైన సంస్థలకు డిజైన్లు, ప్రాజెక్ట్ అంచనాల వ్యయాన్ని కూడా ప్రభుత్వమే భరిస్తుందని పేర్కొన్నారు. కొన్ని పర్యాటక ప్రాంతాల్లో కనీస అవసరాలైన తాగునీరు, రెస్ట్ రూమ్స్ (టాయిలెట్స్), వసతి గృహాలు, రెస్టారెంట్లు కూడా లేవని, వీటిని అధిగమించేందుకు మౌలిక వసతులు, మొబైల్ గ్లాస్ హౌస్‌లు, కాన్వాస్ టెంట్లు వంటి ఆధునిక వసతుల ఏర్పాటుకు ప్రైవేట్ వ్యక్తులు ముందుకు రావాలని, వారికి ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని చెప్పారు. పర్యాటక రంగం కేవలం వినోదం మాత్రమే కాదని, ఇది రాష్ట్ర, దేశ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచే కీలకమైన రంగమని మంత్రి పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన చిన్న దేశాలు పర్యాటకంపైనే ప్రధానంగా ఆధారపడి ఉన్నాయని ఉదాహరించారు. పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడం, ప్రమోట్ చేయడం, అభివృద్ధి చేయడం మనందరి సమిష్టి బాధ్యత అని పేర్కొన్నారు. పర్యాటక రంగం వృద్ధి చెందితేనే అనుబంధ పరిశ్రమలు లాభపడతాయని, యువతకు భారీగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. దేశ, విదేశీ పర్యాటకలను ఆకర్షించేలా రాష్ట్రంలో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. ఇప్పటికే భువనగిరి కోటలో రోప్‌వే వంటి పర్యాటక ఆకర్షణలపై దృష్టి సారించామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో పర్యాటక, భాషా సాంస్కృతిక శాఖప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్, టీజీటీడీసీ పటేల్ రమేష్ రెడ్డి, పర్యాటక శాఖ డైరెక్టర్ లక్ష్మణ్ రంజిత్ నాయక్, నిథమ్ డైరెక్టర్ వెంకటరమణ, పురావస్తు శాఖ డైరెక్టర్ ప్రొ. అర్జున రావు తదితరులు పాల్గొన్నారు.

# ఫ్యూచర్‌సిటీని రద్దు చేస్తామని హారీశ్‌రావు చెప్పడం బాధ్యతారాహిత్యం

## ఫార్మాసిటీలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు

## ఐటి మంత్రి శ్రీధర్‌బాబు ఆగ్రహం

**హైదరాబాద్, మే 23, ప్రభాతవార్త:** హారీశ్‌రావు అమెరికా పోయిన పగటి కలలు కంటున్నారు, అధికారంలోకి వస్తే ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని ఐటి మంత్రి శ్రీధర్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. సిఎల్‌పి కారాలయంలో మంత్రి మాట్లాడుతూ హారీశ్‌రావు ప్రకటన తెలంగాణ ప్రాంతానికి అన్యాయం చేస్తున్నట్లు కనిపిస్తుందనీ ఆవేదన చెందారు. తెలంగాణకు పెట్టుబడులు అడ్డుకోవడంతో తెలంగాణ యువతకు అన్యాయం చేసి ఉద్యోగాలు రాకుండా చేయాలనుకుంటున్నారా? అని ప్రశ్నించారు. బిఆర్ఎస్ నాయకులు రాష్ట్రంలో బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. వాళ్లకు రాష్ట్ర ప్రయోజనాలు అవసరం లేదు మీ రాజకీయల కోసం పారిశ్రామిక సంస్థలను పక్క రాష్ట్రాలకు పంపించడం ఎంత వరకు సమంజసమనీ అడిగారు. రాష్ట్ర అభివృద్ధిని



అడ్డుకోవాలనే ఎజెండా పెట్టుకున్నారనీ ఆయన చెప్పారు. ఎన్నికల్లో ఓటమి నిరాశ నుండి ఇంకా తెరుకోలేక పోతున్నారని అన్ని ఎన్నికల్లో ఓడిపోయిన ఇంకా బుద్ధి మారట్లేదని విమర్శించారు. ఫ్యూచర్ సిటీపై మెట్రో రైలుకు ఆనాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ వేసిన అభివృద్ధి తప్ప టిఆర్ఎస్ హాయంలో ఒక్క కిలో మీటర్ అభివృద్ధి కూడా జరగలేదనీ అన్నారు. జంట నగరాల ప్రజలను దృష్టిలో పెట్టుకొని మెట్రోను అభివృద్ధి చేస్తా అంటే అడ్డుకుంటున్నారన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీ కాలుష్య కర్మాగారాలు రావొద్దు అని ప్రజలు కోరుకుంటున్నారని ఫ్యూచర్ సిటీలో ప్రజలు ఎలా కోరుకుటుంన్నారో అలాగే జరుగుతుందని, యువతకు బంగారు భవిష్యత్తు కోసం ఫుచర్ సిటి అని ఆయన అన్నారు.కాలుష్యం లేని పరిశ్రమలు, గ్రీన్ పార్మ కు మేము కట్టుబడి ఉన్నామనీ చెప్పారు. ఇప్పటికైనా బిఆర్ఎస్ వాళ్ళు ఆలోచించాలిలేదంటే వచ్చే ఎన్నికల్లో బిఆర్ఎస్ ఓడిపోవడం ఖాయమనీ హితవు చెప్పారు. మూసీ నది ప్రక్షాళన సమయంలో పేదవాడికి నష్టం జరిగితే వారికి న్యాయం చేయాల్సిన బాధ్యత మాపై ఉందనీ తెలిపారు. ఇతర రాష్ట్రాల నుండి వలసలను దృష్టిలో పెట్టుకొని తాగునీరు,రోడ్లు, రవాణా ఏర్పాటు చేయాల్సిన బాధ్యత తమపై ఉందనీ తెలిపారు. గత ప్రభుత్వాల మంచి నిర్ణయాలు అమలు కొనసాగిస్తున్నాం. ఫార్మాసిటీలో ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు.



నిమ్స్ వైద్యులను సన్మానించిన మంత్రి దామోదర రాజనర్సింహా

# రాష్ట్రంలో మరో 79 కొత్త డయాలసిస్ కేంద్రాలు

## నిమ్స్ వైద్యులు, సిబ్బందిని సన్మానించిన మంత్రి దామోదర రాజనర్సింహా

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), మే 23, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం డయాలసిస్ నుంచి అవయవ మార్పిడి వరకు సమగ్ర కిడ్నీ వైద్య సేవల వ్యవస్థను అభివృద్ధి చేస్తోందని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా అన్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా వందకు పైగా డయాలసిస్ కేంద్రాలు పనిచేస్తుండగా, మరో 79 కొత్త డయాలసిస్ కేంద్రాలను నూతనంగా ఏర్పాటు చేస్తున్నామని స్పష్టం చేశారు. నిమ్స్ ఆసుపత్రిలో 2 వేల కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను పూర్తి చేసి మరో అరుదైన మైలురాయిని చేరుకున్న నేపథ్యంలో శనివారం నిమ్స్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన నిమ్స్ వైద్యులు, నర్సులు, టెక్నీషియన్లు, సహాయక సిబ్బందిని సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నిమ్స్‌లో 2 వేల కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తికావడం తెలంగాణ ప్రభుత్వ వైద్య రంగానికి గర్వకారణమని అన్నారు. ఈ ఘనత సాధించడంలో కృషి చేసిన వైద్యులు, నర్సులు, టెక్నీషియన్లు, సిబ్బందిని అభినందించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వ ఆసుపత్రులు కార్పొరేట్ ఆసుపత్రులకు సమానంగా వైద్య సేవలు అందిస్తూ కొత్త ప్రమాణాలను నెలకొల్పుతున్నాయన్నారు. ఒకప్పుడు కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు చాలా ఖరీదైనవిగా ఉండి కొద్దిమందికే అందుబాటులో ఉండేవని, ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేద రోగులకు ఉచిత అవయవ మార్పిడి సేవలు అందిస్తోందన్నారు. శస్త్రచికిత్సతో పాటు జీవితాంతం అవసరమైన మందులను ఉచితంగా అందిస్తున్నామన్నారు. గాంధీ, ఉస్మానియా ఆసుపత్రులలో అవయవ మార్పిడి సేవలను మరింత బలోపేతం చేస్తున్నామని చెప్పారు. ఇటీవల గాంధీ ఆసుపత్రిలో రాష్ట్ర అవయవ మార్పిడి కేంద్రాన్ని ప్రారంభించినట్లు వెల్లడించారు. ఇక టిమ్స్ సనత్‌నగర్‌ను అవయవ మార్పిడి చికిత్సల కోసం అత్యుత్తమ కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. .

# ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ముందుకొచ్చిన ప్రైవేట్ సంస్థలు

## సిఎం సమక్షంలో విద్యా శాఖతో

## ఒప్పందం చేసుకున్న రహేజా, రామ్‌కీ, యశోదా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 23:** తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలలు, విద్యాభివృద్ధి కోసం రహేజా గ్రూప్, రామ్ కీ ఫౌండేషన్, యశోద ఫౌండేషన్ ముందుకు వచ్చాయి.కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) కింద రహేజా, రామ్‌కీ, యశోదా సంస్థలు నిధులు అందజేస్తున్నాయి. శనివారం సాయంత్రం సెక్రటేరియట్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో విద్యా శాఖతో రహేజా గ్రూప్, రామ్‌కీ ఫౌండేషన్, యశోద ఫౌండేషన్ ఒప్పందం చేసుకున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి కి ఒప్పంద పత్రాలను రహేజా గ్రూప్ అధ్యక్షుడు నీల్ సి. రహేజా, రామ్ కీ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ అల్లా దాక్షాయణి, యశోదా గ్రూప్ డైరెక్టర్ గోరుకంటి దేవేందర్ రావు అందజేశారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జవహర్ నగర్ ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్ వరకు తరగతుల కొత్త ప్రాంగణానికి మొత్తం ఖర్చులో 40శాతం అంటే రూ. 19.66 కోట్లు రాంకీ సంస్థ ఖర్చు చేయనుంది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ జెడ్‌హెచ్ఎస్ ఉన్నతీకరణలో భాగంగా ప్రీ ప్రైమరీ నుంచి ఐదవ తరగతి, ఇంటర్ తరగతుల నిర్మాణం కోసం మొత్తం ఖర్చులో 40శాతం అంటే రూ.10.4 కోట్లు రాంకీ సంస్థ భరించనుంది. రంగారెడ్డి జిల్లా కొండాపూర్‌లో ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్ వరకు తరగతుల కోసం అవసరమైన రూ.50.50 కోట్లను రహేజా గ్రూప్ భరించనుంది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉప్పల్ సుభాష్ నగర్ ఎంపిపిఎస్‌లో ప్రీ ప్రైమరీ, 6వ, 7వ తరగతుల కోసం అవసరమైన రూ.12.20 కోట్లను యశోదా హాస్పిటల్స్ భరించనుంది. ఈ కార్యక్రమంలో విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ దేవసేన, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ (ఐజిబిసి) ఛైర్మన్ సి శేఖర్‌రెడ్డి, తెలంగాణ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎండి గణపతిరెడ్డి పాల్గొన్నారు.

# పాలిసెట్‌లో 82.94 శాతం అర్హత

## ఎల్‌పి సెట్‌లో 57.28 శాతం అర్హత

## ఫలితాలను విడుదల చేసిన సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన

**హైదరాబాద్, మే 23, ప్రభాతవార్త:** పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(పాలీసెట్)- 2026లో 82.94 శాతం అర్హత సాధించగా, ఎల్‌పీ సెట్-2026 లో 57.28 శాతం అర్హత సాధించారు. పాలీసెట్ ఫలితాలతోపాటు లాటరల్ ఎంట్రీ పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఎల్‌పీ సెట్)-2026 ఫలితాలను శనివారం విడుదల చేశారు. ఫలితాలను మాసబ్ ట్యాంక్‌లోని సాంకేతిక భవన్‌లో సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన ఫలితాలను విడుదల చేశారు. పాలీసెట్-2026 పరీక్షను ఈ నెల 13న రాష్ట్ర వ్యాప్తంగా 293 కేంద్రాల్లో పరీక్షలను నిర్వహించారు. పరీక్షలకు 1,06,439 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 98,029 మంది పరీక్షకు హాజరయ్యారు. వారిలో81,307 మంది అర్హత సాధించారు. పరీక్షకు హాజరైన వారిలో 52,201 మంది బాలురు ఉండగా వారిలో 41,719 మంది (79.92శాతం) అర్హత సాధించారు. బాలికలు 45,829 మంది పరీక్షకు హాజరు కాగా వారిలో 39,588 మంది (86.92శాతం) అర్హత సాధించారు. లాటరల్ ఎంట్రీ పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఎల్‌పీ సెట్)-2026లో 57.28 శాతం మంది అర్హత సాధించారు. ఎల్‌పీ సెట్ పరీక్ష ఈ నెల 15న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించారు. పరీక్షలకు 522 మంది బాలురు దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 491 మంది బాలురు ఉండగా అందులో 281 మంది(57.23శాతం) అర్హత సాధించారు. బాలికలు 19 మంది దరఖాస్తు చేసుకోగా 17 మంది పరీక్షకు హాజరయ్యారు. వారిలో 10 (58.82శాతం) అర్హత సాధించారు. ఈ నెల 27 నుంచి కౌన్సెలింగ్‌ను నిర్వహించనున్నట్టు కమిషనర్ ప్రకటించారు. వెబ్ కౌన్సెలింగ్ ప్రక్రియలో సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కాని అభ్యర్థులు 202-627 విద్యా సంవత్సరానికి పాలిటెక్నిక్ ( రాష్ట్ర సాంకేతిక విద్యా మండలి అనుబంధ కళాశాల)లో ప్రవేశానికి అనర్హులుగా పరిగణింపబడతారని అధికారులు ప్రకటించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ అందించే వివిధ డిప్లొమాకోర్సులలో ప్రవేశం మరియు కౌన్సెలింగ్ కోసం ప్రత్యేక ప్రవేశ నోటిఫికేషన్ జారీ చేయబడుతుంది,ప్రాస్పెక్టస్, సీటు స్థానం, పాలిటెక్నిక్ ల జాబితా, ఫీజు వివరములు మొదలైనవి విశ్వవిద్యాలయ వెబ్ సైట్‌లో పొందుపరిచామని, కొండా లక్ష్మణ్ తెలంగాణ హార్టికల్చరల్ యూనివర్సిటీ అందించే వివిధ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశం, కౌన్సెలింగ్ కోసం ప్రత్యేక ప్రవేశ నోటిఫికేషన్ జారీ చేయబడుతుందని, ప్రాస్పెక్టస్, సీటుస్థానం పాలిటెక్నిక్ ల జాబితా, ఫీజు వివరములన్నీ విశ్వవిద్యాలయవెబ్ సైట్‌లో పొందు పరచబరచ పడుతుందని అధికారులు ప్రకటించారు. పి వి నర్సింహా రావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ అందించే వివిధ డిప్లొమా కోర్సు లో ప్రవేశం, కౌన్సెలింగ్ కోసం ప్రత్యేక ప్రవేశ నోటిఫికేషన్ జారీ చేయబడుతుందని, ప్రాస్పెక్టస్, సీటుస్థానం పాలిటెక్నిక్ ల జాబితా, ఫీజు వివరములు విశ్వవిద్యాలయ వెబ్ సైట్‌లో పొందుపరచబడింది. పాలీసెట్-2026 ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో 120 మార్కులతో 10 మంది మొదటి ర్యాంక్‌ను సాధించారు. నామాల లోకేశ్, బానోతు హేమంత్, అల్వీయా షిఫాలీ, మహ్మద్ మహబూబ్ అర్బాజ్ అలీ, కోట్ల అపూర్వ, అన్నం హరి కృష్ణ, జంగాల అవినాష్ అంగద్, చిలక నందవర్ధన్ రెడ్డి, కందూరి ఆదిత్య శౌరీ, రుద్రోజు సాజన్, దూరెడ్డి వన్మై రెడ్డి 10 మంది టాప్-1 ర్యాంక్‌ను సాధించారు. ఎంబైపీసీలో కోట్ల అపూర్వ, రుద్రోజు సాజన్ 120 మార్కులతో టాప్-1 ర్యాంక్‌ను సాధించారు. కనకాల హేమంత్ రెడ్డి 3వ ర్యాంక్ సాధించగా 4వ ర్యాంక్‌ను జక్కు తుషారా, షేక్ ఫర్మాన్ షా ఇద్దరు సొంతం చేసుకున్నారు.

# టిజిసిఇటి-2026 ఫేజ్-2 ఫలితాలు విడుదల

## సంక్షేమ గురుకులాల్లో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి మరో అవకాశం

**హైదరాబాద్, మే 23, ప్రభాతవార్త:** తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన టీజీసీఈటీ-2026 ప్రవేశ పరీక్ష ఫేజ్-2 ఫలితాలను శనివారం విడుదల చేసినట్లు చీఫ్ కన్వీనర్ (ఎఫ్ఏసీ) శారద తెలిపారు. గురుకులాల్లో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఉన్న బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీతో పాటు, గిరిజన గురుకుల పర్గి (బాలికలు), ఖమ్మం (బాలురు) స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లలో 8వ తరగతి రెగ్యులర్ ప్రవేశాల కోసం ఫేజ్-2 ఫలితాలను శనివారం ప్రకటించినట్లు పేర్కొన్నారు. ఈ ప్రవేశ పరీక్షను ఫిబ్రవరి 22న రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులు తమ ఫలితాలను అధికారిక వెబ్‌సైట్ల ద్వారా తెలుసుకోవచ్చని సూచించారు. ఎంపికైన అభ్యర్థులు జూన్ 7 వరకు తమకు కేటాయించిన విద్యాసంస్థల్లో సంబంధిత ధ్రువపత్రాలు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో హాజరై ప్రవేశ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని తెలిపారు. గ్రామీణ, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో గురుకుల విద్యాసంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని చీఫ్ కన్వీనర్ శారద విజ్ఞప్తి చేశారు.

# రాష్ట్ర పోలీసు శాఖలో కృత్రిమ మేధ విభాగం ఏర్పాటు



ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న డిజిపి సి.వి.ఆనంద్. చిత్రంలో టెక్నికల్ విభాగం డిజి శ్రీనివాస్‌రావు సహా ఇతర అధికారులు

## శాంతిభద్రతలు, నేరాల నివారణలో ఎఐని విస్తృతంగా వాడాలని డిజిపి ఆదేశం

**హైదరాబాద్, మే 23, ప్రభాతవార్త:** రాష్ట్ర పోలీసు శాఖలో కొత్తగా కృత్రిమమేధ(ఎఐ) విభాగం ఏర్పాటయ్యింది. శాంతిభద్రతల నిర్వహణ, నేరాల నియంత్రణతోపాటు పోలీసింగ్ సామర్థ్యాన్ని మరింత పెంచేందుకు దీనిని ఏర్పాటు చేసినట్లు డిజిపి సి.వి.ఆనంద్ తెలిపారు. డిజిపి కార్యాలయంలో శనివారం జరిగిన ఉన్నతాధికారుల భేటీలో ఆయన మాట్లాడుతూ ఎఐ భాగంగా ప్రత్యేక సాంకేతిక బృందాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ పోలీసు వెబ్‌సైట్, హాక్ ఐ, సిసిటిఎన్ఎస్, హెచ్ఆర్ఎంఎస్ వంటి అన్ని సాంకేతక ప్లాట్‌ఫాంలను డిజిపి కార్యాలయ పరిధిలో తీసుకువచ్చి ఒకే వ్యవస్థ కింద పనిచేయాల్సిన అవసరం వుందని ఆనంద్ తెలిపారు. అధికారుల బదలీలు లేదా మార్పులతో సంబంధం లేకుండా ఈ సాంకేతికత కార్యక్రమాలు నిరంతరాయంగా పనిచేసే విధంగా ప్రత్యేక సాంకేతిక బృందాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. సాంకే తికపై ఆసక్తి వుండి, స్వచ్ఛందంగా సేవలందిం చేందుకు ముందుకు వచ్చే యువ పోలీసు అధికారులను ఈ బృందంలో చేర్చుకుంటామని డిజిపి తెలిపారు. అదనపు డేటా లేయర్లను వేగంగా అనుసంధానిం చేందుకు వీలుగా కేంద్రీకృత హై స్పీడ్ ప్లాట్‌ఫాంను అభివృద్ధి చేయాలని ప్రత్యేక సాంకేతిక బృందాన్ని డిజిపి సూచించారు. దీంతో పాటు పోలీసు శాఖ చేబట్టే అన్ని కృత్రిమ మేధ ప్రాజెక్టులను పర్యవేక్షించేందుకు డిజిపి కార్యాలయంలో మార్వెల్ తరహాలో ప్రత్యేక ఎఐ టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని డిజిపి ఆదేశిం చారు. ఎఐ ఆధారిత ప్లాట్ ఫాంలైన సిసిటిఎన్ఎస్ 2.0 సమర్థవంతంగా అమలయ్యేలా డేటా ఆధారిత డ్యాష్ బోర్డుల రూపకల్పనకు కార్యాచ రణ ప్రణాళిక సిద్ధం చేయాలని డిజిపి ఆదేశించారు. వీటితో పాటు పోలీసు శాఖ ఫైళ్ల కదలికలను నిరంతరాయంగా పర్యవేక్షించేందుకు వీలుగా డిజిపి ఎస్టాబ్లిష్‌మెంట్ పరిధిలోని అన్ని విభాగాలను ఈ ఆఫీస్ సిస్టంతో అనుసంధానించాలని డిజిపి ఆదేశించారు. ఎఐ ఆధారిత ప్రాజెక్టులు నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు వీలుగా ఐదుగురు ఐపిఎస్ అధికారులతో కూడిన ఓ బృందాన్ని డిజిపి నియమించారు. రాబోయే ఆరు నెలల్లో ఈ ప్లాట్ ఫాంలు అందుబాటులోకి రావాలని ఆయన ఆదేశించారు. ఇందులో భాగంగా సిసిటిఎన్ఎస్ 2.0 బాధ్యతలతో పాటు హెచ్ఆర్ఎంఎస్ బాధ్యతలు, సిఐడితో సమన్వ యం చేసుకునే బాధ్యతలను నగర జాయింట్ సిపి శ్వేతకు అప్పగించారు. డిఐజి భాస్కరన్‌కు సిసిటిఎన్ఎస్ బాధ్యతలతో పాటు ఎఐ సాంకేతి కతను అనుసంధానించే బాధ్యతలను అప్పగిం చారు. ఐటి విభాగం ఎస్‌పి రూపేష్‌కు సోషల్ మీడియా, విడియో అనలిటిక్స్, ఎఐ ఆధారిత డ్రోన్ టెక్నాలజి పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించారు. ఎస్‌పి అపూర్వరావుకు డేటా ఇంటెలిజెన్స్, శిక్షణ కార్యక్రమాలు, సిస్టం డిజైనింగ్ బాధ్యతలను అప్పగించారు. ఐజి అవినాష్ మొహాంతికి ట్రాఫిక్, రోడ్ సేఫ్టీ మాడ్యుళ్ల పర్య వేక్షణ బాధ్యతలను అప్పగించారు.




ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న కవిత

# సెంట్రింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించేదాకా ధర్నా చేపడతా

## తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్ (ధర్నాచౌక్), మే 23, ప్రభాతవార్త:** సెంట్రింగ్ కార్మికుల సమస్యలు రెండు రోజులలో పరిష్కరించాలని, లేనిపక్షం వారి సమస్యలు పరిష్కారం అయ్యే వరకు వారికి మద్దతుగా తాను ధర్నా చేపడతాననితెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. శనివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తునన ధర్నాకార్యక్రమంకు ఆమె హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ తెలంగాణలో గుంపు మేస్త్రి అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆరోపించారు.గుంపుమేస్త్రి హటావో-తెలంగాణ బచావో అనే నినాదంతో ప్రభుత్వంపై పోరాడుదామని పిలుపునిచ్చారు. సెంట్రింగ్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోతే జీహెచ్ఎంసీ ఎన్నికలలోకాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాత పెడతారని హెచ్చరించారు. హైదరాబాద్ నిర్మాణంలో సెంట్రింగ్ కార్మికుల పాత్ర మరువలేనిదని, తాము అధికారంలోకి వచ్చాక, సెంట్రింగ్ కార్మికుల అన్ని సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. రెండు రోజులలో ప్రభుత్వం సెంట్రింగ్ కార్మికులతో చర్చలు జరిపి, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సెంట్రింగ్ కాంట్రాక్టర్ల సమస్యల పరిష్కారం కోసంచేస్తున్న పోరాటానికి బీఆర్ఎస్ పూర్తి మద్దతు ఉంటుందని బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాసయాదవ్ హామీ ఇచ్చారు. సెంట్రింగ్ కార్మికులు చేపట్టిన రెండు రోజుల ధర్నా కార్యక్రమంకు మద్దతు తెలిపిన అనంతరం ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణానికి పునాది ఎంత ముఖ్యమో సెంట్రింగ్ కార్మికులు కూడా అంతే ముఖ్యమని అన్నారు.

# బిజెపి పాలనలో కుంటుపడిన అభివృద్ధి



## రూ.147 లక్షల కోట్లకు పెరిగిన అప్పు

## 22 కోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయి?

## కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

**హైదరాబాద్, మే 23, ప్రభాతవార్త:** బిజెపి పాలనలో ప్రజాస్వామ్యం గొంతు నులిపేయడమే కాకుండా దేశ అభివృద్ధి కుంటుపడటంతోపాటు రూ.147 లక్షల కోట్లకు అప్పుపెరిగిందని కాంగ్రెస్ వర్కింగ్ ప్రసిడెంట్ జగ్గారెడ్డి ఆరోపించారు. గాంధీభవన్ శనివారం జగ్గారెడ్డి విలేఖరులతో మాట్లాడుతూ రాహుల్ గాంధీ మాట్లాడిన సంవిధాన్ బచావ్ అత్యంత ప్రాధన్యత అంశమనీ దేశ ప్రజలకు రాజ్యాంగం కవచం లాంటిదనీ అన్నారు. కర్ణుడు ఎప్పుడైతే వాటిని దానం ఇస్తాడో ఆయన మరణంకు చేరువైందని బిజెపికి పూర్తి మెజార్టీ వస్తే మన రాజ్యాంగం ప్రమాదంలో పడిపోవడమే కాకుండా మన స్వేచ్ఛ కూడా పోతుందని ఆయన అభిప్రాయపడ్డారు. భారత మొదటి ప్రధానమంత్రి నెహ్రూ రాజ్యాంగంతో ప్రజాస్వామిక విధానంలో పాలనకు బాటలు వేశారని, ఇందిరాగాంధీ సామ్యవాదరీతి సమాజ స్థాపనకు బ్యాంకులను జాతీయకరణ చేసి పేదరిక నిర్మూలనకు 25 సూత్రాల కార్యక్రమాన్ని ఆచరించి దేశం అభివృద్ధి వైపు తీసుకెళ్ళిందని తెలిపారు. రాజీవ్ గాంధీ వచ్చి ఐటీ కి బీజం వేయడంతోపాటు 18 ఏళ్లకు ఓటు హక్కు ఇచ్చారు. పంచవర్ష ప్రణాళికలతో కాంగ్రెస్ పార్టీ వ్యవసాయం, పారిశ్రామిక, సేవారంగాలలలో దేశంను ముందుకు తీసుకెళ్ళిందని అప్పుడు బిజెపి, మోడీ కానీ లేదనీ గుర్తుచేశారు. 2019 లో ఎన్నికల కమిషన్ ను అడ్డం పెట్టుకుని గెలిచారనీ ఇప్పుడు రాజ్యాంగం ఇచ్చిన స్వేచ్ఛను కొల్లగొడుతూ ఓట్లు చోరీ చేసి అధికారంలోకి రావడానికి సర్ పేరుతో కుట్రుల చేస్తున్నారని ఆవేదన చెందారు. బిజెపి అధికారం లోకి రాకముందు 54 లక్షల కోట్లు అప్పు ఉంటే ఇప్పుడు ఏలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేయకుండా 147 లక్షల కోట్లు అప్పు పెరిగిందనీ కాంగ్రెస్ హయాంలో రోడ్లపై టోల్ కట్టకుండా ఉచితంగా ప్రయాణం చేస్తే ఇప్పుడు టోల్ కట్టి రోడ్లపై ప్రయాణం చేయాల్సిన దుస్థితి నెలకొందని దేశ ప్రజలు గమనించాలనీ కోరారు . రాహుల్ గాంధీ కుటుంబం ఏ రోజు ఓట్ల కోసమో.. అధికారం కోసమో పని చేయలేదని అన్నారు. దేశ ప్రజలు బాగుండాలని ఆలోచనే రాహుల్ గాంధీ ఆలోచన అని అన్నారు. గాంధీ కుటుంబం ఆస్తులే కాదుప్రాణ త్యాగం కూడా చేశారనీ అన్నారు . ఉపాధి హామీ లాంటి పథకాలు పేద కుటుంబం కి మేలు చేయాలనే చేశారనీ అన్నారు. మీరు వాడే ఫోన్ లు తెచ్చింది రాజీవ్ గాంధీ అని అన్నారు. మోడీ ఏం చేశారనీ ప్రశ్నిస్తే యుద్ధం చేశారని అంటారు, యుద్ధం ఎవరికి లాభం అని ప్రశ్నించారు. ఇందిరాగాంధీ యుద్ధం చేసి పాకిస్తాన్‌ను తూర్పు, పశ్చిమ దేశాలుగా రెండు ముక్కలు చేసిందని అంతేకాదు పేదలకు భూములు ఇండ్లు పంచారనీ అన్నారు.



ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కీమ్‌పై జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో నీల వెంకటేష్, ఎంపి ఆర్.కృష్ణయ్య, ఎస్.మధుసూదనాచారి, గుజ్జ సత్యం తదితరులు

# ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎత్తివేసే కుట్రలు మానుకోకుంటే రాష్ట్రం అగ్నిగుండమే

## అఖిలపక్ష సమావేశంలో బిసి నేతల హెచ్చరిక

**హైదరాబాద్ మే 23, ప్రభాతవార్త:** ఫీజుల రీయింబర్స్‌మెంట్ స్కీం ఎత్తివేయాలని ప్రభుత్వం చేస్తున్న కుట్రలు మానుకోవాలని, లేనిపక్షంలో రాష్ట్రం అగ్నిగుండంగా మారుతుందని బిసి అగ్రనేతలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక హామీల అమలులో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీల వెంకటేష్ అధ్యక్షతన శనివారం కాచిగూడలో అఖిలపక్ష రౌండ్‌టేబుల్ సమావేశంలో రాజ్యసభసభ్యుడు ఆర్.కృష్ణయ్య, శాసనమండలి బిఆర్ఎస్‌పక్ష నాయకుడు ఎస్. మధుసూదనాచారి, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కీం ఎత్తివేయాలని ప్రభుత్వం చేస్తున్న కుట్రలను వెంటనే మానుకోవాలని ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ స్కీమ్‌ను రద్దు చేయ దానికి ప్రయత్నిస్తే విద్యార్థి ఉద్యమాన్ని ఆపడం ఎవరి తరం కాదని హెచ్చరించారు.

## కేంద్ర వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే అభిజిత్‌కు బెదరింపులు

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**హైదరబాద్, మే 23,ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే అభిజిత్‌కు బెదిరింపులు చేస్తున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ విమర్శించారు. కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడైన అభిజిత్‌ను భయభ్రాంతులకు గురిచేస్తూ, బెదరించడాన్ని తమ పార్టీ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. కేంద్రప్రభుత్వ వైఫల్యాలపై యువత నుంచి వస్తున్న తీవ్రవ్యతిరేకతను గమనించి, కేంద్రం తమ విధానాలను మార్చుకోవాలని డిమాండ్ చేశారు. తనను బీజేపీలో చేరాలని డబ్బులు వస్తాయని, లేకపోతే నిన్ను అమెరికాలోనే ఖతం చేస్తామని, భారతదేశంలో ఉన్న తన కుటుంబాన్ని, తన తల్లిదండ్రులని కూడా వదలకుండా ఖతం చేస్తామంటూ బెదిరింపులకు దిగడం అత్యంత దుర్మార్గమన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఒక వ్యక్తిని, ఆయన కుటుంబాన్ని ఈ విధంగా భయభ్రాంతులకు గురిచేసే ధోరణి ప్రజాస్వామ్యానికే ప్రమాదకరమన్నారు. అభిజిత్ 'దళిత కార్డు వాడుతున్నాడని, స్కిల్స్ (నైపుణ్యాలు) లేవని అవమానకరంగా మాట్లాడుతున్నారన్నారు. రాజ్యాంగం అందించిన ప్రజాస్వామిక హక్కులను, లౌకిక భావాలను, సోషలిస్టు ఆశయాలను కాపాడడంలో కేంద్రం పూర్తిగా చేతులెత్తేసిందన్నారు. బెదిరింపులు, భయభ్రాంతులు, హత్య రాజకీయాల ద్వారా యువత గొంతు నొక్కాలని చూస్తే ప్రభుత్వాలు భ్రమల్లో ఉన్నట్టేనని, ఇటువంటి అణచివేత చర్యలను నేటి యువతరం సహించదని జాన్ వెస్లీ హెచ్చరించారు.

# రూ.10 వేల కోట్ల గ్రీన్ ఎనర్జీపై అలసత్వం

### పెట్టుబడుల పట్ల రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం

### ఇంధన రంగంలో స్వయం సమృద్ధి దిశగా కేంద్రం

### రెనర్జయిన్ సదస్సులో కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, మే 23, ప్రభాతవార్త:** తెలంగాణలో గ్రీన్ ఎనర్జీకి సంబంధించి పెట్టుబడుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చూపుతోందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి కిషన్‌రెడ్డి విమర్శించారు. హైదరాబాద్‌లో నేషనల్ ఫోరమ్ రెంగీ ఆధ్వర్యంలో శనివారం జరిగిన రెనర్జైన్-2026 సదస్సులో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో సోలార్, విండ్ ఎనర్జీతో పాటు, పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్ట్స్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలైన నేవేలీ లిగ్నయిట్ కార్పొరేషన్, కోలిండియా రూ.10 వేల కోట్ల పెట్టుబడులు పెట్టడానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఈ విషయమై గత ఏడాది అక్టోబర్‌లో ఆయా సంస్థలు తెలంగాణ ప్రభుత్వానికి లేఖ రాశాయన్నారు. అయితే దురదృష్టవశాత్తూ దీనిపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇంతవరకు ఎటువంటి సమాధానం రాలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి, భూమి కేటాయింపులు జరిపి ఈ నిధులను ఉపయోగించుకోవాలని సూచించారు. మారుతున్న కాలపరిస్థితులు, రోజురోజుకూ పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా దేశాన్ని ఇంధన రంగంలో స్వయంసమృద్ధిగా మార్చేందుకు కేంద్రం ఒక పకడ్బందీ బహుముఖ వ్యూహంతో ముందుకు సాగుతోందని చెప్పారు.

ప్రస్తుతం పశ్చిమ ఆసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం వల్ల ప్రపంచవ్యాప్తంగా ఇంధన భద్రత ఆందోళనకరంగా మారిందని, ఇలాంటి క్లిష్ట పరిస్థితులను దాదాపు 12 ఏళ్ల క్రితమే ముందుగా ఊహించిన ప్రధాని నరేంద్ర మోదీ దేశ ఇంధన భద్రతను సరికొత్తగా పునర్నిర్వచించారన్నారు. సాంప్రదాయ వనరులపై దేశం అతిగా ఆధారపడకుండా, పర్యావరణాన్ని కాపాడుతూనే దేశ ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టించేలా ఒక క్లీన్ ఎనర్జీ విప్లవం తీసుకొచ్చారని ప్రశంసించారు. దేశంలో రెన్యూవబుల్ ఎనర్జీ వినియోగం ఒక శక్తివంతమైన ప్రజా ఉద్యమంగా మారిందని పేర్కొన్నారు. గ్రీన్ ఎనర్జీ రంగంలో కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకాలు ప్రజలపై ఆర్థిక భారం పడకుండా, సోలార్ ఎనర్జీ వైపు వారు సులభంగా మారేలా చూసేందుకు కేంద్రం ఏకంగా 70 శాతం వరకు భారీ సబ్సిడీలను అందిస్తోందని వివరించారు. ఇందులో భాగంగా పీఎం సూర్య ఘర్ యోజన ద్వారా ప్రతి ఇంటిపై సోలార్ ప్యానెల్ ఏర్పాటు చేయడం ద్వారా మధ్యతరగతి, పేద కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందడమే కాకుండా, అదనపు కరెంట్‌ను విక్రయించి ఆదాయం పొందే వీలు కలుగుతుందని, అలాగే పీఎం కుసుమ్ యోజనలో రైతులు తమ పొలాల్లో సోలార్ పంపులను ఏర్పాటు చేసుకుని, పగటిపూటే ఉచితంగా, నమ్మకమైన విద్యుత్ పొందడానికి ఇది తోడ్పడుతుందని, నేషనల్ సోలార్ మిషన్‌లో భాగంగా దేశాన్ని ప్రపంచంలోనే సోలార్ ఇంధన ఉత్పత్తిలో అగ్రగామిగా నిలబెట్టడానికి ఈ మిషన్ నిరంతరం పనిచేస్తోందని వెల్లడించారు. తెలంగాణకు కేంద్ర ప్రాధాన్యత పవర్ గ్రిడ్ పటిష్టత కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రగతికి, ఇంధన అవసరాలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. రాష్ట్రంలో డిసెంట్రలైజ్‌డ్ గ్రిడ్ అనుసంధానిత సౌర విద్యుత్ ప్లాంట్ల కోసం అదనంగా 450 మెగావాట్ల సామర్థ్యాన్ని ఆమోదించడంతో పాటు, 20 వేల సోలార్ అగ్రికల్చర్ పంప్‌సెట్లను కేటాయించినట్లు తెలియచేశారు. అంతేకాకుండా తెలంగాణలో విద్యుదుత్పత్తి కోసం ఎన్టీపీసీ ద్వారా రూ.44 వేల కోట్ల భారీ పెట్టుబడులు పెట్టగా, ఇప్పటికే 1600 మెగావాట్ల విద్యుత్ అందుబాటులోకి వచ్చిందన్నారు. ప్రతి పౌరుడిని కేవలం వినియోగదారుడిగానే కాకుండా ఒక ఇంధన ఉత్పత్తిదారుడిగా మార్చడమే కేంద్ర ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని, యువత, పారిశ్రామికవేత్తలు కొత్త ఆవిష్కరణలతో ఈ స్వచ్ఛ ఇంధన ఉద్యమంలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు.

## 28న జరగాల్సిన ఎన్విరాన్‌మెంటల్ పరీక్ష వాయిదా

### బక్రీద్ నేపథ్యంలో 29న నిర్వహణ

### ప్రకటించిన ఇంటర్ బోర్డు

**హైదరబాద్, మే 23,ప్రభాతవార్త:** ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా ఈ నెల 28న జరగాల్సిన ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్షను వాయిదా వేశారు. ఈ నెల 28(గురువారం) బక్రీద్ పండుగ నేపథ్యంలో పరీక్షను వాయిదా వేసినట్టు ఇంటర్ బోర్డు శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. పరీక్షను ఈ నెల 29న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించనున్నట్టు ప్రకటనలో పేర్కొంది.

# ఆర్థిక సంఘం నిధులు రూ.4,35,236 కోట్లు

### తెలంగాణకు రూ.9,968 కోట్లు కేటాయింపు

### ఉత్తర్వులు జారీ చేసిన కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ

**హైదరబాద్, మే 23,ప్రభాతవార్త:** దేశంలోని వివిధ రాష్ట్రాలకు 16వ ఆర్థిక సంఘం నిధులు కేటాయిస్తూ కేంద్రం నిర్ణయించింది. ప్రధానంగా దేశంలోని గ్రామీణ స్థానిక సంస్థల రూపురేఖలు మార్చేందుకు ఈ 16వ ఆర్థిక సంఘం భారీగా నిధులు కేటాయించింది. 2026-27 నుండి 2030-31 ఆర్థిక సంఘం వరకూ ఐదేండ్ల కాలానికి మొత్తం రూ.4,35,236 కోట్ల గ్రాంటును సిఫార్సు చేస్తూ కేంద్ర ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణకు ఐదేండ్ల కాలపరిమితితో మొత్తం రూ.9,968 కోట్లు కేటాయించింది. ఇందులో బేసిక్ గ్రాంట్స్ కింద రూ.7,974 కోట్లు, పెర్ఫార్మెన్స్ విభాగంలో రూ.1,994 కోట్లు సిఫార్సు చేసింది. అయితే తెలంగాణ కంటే ఏపీకి అదనంగా రూ.6,659 కోట్లు కేటాయించడం విశేషం. ఆంధ్రప్రదేశ్‌కు ఐదేండ్లలో మొత్తం రూ.16,627 కోట్లు అలాట్ చేసింది. ఇందులో బేసిక్ గ్రాంట్స్ రూ.13,302 కోట్లు, పెర్ఫార్మెన్స్ కింద రూ.3,325 కోట్లు ఇచ్చింది. అయితే, ఆర్థిక సంఘం నిధుల్లో 80 శాతం బేసిక్ గ్రాంట్స్ కింద, మిగిలిన 20 శాతం పెర్ఫార్మెన్స్ గ్రాంట్స్ కింద కేటాయించారు. బేసిక్ గ్రాంట్స్ 50 శాతం నిధులను టైడ్ కింద కేటాయించారు. ఇందులో తాగు నీరు, పారిశుద్యం, ఓడీఎఫ్ ప్లస్ నిర్వహణకు మాత్రమే వినియోగించాలి. మిగిలిన 50 శాతం (అన్టైడ్) నిధులను స్థానిక అవసరాల కోసం వినియోగించుకోవచ్చు అని పేర్కొంది. ఇదే సమయంలో ఈ నిధుల వినియోగానికి సంబంధించి ఆర్థిక శాఖ మార్గదర్శకాలను సైతం విడుదల చేసింది. సకాలంలో ఎన్నికలు నిర్వహించి పాలక వర్గాలు కొలువు దీరాలని పేర్కొంది. రెండేండ్ల ఆడిట్ రిపోర్టులను ఆన్లైన్‌లో పొందుపరచాల్సి ఉంటుంది. అలాగే ప్రొవిజనల్ అకౌంట్స్ అందుబాటులో ఉంచడంతో పాటు, పంచాయతీలు తమ సొంత ఆదాయాన్ని పెంచుకోవాలి. గ్రామ పంచాయతీల్లో ఏడాదికి సగటున ఒక్కో ఇంటి నుంచి కనీసం రూ.1,200 పన్ను వసూలు చేసే దిశగా అడుగులు వేయాలి. నిధుల వినియోగానికి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు ఈ గ్రామ్ స్వరాజ్ పోర్టల్లో అప్లోడ్ చేయాలని స్పష్టం చేసింది.




టీం టీషర్ట్‌ను ఆవిష్కరిస్తున్న వివిధ జట్ల ప్రతినిధులు

## జూన్ 20 నుంచి 'తెలంగాణ క్రికెట్ లీగ్'

### రాష్ట్రవ్యాప్తంగా 8 జట్లు.. జూన్ 7న క్రికెటర్ల వేలం

### హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్

**హైదరాబాద్, మే 23,ప్రభాతవార్త:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో టీ20 తరహాలో టీజీ20 క్రికెట్ లీగ్‌కు శ్రీకారం చుట్టారు. టీజీ20 టోర్నీలో ఎనిమిది క్రికెట్ జట్లను ఏర్పాటు చేశారు. హైదరాబాద్, మెదక్, రంగారెడ్డి, వరంగల్, నల్గొండ, మహబూబ్‌నగర్, కరీంనగర్, ఖమ్మం జట్లు ఉన్నాయి. వచ్చే నెల 20న తొలి మ్యాచ్, జులై 11న ఫైనల్ మ్యాచ్ జరగనుంది. టీజీ20 టీమ్‌ల బిడ్‌లను హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ తెరిచింది. అలాగే జూన్ 7న టీజీ20 క్రికెటర్ల వేలం వేయనున్నారు. హైదరాబాద్ జట్టును రూ.7.50 కోట్లకు ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్, రంగారెడ్డి జట్టును రూ.7.20 కోట్లకు బూరుగు ఇన్‌ఫ్రాదక్కించుకుంది. వరంగల్ టీంను రూ.6.55కోట్లకు బైన్ గ్లోబల్ రిసోర్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ దక్కించుకుంది. మెదక్ జట్టును రూ.6.33 కోట్లకు భృందా ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ దక్కించుకుంది. నల్గొండ జట్టును రూ.5.06 కోట్లకు కిషోర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ దక్కించుకుంది. కరీంనగర్ టీంను రూ.4.57 కోట్లకు ఈఐపీఎల్ గ్రూప్, తిబరుమాల్ దక్కించుకుంది. మహబూబ్‌నగర్ జట్టును రూ.4.50 కోట్లకు వీరభద్ర స్టీల్స్ దక్కించుకుంది. ఖమ్మం టీంను రూ.4.44 కోట్లకు అన్విత గ్రూప్ దక్కించుకుంది. వచ్చే నెల 7న టీజీ20 క్రికెటర్ల వేలం నిర్వహించనున్నారు.

## భవిష్యత్ వ్యాపార అవకాశాల్లో సిఎల పాత్ర కీలకం

### ఐసిఎఐ కాన్వకేషన్‌లో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 23:** ప్రస్తుతం దేశ ప్రగతిలో చార్టర్డ్ అకౌంటెంట్ల ప్రాధాన్యత పెరుగుతున్నదని, భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతున్నదని, కొత్తగా వచ్చిన పన్నుల నిబంధనలు, జిఎస్‌టి వంటి కొత్త పన్నుల వ్యవస్థ వలన చార్టర్డ్ అకౌంటెంట్ల పాత్ర, పరిధి వేగంగా పెరుగుతున్నదని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పేర్కొన్నారు. శనివారం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసిఎఐ) కాన్వకేషన్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మరోవైపు ఆదాయాలు పెరుగుతున్న కొద్దీ, వ్యాపారాలు పెరుగుతున్న కొద్దీ, పన్నుల చెల్లింపుల్లో పారదర్శకత పెరగడము, అందుబాటులోకి వస్తున్న ఆధునాతన టెక్నాలజీ వంటి అనేక అంశాల వలన సమాజంలో సిఏలకు అవసరం మరింత పెరిగిందన్నారు.1520 సంవత్సరాల కింద సిఏ చదవడం, సిఏల అవసరం చాలా తక్కువగా ఉండేదని, అయితే సిఏ కోర్సులో ఉన్న కఠినత్వం వలన అనేకమంది సిఏ కోర్సు తీసుకోవడానికి వెనుకంజ వేసేవారన్నారు. అయితే, ఇంత కఠినమైన కోర్సును కూడా అత్యంత పట్టుదలతో అధిగమించిన ప్రతి ఒక్క సిఏ విద్యార్థికి కేటీఆర్ పట్టుదలతో అధిగమించడం పట్ల వారందరికీ అభినందనలు తెలియజేశారు.

చార్టర్డ్ అకౌంటెంట్ అంటే కావడం అంటే కేవలం పరీక్ష పాస్ అవ్వడం మాత్రమే కాదని, తీవ్రమైన ఒత్తిడిని, తీవ్రమైన అనిశ్చితిని తట్టుకొని చదివి, వైఫల్యాలను దాటుకొని ముందుకు సాగడం అని కేటీఆర్ అన్నారు. చాలామంది జీవితంలో వైఫల్యాలను, కష్టకాలాలను ఎదుర్కోలేక చేతులెత్తేస్తారని, అయితే ఈ కాన్వకేషన్‌లో ఉన్న ప్రతి ఒక్క యువతీ, యువకుడు అత్యంత కఠినమైన కోర్సును పూర్తి చేసుకోవడం అంటే ఖచ్చితంగా భవిష్యత్తులో రాబోయే ప్రతి ఒక్క సవాలును ధైర్యంగా ఎదుర్కోగలమని నిరూపించుకున్నవారని అభినందించారు. భారతదేశంలో ప్రస్తుతం వ్యాపారంతో పాటు స్టార్టప్‌ల సంఖ్య భారీగా పెరిగిందని, అనేక మంది యువత తమ సొంత వ్యాపార, వాణిజ్య అవకాశాలను సృష్టించుకునే దిశగా సాగుతున్నారన్నారు.

అలాంటి వారందరికీ సిఏల యొక్క ఆర్థిక మార్గదర్శనం, మద్దతు అవసరమన్నారు. ఒక రకంగా చెప్పాలంటే, రానున్న భవిష్యత్తు వ్యాపార వాణిజ్య అవకాశాల్లో, దేశ ఆర్థిక ప్రగతిలో సిఏల పాత్ర మరింత పెరుగుతుందన్న నమ్మకం తనకు ఉందని కేటీఆర్ తెలిపారు. ఇక చార్టర్డ్ అకౌంటెంట్లు ప్రస్తుత టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి అంశాల పైన కూడా దృష్టి సారించి, తమ వృత్తిలో ఏ విధంగా ఉపయోగించుకోవాలో ఆలోచిం చాలన్నారు. ఖచ్చితంగా పెరుగుతున్న సాంకేతికత వలన మనిషి ఉత్పాదకత కూడా భారీగా పెరుగుతుందన్న నమ్మకం తనదని, ఖచ్చితంగా ప్రస్తుతం మారుతున్న వ్యవస్థలు, టెక్నాలజీ టూల్స్ వలన సిఏల పనితీరుకు కూడా ఎంతగానో ఉపయోగపడతాయన్న విషయాన్ని కేటీఆర్ ప్రస్తావించారు.

చివరగా, ఈ రోజు ఈ స్థాయికి చేరుకున్న ప్రతి ఒక్క సిఏకి శుభాకాంక్షలు తెలిపిన కేటీఆర్... ఈ స్థాయికి రావడానికి వారి వారి తల్లిదండ్రులు చేసిన త్యాగాలను మరవకూడదని, మీ ఎదుగుదలలో వారి పాత్రను ఎప్పటికీ గుర్తుంచుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. ఆ తర్వాత కాన్వకేషన్ కార్యక్రమంలో కేటీఆర్ పలువురికి పట్టాలు అందించారు.

## వర్షాకాలంలో బొగ్గుపై అప్రమత్తం

### ఉత్పత్తికి ఆటంకం లేకుండా చూడాలి

### సింగరేణి సిఎండి బుద్ధప్రకాష్

**హైదరాబాద్, మే 23,ప్రభాతవార్త:** రాష్ట్రంలో మరో పది రోజుల్లో వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో సింగరేణిలో బొగ్గు ఉత్పత్తికి ఎటువంటి ఆటంకం లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సింగరేణి సిఎండి డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి ఆదేశించారు. వర్షాకాలంలోనూ థర్మల్ విద్యుత్ కేంద్రాలకు తగినంత బొగ్గును సరఫరా చేయాలని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో శనివారం అన్ని ఏరియాలలోని జనరల్ మేనేజర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సింగరేణి సంస్థ ఉత్పత్తి చేస్తున్న బొగ్గులో 95 శాతం బొగ్గు ఓపెన్ కాస్ట్ గనుల నుంచి వస్తోందన్నారు. భారీ వర్షాలు కురిసినప్పుడు ఓపెన్ కాస్ట్ గనుల్లో నీరు నిలువ ఉండి ఉత్పత్తికి ఆటంకం కలుగుతుండటం సాధారణమని తెలిపారు. అయితే నీటిని బయటకు తోడి ఉత్పత్తిని కొనసాగించేందుకు సింగరేణి ఇప్పటికే అన్ని ఓపెన్ కాస్ట్ గనుల్లో 100 కు పైగా భారీ పంపులను, మోటార్లను ఏర్పాటు చేసిందని చెప్పారు. వీటి ద్వారా నీటిని తవ్వి బయటకు పోస్తున్నారని, అయితే భారీ వర్షాల వల్ల నీటి పరిమాణం మరింత పెరిగే అవకాశం ఉండటం వల్ల కంపెనీ పంపులతో పాటు కొన్ని ప్రైవేటులో కూడా ఏర్పాటు చేయాలని వివరించారు. ఓవర్ బర్డెన్, బొగ్గు బెంచీల వద్ద నీరు నిలువ లేకుండా చూడాలని, హాల్ రోడ్లను పటిష్టపరచుకోవాలని, తగినన్ని పంపులను సమకూర్చుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన సూచించారు. దీనికోసం కార్పోరేట్ కార్యాలయంలోని సంబంధిత జీఎంలు టెండర్లకు సంబంధించిన చర్యలు తీసుకోవాలన్నారు. దీనికి సంబంధించిన ప్రతిపాదనలు, ప్రణాళికల గురించి కూడా ఆయన గనులవారీగా చర్చించారు.



## రాష్ట్ర కుల గణన దేశానికే ఆదర్శం

### డిప్యూటీ సిఎం విక్రమార్కతో బిసి సంఘాల భేటీ

**హైదరాబాద్, మే 23, ప్రభాతవార్త:** తెలంగాణలో కుల గణన కోసం అకుంఠిత దీక్షతో కృషి చేసిన రాష్ట్ర ప్రభుత్వం దేశానికే ఆదర్శమని బీసీ సంఘాలు ప్రశంసించాయి. ఈ మేరకు దీనికి సంబంధించి హైదరాబాద్‌లో శనివారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో బీసీ సంఘాలు భేటీ అయ్యాయి. జనగణనలో భాగంగా బీసీ కులగణనను కూడా చేపట్టవచ్చని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు హార్షణీయమని, ఇది కులగణన వ్యతిరేకులకు చెంపపెట్టు లాంటిదని బీసీ సంఘాలు స్పష్టం చేశాయి. ఈ తీర్పుతోనైనా కేంద్రం తన మనసు మార్చుకుని, ప్రస్తుతం దేశంలో జరుగుతున్న మొదటి విడత జనాభా గుర్తింపు ప్రక్రియలోనే ఓబీసీ కుటుంబాల లెక్కింపును కూడా చేపట్టాలని డిమాండ్ చేశాయి దేశవ్యాప్తంగా జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు రాజ్యాంగబద్ధమైన హక్కులు దక్కాలన్నాయి. బీసీ సమాజం చేసిన సుదీర్ఘ పోరాటం, తెలంగాణ ప్రజా ప్రభుత్వ కృషి ఫలితంగానే ఈరోజు సుప్రీం నుండి అనుకూల తీర్పు వచ్చిందని తెలిపాయి. దేశంలో సామాజిక, రాజకీయ, ఆర్థిక అసమానతలను సరిచేయడానికి కుల గణన ఎంతో అవసరమని పేర్కొన్నాయి. ప్రభుత్వాలు సరైన సంక్షేమ విధానాలను రూపొందించడానికి కులాల వారీగా లెక్కలుండాలని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేయడాన్ని తాము పూర్తిగా స్వాగతిస్తున్నామని తెలిపారు.

## సోమవారం నుంచి మూడురోజులపాటు బిజెపి పోరుబాట

### ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులతో ముఖాముఖి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 23:** సోమవారం నుంచి మూడురోజులపాటు బీజేపీ పోరుబాట చేపట్టనుంది. రైతు గోస బీజేపీ భరోసా పేరుతో ఈ పోరుబాట సాగనుంది. తొలిరోజు తాండూరులో రైతులను సమస్యలు అడిగి తెలుసుకోనున్న నేతలు, రెండోరోజు గజ్వేల్, భువనగిరి, వరంగల్‌లో, మూడోరోజు భూపాలపల్లి, కాటారం, మంథని, పెద్దపల్లిలో పోరుబాట సాగనుంది. ఇందులో భాగంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులతో ముఖాముఖి నిర్వహించిన అనంతరం బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నిరసన చేపట్టనున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావు ఆధ్వర్యంలో పోరుబాట సాగనుంది. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రైతుల ధాన్యం కొనుగోలు విషయంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. మక్క, జొన్నతో పాటు ఇతర పంటలను కూడా చివరిగింజ వరకు కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇప్పుడు ఆ హామీలను నిల బెట్టుకోలేక రైతులను మోసం చేస్తున్నారని తప్పుపట్టారు. రైతులకు సరైన సమాచారం ఇవ్వకుండా, కొనుగోళ్లలో ఆలస్యం చేస్తూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా రైతులను మోసం చేయడం మానుకొని, రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని వెంటనే కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి, ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశం కోసం నిరంతరం శ్రమించే నాయకుడిగానే కాకుండా, అవినీతి రహిత పరిపాలనకు ప్రతీకగా నరేంద్ర మోదీ నిలిచారని చెప్పారు. అదే స్ఫూర్తితో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వాలు దేశంలో అందిస్తున్న సుపరిపాలనను ప్రజలు గమనిస్తున్నారు.

## విద్యుత్ ఒప్పందాలు, జలాల మళ్లింపు, ఆర్థిక అక్రమాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు ఫిర్యాదు

**హైదరాబాద్, మే 23, ప్రభాతవార్త:** గ్రీన్‌కో విద్యుత్ ఒప్పందాలు, జలాల మళ్లింపు, ఆర్థిక అక్రమాలపై ఎన్‌ఫోర్స్‌ఎంట్ డైరక్టరేట్‌కు ఫిర్యాదులు అందాయి. సామాజిక కార్యకర్త బక్క జడ్సన్ గ్రీన్‌కో సంస్థ, తెలంగాణ ప్రభుత్వం, సంబంధిత అధికారులపై తీవ్రమైన ఆరోపణలతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కు శనివారం అధికారిక ఫిర్యాదు దాఖలు చేశారు. ఫిర్యాదులో ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా పిన్నాపురంలో గ్రీన్‌కో సంస్థ ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ రిన్యూవబుల్ ఎనర్జీ, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. శ్రీశైలం బ్యాక్‌వాటర్స్, గోరకల్లు జల వ్యవస్థలను ప్రైవేట్ విద్యుత్ ఉత్పత్తి కోసం వాణిజ్య ప్రయోజనాలకు ఉపయోగించారని ఆరోపించారు. అంతర్రాష్ట్ర జల వివాదాలు సుప్రీంకోర్టు మరియు ట్రిబ్యునల్స్‌లో పెండింగ్‌లో ఉన్నప్పటికీ ఈ ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చారని అభ్యంతరం వ్యక్తం చేశారు.

అలాగే తెలంగాణ ప్రభుత్వం జెన్కో ద్వారా గ్రీన్‌కో సంస్థతో యూనిట్‌కు రూ.6.70 నుండి రూ.6.75 వరకు అధిక ధరకు విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు చేసిందని అయితే పోటీ బిడ్డింగ్ విధానాలు, నియంత్రణ కమిషన్ అనుమతులు పాటించలేదని ఆరోపించారు. ఈ వ్యవహారంలో తెలంగాణ ప్రభుత్వ పాత్రపై కూడా దర్యాప్తు జరపాలని ఫిర్యాదులో కోరారు. గ్రీన్‌కోకు అనుకూలంగా విధాన పరమైన మద్దతు, ప్రోత్సాహం, అధిక ధరల విద్యుత్ కొనుగోలు ఒప్పందాలకు సహకారం అందించారనే ఆరోపణలు చేశారు. ప్రధానంగా పోటీ బిడ్డింగ్ విధానాలు ఉల్లంఘించబడ్డాయని, తెలంగాణ ప్రజలపై అదనపు ఆర్థిక భారం మోపబడిందని, ప్రజా జల వనరులను ప్రైవేట్ లాభాల కోసం వినియోగించారని, పర్యావరణ, సాగునీటి, నియంత్రణ అనుమతులపై సమగ్ర విచారణ అవసరమని, విదేశీ నిధుల వినియోగంపై కూడా దర్యాప్తు జరపాలని కోరారు. పీపీఏలు, టారిఫ్ అనుమతులు, జల కేటాయింపులు, విదేశీ నిధుల వివరాలను పరిశీలించాలని, అవినీతి నిరోధక చట్టం, మనీ లాండరింగ్ చట్టం, విద్యుత్ చట్టం కింద విచారణ జరపాలని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఈ ఫిర్యాదులో పేర్కొన్నారు.

## కాక్రోచ్ జనతా పార్టీ పేరిట సైబర్ నేరగాళ్ల మోసాలు

### ప్రజలు అప్రమత్తంగా ఉండాలని

### సైబర్ పోర్టల్ నిపుణుల సూచనలు

**హైదరాబాద్, మే 23, ప్రభాతవార్త:** నాలుగు రోజులుగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న కాక్రోచ్ జనతా పార్టీపై కేంద్ర హోం శాఖ నిషేధం విధించినా దీనిని సైబర్ నేరగాళ్లు తమకు అనుకూలంగా మలచుకుని అమాయకులకు టోకరా వేస్తున్న ఉదంతాలు వెలుగు చూశాయి. పంజాబ్‌లోని లూధియానాలో కాక్రోచ్ జనతా పార్టీ పేరిట సైబర్ నేరగాళ్లు ఓ వ్యాపారికి పది లక్షల రూపాయల టోకరా వేయగా ఢిల్లీ సహా మరి కొన్ని చోట్ల ఈ తరహా మోసాలు వెలుగు చూసినట్లు సైబర్ క్రైం పోర్టల్‌కు శనివారం నాడు సమాచారం అందింది. కాక్రోచ్ జనతా పార్టీ అంటూ ఎలాంటిది లేదని కొందరు సోషల్ మీడియా వేదికగా దీనిని ప్రారంభించగా వెంటనే కేంద్రం నిషేధించిందని సైబర్ పోర్టల్ నిపుణులు చెబుతున్నారు. అయితే యువతను ఆకర్షించేదిగా వున్న కాక్రోచ్ జనతా పార్టీని సైబర్ నేరగాళ్లు తమకు అనుకూలంగా వాడుకుని ఫేక్ డిజిటల్ ఆర్గనైజేషన్ ముసుగులో లూటీలకు పాల్పడు తున్నట్లు సైబర్ పోర్టల్ నిపుణులు తెలిపారు.

## సర్వీస్ రిజిస్టర్ డిజిటైజేషన్‌కు గడువు పెంచాలి

### రాష్ట్ర ప్రభుత్వానికి టిజిహెచ్ఎంఎ విజ్ఞప్తి

**హైదరబాద్, మే 23,ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల సర్వీస్ రిజిస్టర్ల డిజిటైజేషన్ ప్రక్రియ పూర్తి చేసేందుకు నిర్ణయించిన గడువును ఈ నెల 31 నుంచి జూన్ 30 వరకు పొడిగించాలని తెలంగాణ గెజిటెడ్ హెడ్‌మాస్టర్స్ అసోసియేషన్ (టిజిహెచ్ఎంఏ) రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి. రాజభాను చంద్ర ప్రకాష్, ముఖ్య సలహాదారు డాక్టర్ పర్వతి సత్యనారాయణ శనివారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వినతిపత్రం సమర్పించారు. ప్రస్తుతం ఉపాధ్యాయుల సర్వీస్ రిజిస్టర్లలో నియామకాలు, ప్రొబేషన్ ప్రకటనలు, పదోన్నతులు, బదిలీలు, సెలవుల మంజూరు, వేతన సవరణలు, వార్షిక ఇంక్రిమెంట్లు తదితర అంశాలకు సంబంధించిన అనేక నమోదులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. డిజిటైజేషన్‌కు ముందు వాటిని పరిశీలించి, నవీకరించి, ధృవీకరించడం అవసరమన్నారు. అదనంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రస్తుతం హౌస్ లిస్టింగ్ ఆపరేషన్ (జనాభా గణన) కార్యక్రమంలో నిమగ్నమై ఉన్నారన్నారు. ఈ నేపథ్యంలో సర్వీస్ రిజిస్టర్ డిజిటైజేషన్ గడువును జూన్ 30 వరకు పొడిగిస్తూ ప్రభుత్వం అనుకూల నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి విజ్ఞప్తి చేసినట్టు రాజభాను తెలిపారు.

## ప్రభుత్వాన్ని రద్దు చేయాలని కెటిఆర్ సవాల్ విసరడం అర్థరహితం

### ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్

**హైదరాబాద్, మే 23,ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 2034 వరకు తానే సిఎంగా ఉంటాననీ ధీమా వ్యక్తంచేస్తే ప్రభుత్వాన్ని రద్దు చేసి ఎన్నికలకు రావాలని కెటిఆర్ సవాల్ విసరడం అర్థరహితమనీ ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్ విమర్శించారు. సిఎల్‌పిలో శనివారం మాట్లాడుతూ గోతికాడి నక్కలా అధికారం కోసం కెటిఆర్‌ఎదురు చూస్తున్నారనీ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మూడు రోజుల్లోనే ఈ ప్రభుత్వం కూలిపోతుందని బిఆర్ఎస్ నాయకులు అన్నారనీ గుర్తుచేశారు. ఇందిరమ్మ ప్రభుత్వాన్ని ఎందుకు రద్దు చేయాలనీ ఆయన ప్రశ్నించారు ఐదేళ్ల పాలన చేయాలని ప్రజలు తీర్పు ఇచ్చారనీ అన్నారు.. అవినీతి, దుర్మార్గ పాలన పైన ప్రజల పక్షాన కాంగ్రెస్ పోరాటం చేస్తే వచ్చిన రేవంత్ రెడ్డి నాయకత్వంలో వచ్చిన ప్రభుత్వం ఇదిఅని తెలిపారు.. ఎనిమిది లక్షల కోట్ల అప్పుల్లోకి రాష్ట్రాన్ని నెట్టారనీ అప్పుల కుప్పగా రాష్ట్రం ఉన్నప్పటికి ఇచ్చిన హామీలను మా ప్రభుత్వం నెరవేస్తోందనీ చెప్పారు ప్రజల ఆశీర్వాదం వల్లనే ప్రతి ఎన్నికల్లో గెలిచామనీ అన్నారు. పార్లమెంట్ ఎన్నికలు, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ ను చిత్తు చేశారనీ తెలిపారు. ప్రతి ఎన్నికల్లో మాకు ఓట్ల శాతం పెరిగిందనీ తెలిపారు సర్పంచ్ ఎన్నికల్లో గెలిస్తే పార్టీ గుర్తు పైన ఎన్నికలు వస్తే గెలుస్తామని బిఆర్ఎస్ నాయకులు గప్పాలు కొట్టారనీ మున్సిపల్ ఎన్నికల్లో ఓడించి చూపామని అన్నారు.. మాయ మాటలు, అబద్దపు ప్రచారంతో నిత్యం డైవర్ట్ రాజకీయాలు చేస్తున్నారనీ విమర్శించారు. బిఆర్ఎస్ పని అయిపోయిందని కవితనే బయటకు వెళ్లిపోయిందనీ అన్నారు. పార్టీ నుంచి హరీష్ రావును బయటకు పంపించే ప్రయత్నం జరుగుతోందనీ వాపోయారు.. కథా నాయకుడు ఫామ్‌హౌస్ నుంచి బయటకు రావడం లేదనీ ఎద్దేవా చేశారు. అసెంబ్లీకి హాజరుపట్టికలో సంతకం పెట్టి పోవడం తప్ప ప్రజల కోసం మాట్లాడింది లేదనీ అన్నారు. బిఆర్ఎస్ పార్టీ అసలు ఉంటుందా అనుమానం వ్యక్తంచేశారు రేవంత్ రెడ్డినే తెలంగాణ ఫ్యూచర్ అని ప్రజలు అంటున్నారనీ పిచ్చి మాటలు బంద్ చేసి కెటిఆర్ తన ఫ్యూచర్ ఏమిటో చూసుకోవాలనీ సలహా ఇచ్చారు.

## రెవెన్యూ శాఖలో ఆరుగురు డిప్యూటీ కలెక్టర్ల బదలీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 23:** తెలంగాణ రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో పలు అధికారుల బదిలీలు జరిగాయి,. రాష్ట్ర వ్యాప్తంగా అడ్మినిస్ట్రేటీవ్ గ్రౌండ్స్‌పై ఆరుగురు డిప్యూటీ కలెక్టర్లన బదిలీ చేస్తూ శనివారం ప్రభుతనం ఉత్తర్వులు జారీ చేసింది. కరీంనగర్ ఎస్‌డిసిగా పనిచేస్తున్న ఎస్.కిరణ్ ప్రకాశ్‌ను స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓగా బదిలీ చేశారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓగా పోస్టింగ్ ఆర్డర్స్‌లో ఉన్న ఆర్.వి. రాధాబాయిని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్‌కు బదిలీ చేస్తూ అక్కడ కుడా ఎస్‌డిసిగా ఉన్న వన్ ఇయర్ పీరియడ్ కోసం డిప్యూటేషన్‌పై నియమించారు. ప్రస్తుతం స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓగా ఉన్న డిఎస్ వెంకన్నను పరకాల ఆర్డీఓగా, మర్రిచెన్నారెడ్డి హెచ్‌ఆర్‌డి ఇన్‌స్టిట్యూట్‌లో అడ్మిస్ట్రేటీవ్ ఆఫీసర్‌గా డిప్యూటేషన్‌పై ఉన్న ఎన్.నిర్మలను ములుగు ఆర్డీఓగా బదిలీ చేశారు. ములుగు ఆర్డీఓగా పనిచేస్తున్న ఎన్.వెంకటేశ్‌ను హనుమకొండ ఆర్డీఓగా ట్రాన్స్‌పర్ చేయగా,. పరకాల ఆర్డీఓగా ఉన్న కె.నారాయణను తదుపరి పోస్టింగ్ కోసం ప్రభుత్వానికి రిపోర్ట్ చేయాల్సిందిగా ఉత్తర్వులో పేర్కొన్నారు.

# ప్రజలను నమ్మించడానికి వైసిపి అసత్యాల ప్రచారం:

## మంత్రి పయ్యావుల కేశవ్



**విజయవాడ,మే 23,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజలను నమ్మించడానికి వైసిపి అసత్యాలను ప్రచారం చేస్తూంటుందని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ వ్యాఖ్యానించారు.ఆ పార్టీకి గత ఎన్నికల్లో గట్టిగా బుద్ధి చెప్పినా వైసిపి నేత జగన్ విధానం మార్చుకోవడంలేదన్నారు. పయ్యావుల విజయ వాడలో మీడియాతో మాట్లాడుతూ వైఎస్ కుటుంబం సమాజంలో నిందితులే కానీ బాది తులు కాదని నేరమయ రాజకీయాలకు ఆద్యులే జగన్ కుటుంబమని ఆరోపించారు. ఫ్యాక్షన్‌ను రాజకీయాల్లోకి విస్తరించింది జగన్ తాత రాజా రెడ్డి. రాజకీయాల్లో హింసను కొత్త పుంతలు తొక్కించిన కుటుంబం జగన్‌ది అన్నారు. వినే వారుంటే స్వాతంత్ర్య సమర యోధుల కుటుంబమని జగన్ చెబుతారు. పులివెందుల పరిణామాలపై పుస్తకం విడుదల చేసే యోచనలో ఉన్నాం. గొడ్డలి పార్టీ వల్ల సమాజంలో తరాలు నష్టపోతున్నాయి. సమాజానికి గొడ్డలి పార్టీ హానికరమని గట్టిగా చెప్తున్నాం. అన్ని వ్యవస్థలపై గొడ్డలి వేటు వేసినందునే జగన్‌ది గొడ్డలి పార్టీ. జగన్ మంచివాడంటూ సెల్ఫ్ సర్టిఫికేట్ ఇచ్చుకోవటం విడ్డూరంగా ఉంది. రాష్ట్రంలో నేరమయ రాజకీయాలను మొదలుపెట్టిందీ, కొనసాగిస్తున్నదీ జగన్ కుటుంబమేనని మంత్రి పయ్యావుల కేశవ్ ఆరోపించారు. వైఎస్ కుటుంబం సమాజంలో నిందితుల స్థానంలో ఉందని, ఎంతమాత్రం బాధితులు కారని స్పష్టం చేశారు. గొడ్డలి పార్టీ వల్ల సమాజంలో తరాలు నష్టపోతున్నాయని అన్నారు. అందుకే పార్టీ సమాజానికి హానికరమని చెబుతున్నామన్నారు. శాంతిభద్రతలు, పరిశ్రమలు, రాజ్యాంగ వ్యవస్థలపై గొడ్డలి వేటు వేసిన పార్టీ కాబట్టే జగన్‌ది గొడ్డలి పార్టీ అని ధ్వజమెత్తారు. పొక్లెయిన్లు, బుల్‌డోజర్లను జగన్ కూల్చివేతలు, విధ్వంసానికి వాడితే.. చంద్రబాబు నిర్మాణం, అభివృద్ధికి వినియోగించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డిని ముద్దాయిని చేసిందే జగన్, తండ్రిని ముద్దాయిగా చేర్చా లని జగన్ కోర్టుకెళ్లిన విషయాన్ని ఉండవల్లి అరుణ్‌కుమార్ బయట పెట్టారు. రాజశేఖర్‌రెడ్డిని ముద్దాయిగా చేర్చిన న్యాయవాదికి ఉన్నత పదవి ఇవ్వలేదా, ప్రజలు జగన్ క్షుద్ర రాజకీయాలను గ్రహించినందునే ప్రతిపక్ష స్థానం కూడా ఇవ్వలేదు.

# మండే ఎండల్లో పెరుగుతున్న బీర్ అమ్మకాలు

**విజయవాడ, మే 23,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో బీర్ అమ్మకాలు గణనీయంగా పెరిగాయి. మండుతున్న ఎండల కారణంగా ప్రజలు చల్లని పానీయాలతో పాటు బీర్ వైపు మొగ్గ చూపుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఏప్రిల్ 2025తో పోలిస్తే ఏప్రిల్ 2026లో బీర్ అమ్మకాలు 31.44 శాతం పెరిగాయి. గత ఏడాది ఏప్రిల్‌లో 22.73 లక్షల కేసులు అమ్ముడవగా, ఈ ఏడాది అదే నెలలో 29.88 లక్షల కేసులు విక్రయమయ్యాయి. అలాగే మే నెలలో కూడా అమ్మకాలు భారీగా పెరిగాయి. మే 2025లో తొలి 22 రోజుల్లో 16.42 లక్షల కేసులు అమ్ముడవగా, మే 2026లో అదే కాలానికి 22.21 లక్షల కేసుల అమ్మకాలు నమోదయ్యాయి. ఇది 35.27 శాతం వృద్ధిని సూచిస్తోంది. తీవ్రమైన ఎండలు, అధిక ఉష్ణోగ్రతలు, వేసవి సీజన్ ప్రభావంతో బీర్‌కు డిమాండ్ పెరిగిందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. సాయంత్రం వేళల్లో వైన్ షాపులు, బార్ల వద్ద వినియోగదారుల రద్దీ కూడా పెరిగినట్లు సమాచారం.

# తిరుమల సమాచారం

## ముక్కోటి దేవతలకు ఆహ్వానంగా ధ్వజారోహణ మహోత్సవం



**తిరుమల,మే 23ప్రభాతవార్తప్రతినిధి:** వేద ఘోషలు, మంగళవాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ తిరుపతి గోవిందరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ఉదయం మిథున లగ్నంలో ధ్వజారోహణ మహోత్సవంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం గరుడ చిత్రం తో అలంకరించిన ధ్వజపటాన్ని ధ్వజ స్తంభంపై ప్రతిష్ఠించి బ్రహ్మోత్సవాలకు శుభారంభం పలికారు. అనంతరం స్వామి వారి ఆస్థానం ఘనంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి ధ్వజపటం, చక్రత్తాళ్వార్, పరివార దేవతలు వెండి తిరుచ్చిపై నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. ఈ దివ్య ఊరేగింపుతో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను స్వామివారే స్వయంగా పర్యవేక్షి స్తారనే ఆధ్యాత్మిక విశ్వాసం భక్తులను అలరించింది. అనంతరం అర్చకులు విష్వక్సేన ఆరాధన, వాస్తుహోమం, గరుడ లింగహోమం, గరుడ ప్రతిష్ఠ, రక్షాబంధనం తదితర వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. మిథున లగ్నంలో ధ్వజారోహణం నిర్వహించి 18 గణాలు, ముక్కోటి దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు. ఆ తరువాత ఉదయం 10.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి ఉత్సవమూర్తులకు వైభవంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు.

## వెంకన్నసేవలో విద్యాసాగరతీర్థస్వామి



**తిరుమల,మే 23ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని శనివారం ఉదయం ఉడిపి కృష్ణాపురమఠం పీఠాధిపతి విద్యాసాగర తీర్థ స్వామి శిష్యులతో కలసి దర్శనం చేసుకున్నారు. ఉదయం ఆలయం వద్దకు చేరుకున్న స్వామికి టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ పేష్కార్‌రామకృష్ణ, పారుపత్తేదార్ హిమత్‌గిరి అర్చకులు ఇస్తికఫాల్‌తో స్వాగతం పలికారు. ఆలయంలోపల తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించిన విద్యాసాగరతీర్థస్వామి శిష్యులతో కలసి శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ప్రజలంతా భక్తితో ఉండాలని, స్వామినామస్మరణతోనే ముక్తికలుగుతుందని తెలిపారు.

## మే 24న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**తిరుపతి,మే 23ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి అనుబంధంగా ఉన్న తిరుపతి జిల్లా నారాయణవనంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ శుద్ధి మహోత్సవం ఈనెల 24న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం వైభవంగా నిర్వహించనున్నారు. ఉదయం 8.15 గంటల నుండి మధ్యాహ్నం 12.45 గంటల వరకు ఈ పవిత్ర కార్యక్రమం జరుగనుంది. 28 నుండి జూన్ 5వ తేదీ వరకు జరగనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు ముందు ఆలయ పవిత్రత, శోభను మరింత పెంపొందించే ఉద్దేశంతో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆలయ సంప్రదాయంగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజా సామగ్రి తదితరాలను శుద్ధి జలాలతో పరిశుభ్రం చేస్తారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డకర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీగడ్డ వంటి సుగంధ ద్రవ్యాలను కలిపిన పవిత్ర జలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేస్తారు. కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం అనంతరం మధ్యాహ్నం 2.30 గంటల నుండి భక్తులను సర్వదర్శనానికి అనుమతించనున్నారు.

## తిరుమల చరిత్రలో రికార్డు స్థాయి దర్శనాలు

### - 87,689 మంది భక్తులు పరవశం



**తిరుమల,మే 23ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని శుక్రవారం అత్యంత ప్రాధాన్యమైన విశిష్టమైన అభిషేకసేవలో రికార్డుస్థాయిలో భక్తులు దర్శనం చేసుకున్నారు. తిరుమల చరిత్రలోనే శుక్రవారం రోజు 80వేలమందికి మించి దర్శనాలు కల్పించలేదు. అలాంటిది ఓ వైపు వేసవిసెలవులు కొనసాగుతుండటం...సాధారణ సర్వదర్శనాలకు 30గంటలు సమయం నిరీక్షిస్తున్నా శుక్రవారం వేకువజామున గోవిందుని అభిషేకసేవలోనూ సామాన్యభక్తులను సర్వదర్శనంలో అనుమతించి దేవుని దర్శనం చేయించడంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి,ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం,ఆలయవర్గాలు సఫలీకృతులయ్యారు. శుక్రవారం వేకువజామున నుండి అర్ధరాత్రి వరకు 87,689 మంది భక్తులు ఇష్టదైవాన్ని సంతృప్తికరంగా దర్శించుకోవడం విశేషం.మేనెలలోనే 1వతేదీ శుక్రవారం రోజు 71,008మంది భక్తులు, 8వతేదీ శుక్రవారం 67,222మంది భక్తులు, 15వతేదీ 75,688మంది భక్తులు మాత్రమే మహాలఘులో శ్రీవారిని దర్శించుకున్నారు. అలాంటిది 22వతేదీ శుక్రవారం ఏకంగా 87,689 మంది భక్తులు దర్శనం చేసుకోవడం రికార్డుగా నమోదైంది. కానుకల రూపంలో హుండీ ఆదాయం కూడా 4.29కోట్లు రూపాయలు చేకూరింది. వేసవిసెలవుల్లోనూ అనూహ్యంగా తిరుమలకు చేరుకుంటున్న భక్తులకు సాఫీగా, సంతోష దర్శనం చేయించడంలో అధికారులు ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నారు.

## వైభవంగా గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాలు



**తిరుమల,మే 23ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలో తిరుపతిలోని గోవిందరాజ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు మొదలయ్యాయి. బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని ఆలయ పరిసరాలను దివ్య విద్యుత్ కాంతులతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. శ్రీహరి దశావతార మహిమను ప్రతిబింబించే ఈ ప్రత్యేక అలంకరణలు భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచుతూ బ్రహ్మోత్సవాల వైభవాన్ని మరింత రెట్టింపు చేస్తున్నాయి. అనంతపద్మనాభ స్వామి, మహావిష్ణువు దశావతార రూపాలను కళాత్మక విద్యుత్ కాంతులతో తీర్చిదిద్దారు. మత్స్యావతారం, కూర్మావతారం, వరాహస్వామి, నరసింహావతారం, వామనావతారం, పరశురామావతారం, బలరామావతారం, హనుమాన్ రూపాలు దర్శనమిచ్చేలా రూపొందించిన విద్యుత్ అలంకరణలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. రైల్వే స్టేషన్ సమీపంలో వామనావతారం, రాయలచెరువు గేట్ జంక్షన్ వద్ద బలరామావతారం, బేరీవీధిలో పరశురాముడు, పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం వద్ద హనుమంతుని దివ్య రూపాలు ఆధ్యాత్మిక కాంతులను వెదజల్లుతున్నాయి. రామావతారం, కృష్ణావతారం, కల్కి అవతారం రూపాలు భక్తులకు భగవద్భక్తిని మరింతగా చాటుతున్నాయి. నాలుగు మాడవీధుల్లో విద్యుత్ ఆర్చ్‌లు, ఫ్లడ్‌లైట్లు, శోభాయమాన తోరణాలు, బాంబ్ స్టిక్స్, నడకదారుల వెంట ప్రత్యేక విద్యుత్ పందిళ్లు ఏర్పాటు చేశారు.

# సెకండరీ ప్రభుత్వాసుపత్రుల్లో సంక్లిష్ట శస్త్రచికిత్సల పరంపర

**- రిఫరల్స్ తగ్గించి సదరు ఆసుపత్రుల్లోనే రోగుల ఆరోగ్యానికి వైద్యుల భరోసా - మంత్రి సత్యకుమార్ యాదవ్ అభినందనలు - 32 వైద్య బృందాలకు ప్రశంసా లేఖలు పంపిన డి.ఎస్.హెచ్ కెవిఎన్ చక్రధరబాబు**

**విజయవాడ,మే 23,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రాంతీయ, ప్రాథమిక వైద్య కేంద్రాలు(ప్రభుత్వ సెకండరీ) ఆసుపత్రుల్లో సంక్లిష్టమైన శస్త్రచికిత్సలను వైద్యులు విజయవంతంగా నిర్వహిస్తున్నారు. సాధ్యమైనంత వరకు కేసులను రిఫర్ చేయకుండా కష్టతరమైన శస్త్రచికిత్సలను సైతం వైద్యులు సెకండరీ ఆసుపత్రుల్లో చేసేస్తున్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది జనవరి 31 నుంచి ఇటీవల వరకు జరిగిన వాటిలో 32 సంక్లిష్ట శస్త్ర చికిత్సలు ఉన్నట్లు నిశిత పరిశీలన అనంతరం డైరెక్టర్ ఆఫ్ సెకండ్ హెల్త్ ప్రధాన కార్యాలయం గుర్తించింది. అలాగే జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమల్లో 18 ఆసుపత్రులు ఉత్తమ పనితీరు కనబరిచినట్లు వెల్లడయింది. డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేవీఎన్ చక్రధరబాబు మొత్తం 50 వరకు అభినందన లేఖలు పంపారు. గిరిజన ప్రాంతంలో ఉన్న రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో టోటల్ నీ రీప్లేస్మెంటు జరిగింది. చింతపల్లి ఏరియా ఆసుపత్రిలో రెక్టల్ ప్రొలాప్స్, భారీ ఫైబ్రాయిడ్ హిస్టరెక్టమీ శస్త్రచికిత్సలను అక్కడ వైద్యులు విజయవంతంగా ముగించారు. ఇలా ప్రతిభ చూపిన వారికి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తిని నిరంతరం కొనసాగించాలని, సహచరులు కూడా ఇదేవిధంగా స్పందిస్తే రోగుల ఆరోగ్యానికి భరోసా మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. టీచింగ్ ఆసుపత్రుల్లో మాదిరిగా దీఠీబీ ఆసుపత్రులో ఆధునిక సౌకర్యాలు, ఆపరేషన్ థియేటర్లు, సూపర్ స్పెషాల్టీ వైద్యులు పూర్తి స్థాయిలో ఉండరు. అయినప్పటికీ దీఠీబీ వైద్యుల్లో కొందరు వృత్తిపట్ల నిబద్ధతను పాటిస్తూ పెద్దాసుపత్రులకు కేసులు రిఫర్ చేయకుండా స్థానికంగానే పరిమిత సౌకర్యాల మధ్య శస్త్రచికిత్సలు చేసేందుకు మొగ్గుచూపుతున్నారని డీఎస్ హెచ్ కేవీఎన్ చక్రధరబాబు నేడొక ప్రకటనలో తెలిపారు. దీనివల్ల రోగులకు వ్యయప్రయసాలు తగ్గుతున్నాయని, వారిపై ఆర్థిక భారం తగ్గుతుందని, విలువైన సమయం ఆదా అవుతుందని తెలిపారు. అలాగే అనారోగ్యం నుంచి త్వరగా కోరుకుంటున్నారని తెలిపారు. వృత్తిపట్ల నిబద్ధతను పాటించే వారిని తగిన ప్రమాణాలతో గుర్తించి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాలు అనుసరించి ఎప్పటికప్పుడు అభినందన లేఖలు పంపుతున్నామని వివరించారు. అన్నమయ్య జిల్లా రాజంపేట ఏరియా ఆసుపత్రి వైద్యులు కూడా సిజేరియన్ ద్వారా జరగాల్సిన ప్రసవాన్ని సహజ విధానంలో జరిగేలా చేశారు. ఓ మహిళకు తొలి కాన్పు సిజేరియన్ విధానంలో జరిగింది. రెండో కాన్పు కోసం ఇక్కడికి రాగా.. సహజ విధానంలో జరిగేలా వైద్యులు, నర్సులు కృషిచేశారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో ఓ రోగికి అరుదైన శస్త్రచికిత్స జరిగింది.

ఆసుపత్రిలో చేరిన సదరు రోగి శరీరం పై ఉన్న చర్మంలో 26 ఒకచోట తొలగించి, మరోచోట ట్రాన్స్ ప్లాంట్ చేశారు. ఇదే ఆసుపత్రిలో అరుదైన హెర్నియా రిపేర్స్ (స్పైజిలియన్, ఆభూరేటర్, సయాటిక్), సర్జరీ జరిగింది.

ఎమ్మిగనూరు ఏరియా ఆసుపత్రిలో కంటి వైద్యులు 16 నెలల్లో 511 క్యాటరాక్ట్ శస్త్రచికిత్సలు చేశారు.



డి.సిఎం పవన్ కల్యాణ్‌తో పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

# నాలుగు వారాల్లో పనితీరు చక్కదిద్దుకోండి

**పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజుకు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశం**

**విజయవాడ, మే 23,ప్రభాతవార్తప్రతినిధి:** పార్టీకి అప్రతిష్టను తీసుకుని వచ్చే అంశాలను సహించేది లేదనిఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేసారు.వ్యక్తిగత విషయాలతో బజారున పడటం బాధ్యత యుతమైన ఎంఎల్ఏ స్థాయిలో ఉన్న వారికి తగదన్నారు. పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా.. పోలవరం ఎమ్మెల్యేగా ఆయన పని తీరుపై డిప్యూటీ సీఎం సమీక్ష నిర్వహించారు. పోలవరం నియోజకవర్గం పరిధికి సంబంధించి పార్టీ దృష్టికి వచ్చిన విషయాలు, ఆరోపణలపై ఎమ్మెల్యేను పవన్ వివరణ అడిగినట్లు తెలుస్తోంది. తన వ్యక్తిగత విషయాలను కుటుంబ సభ్యులతో కలిసి కూర్చొని చక్కదిద్దుకొనేందుకు కొంత గడువు ఇవ్వాలని ఎమ్మెల్యే కోరగా,నాలుగు వారాల్లోగా చక్కదిద్దుకోవాలని పవన్ సూచించినట్లు సమాచారం. పోలవరం నియోజకవర్గంలోని పంచాయతీల్లో అభివృద్ధి పనులకు ఇప్పటి వరకు రూ.147 కోట్లు కేటాయించారు. ఆ పనుల పురోగతిపైనా డిప్యూటీ సీఎం సమీక్ష చేశారు. పనుల సకాలంలో వేగంగా పూర్తి చేయకపోవడంపై పవన్ ప్రశ్నించారు. అధికారులను సమన్వయం చేసుకుంటూ పనులను వేగవంతం చేస్తానని, వ్యక్తిగత వ్యవహారాలు చక్కదిద్దుకుంటానని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు బాలరాజు చెప్పారు.

# జూన్ 21న వినూత్నంగా 'యోగాంధ్ర - 26'

## 14 రోజులపాటు విస్తృతంగా యోగాపై ప్రచారం

**విజయవాడ,మే 23,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఈ ఏడాదిజూన్ 21న వినూత్నంగా నిర్వహిస్తున్నారు. ప్రతి ఒక్కరిలో యోగా పట్ల అవగాహన కల్పించే దిశ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది.చిన్నారుల నుంచి వృద్ధుల వరకు,మానసిక, శారీరక ఒత్తిడి గురయ్యే ప్రతి ఒక్కరిని యోగా లో భాగస్వాములను చేసేందుకు ప్రభుత్వం దశలవారి ప్రణాళికను సిద్ధం చేసింది. యోగా ప్రాధాన్యం గురించి తెలిపేలా ఆసనాలు, ప్రయోజనాలు, సందేశాలు, ఆరోగ్యకరమైన జీవనంపై అవగాహన కల్పించేలా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తుంది. ప్రతి ఒక్కరూ పాల్గొనేందుకు భారీ అవకాశాలు కల్పిస్తుంది. అదేవిధంగా ఈ ఏడాది కూడా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం "యోగాంధ్ర2026" పేరుతో ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. జూన్ 7 నుంచి జూన్ 20 వరకు మొత్తం 14 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలతో పాటు ప్రచార కార్యక్రమాలు కూడా నిర్వహించనుంది. జూన్ 21న అమరావతిలో 25,000 మంది భాగస్వామ్యంతో రాష్ట్ర స్థాయి యోగా కార్యక్రమం జరపనుంది. గ్రామాల నుంచి జిల్లా కేంద్రాల వరకు కోటి (10 మిలియన్ల) మంది ప్రజలను యోగా కార్యకలాపాల్లో భాగస్వామ్యం చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.ఈ సారి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని కొత్తగా కార్యక్రమాన్ని నిర్వహించాలని పూనుకుంది. అందుకోసం ప్రతి జిల్లాకూ ఒక నిర్దిష్ట సామాజిక వర్గాన్ని లేదా సమూహాన్ని వారికి నచ్చిన థీమ్‌ఎంచుకుంటూ "యోగాంధ్ర" కార్యక్రమాన్ని వినూత్న రీతిలో నిర్వహించడానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఉదాహరణకు విగిళి జిల్లాలో పోలీసు సిబ్బందితోనూ, తూర్పుగోదావరి జిల్లాలో ఖైదీలతో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. అయితే రాష్ట్రంలో 28 జిల్లాలు ఉన్నాయి. ఈ కార్యక్రమం ప్రతి ఒక జిల్లా నిర్వహిస్తుంది కాబట్టి, ప్రతి జిల్లా నుంచి 28 వినూత్న థీమ్‌లను చూసే అవకాశం రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందనే చెప్పవచ్చు. అంతేకాకుండా తప్పనిసరిగా ప్రతి జిల్లా కేంద్రంలోనూ కనీసం 1,000 మంది పాల్గొనేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. జిల్లావారిగా ఎన్టీఆర్ పోలీసులు,తూర్పుగోదావరి ఖైదీలు, అంబేద్కర్ కోనసీమ రైతులు, విశాఖపట్నం సైనికులు, మాజీ సైనికులు, అన్నమయ్య అంగన్వాడీ ఆరోగ్య కార్యకర్తలు. చిత్తూరు వైద్యులు, వైద్యాధికారులు, కృష్ణా ఆటో, లారీ డ్రైవర్లు,వైఎస్సార్ కడప కుటుంబాల్లో అన్ని తరాలతో, శ్రీకాకుళం మత్స్య కారులు, అల్లూరి సీతారామరాజు గిరిజనులు, పల్నాడు ఆశా, ఏఎన్ఎంలు, కాకినాడ ఉపాధ్యాయులు, నెల్లూరు రెసిడెన్షియల్ అసోసియేషన్, ఎన్జీవోలు, పోలవరం అటవీ ఉద్యోగులు,అటవీ కమిటీ సభ్యులు,. బాపట్ల యువత, సాంస్కృతిక కళాకారులు, విజయనగరం ఉపాధి హామీ శ్రామికులు శ్రీ సత్యసాయివ్యాపారులు అనకాపల్లిపారిశ్రామిక కార్మికులు.ఏలూరువిద్యార్థులు, అనంతపురం దివ్యాంగులు కర్నూలుపారిశుద్ధ్య కార్మికులు తిరుపతిసెలబ్రిటీలు నంద్యాలయోగా అసోసియేషన్ గుంటూరు ఇంజినీరింగ్ విద్యార్థులు పశ్చిమ గోదావరిఅథ్లెటిక్స్, క్రీడా బృందాలు ప్రకాశం డ్వాక్రా మహిళలు, మార్కాపురంపాడి రైతులు, పార్వతీపురం మన్యం వృద్ధులు అంశాలుగా యోగ కార్యక్రమాలు జరుగుతాయి. గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో యోగా పోటీలు ప్రభుత్వం నిర్వహిస్తుంది. విద్యార్థులు, క్రీడాకారులు, మహిళా స్వయం సహాయక బృందాలు, ఆరోగ్య కార్యకర్తలు, పారిశ్రామిక కార్మికులు, సమాజంలోని ఇతర వర్గాల ప్రజలు ఇందులో చురుకుగా పాల్గొనే అవకాశాలు ఉన్నాయి.

# తిరుపతిలో రోడ్డు ప్రమాదం

**- ఇద్దరు విద్యార్థులు దుర్మరణం**

**తిరుపతి(నారాయణవనం), మే 23 ప్రభాత వార్త ప్రతినిధి:** తిరుపతి జిల్లా పుత్తూరు-చెన్నై జాతీయ రహదారిలోని నారాయణవనం మండలం వెత్తలతడుకు పంచాయతీ రాళ్లకాలువ బ్రిడ్జి వద్ద శనివారం సాయంత్రం మోటారుసైకిల్‌ను కారు ఢీకొంది.ఈ ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు సంఘటనా స్థలంలోనే దుర్మరణం చెందారు. మృతి చెందిన వారిలో నారాయణవనం మండలం అరణ్యంకండ్రిగ పంచాయతీ గోవిందప్ప నాయుడుకండ్రిగ గ్రామానికి చెందిన ఎస్ యువరాజు(1'8), మరో విద్యార్థి ఎ యువరాజులుగా గుర్తించారు. అదే మోటారుసైకిల్‌పై ప్రయాణిస్తున్న మరో విద్యార్థికి తీవ్రగాయాలవడంతో పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించారు. ఈ ప్రమాద సంఘటనకు సంబందించి నారాయణవనం ఎస్ఐ గిరిబాబు కథనం మేరకు వివరాలు..జిఎన్‌కండ్రిగ గ్రామానికి చెందిన హరిబాబు కుమారుడు ఎస్ యువరాజు(18) డిగ్రీ మొదటి సంవత్సరం తిరుపతి ఎస్‌జి ఆర్ట్ కళాశాలలో చదువుతున్నాడు. వెంకటేష్ కుమారుడు ఎ యువరాజు ఇంటర్ చదువుతున్నాడు. అదే గ్రామానికి చెందిన ఉదయ్ డిగ్రీ చదువుతున్నారు. వీరు ముగ్గురు శనివారం సాయంత్రం స్థానకంగా వున్న శింగిరికోన లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి మోటారుసైకిల్‌లో వెళ్లారు. దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో రాళ్ల కాలువ బ్రిడ్జి వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న కారు మోటారు సైకిల్‌ను కొన్నది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడక్కడే దుర్మరణం చెందగా, మరోకరికి తీవ్రగాయాలు ఏర్పడినది. మృతదేహాలను పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి శవ పంచనామా కోసం తరలించారు. ప్రమాదానికి కారణమైన కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఎస్ఐ గిరిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రాహుకేతుదోష నివారణ పూజలు నిర్వహించిన కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి యడ్యూరప్ప



శ్రీకాళహస్తీశ్వరుని ప్రసాదాలను అందిస్తున్న ఎఇఓ మోహన్

**శ్రీకాళహస్తి,మే 23 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే మహిమాన్విత రాహుకేతుదోష నివారణపూజల్ని కర్నాటక మాజీ ముఖ్యమంత్రి యడ్యూరప్ప కుటుంబసభ్యులతో కలసి జరుపుకున్నారు. ఆయనతో పాటు షిమోగా ఎంపి రాఘవేంద్ర ఉన్నారు. వారికి రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్ సారధ్యంలో ఘనస్వాగతం ఏర్పాటు చేసారు. కాగా దక్షిణ గోపురం వద్ద ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టెసాయిప్రసాద్ సారధ్యంలో ఆలయ మర్యాదలతో వేదపండితులతో స్వాగతం పలికారు. ఆలయంలో నిర్వహించే మహిమాన్విత రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకోవాలని యడ్యూరప్ప కోరగా కోలా ఆనంద్ సారధ్యంలో ప్రత్యేక రాహుకేతుదోష నివారణ టిక్కెట్లు కొనుగోలు చేసి సహస్రలింగేశ్వరాలయం వద్ద పూజలు జరిపించారు. స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు.పూజల అనంతరం వారికి ఆలయ మర్యాదలతో మృత్యుంజయ స్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. వారికి కోలా ఆనంద్ సారధ్యంలో ధర్మకర్తల మండలి సభ్యుడు వాకచర్ల గురప్పశెట్టి,మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కండ్రిగ ఉమ,గరికపాటి రమేష్‌బాబు, వెంకటరమణానాయుడు,చాగణం శైలజలు స్వాగతం పలికారు. దేవస్థానం తరఫున ఎఇఓ మోహన్, ఎపిఆర్ఓ రవి, పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్‌లు స్వాగతం పలికారు. మాజీ ముఖ్యమంత్రి యడ్యూరప్ప అతిధి గృహంలో కొంత సేపు రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌తో చర్చించారు. అంధ్ర ప్రదేశ్‌లో బిజెపి పార్టీ అభ్యున్నతిని అలాగే కర్నాటకలో రాబోవు ఎన్నికల్లో బిజెపి జెండా ఎగురవేస్తుందని అధికారం చేపడుతుందని యడ్యూరప్ప కోలా ఆనంద్‌కు వివరించారు. నేడు భారత దేశంలోనూ, ప్రపంచ దేశాల్లో మన ప్రధాని నరేంద్రమోదీ విధానాలు ఎంతో ఆకర్షణీయంగా ఉన్నాయన్నారు. ఆయన తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజల్లో పార్టీని బలోపేతం చేసుకోవటానికి ఎంతో దోహద పడుతుందని మాజీ ముఖ్యమంత్రి కోలా ఆనంద్‌కు వివరించారు.

# అది రాజకీయ పార్టీ కాదు.. ప్రజల కోసం ఏర్పాటు చేసిన ఫోరం మాత్రమే

**కొత్త పార్టీ ప్రచారంపై క్లారిటీ ఇచ్చిన డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు**

**విజయవాడ, మే 23,ప్రభాతవార్తప్రతినిధి:** టీడీపీ నేత, ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణరాజు తన కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు చేస్తున్నారనే ప్రచారాన్ని పూర్తిగా ఖండించారు. గత రెండు మూడు రోజులుగా సోషల్ మీడియాలో, రాజకీయ వర్గాల్లో జరుగుతున్న ప్రచారంపై స్పందిస్తూ ఆయన స్పష్టత ఇచ్చారు. తాను రాజకీయ పార్టీ పెట్టబోతున్నానంటూ కొందరు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని రఘురామకృష్ణంరాజు మండిపడ్డారు. ప్రజలకు ఉచిత న్యాయ సహాయం అందించేందుకు మాత్రమే 'తెలుగువీర లేవరా' పేరుతో ఒక ఫోరం ఏర్పాటు చేశామని తెలిపారు. కొంతమంది న్యాయవాదులతో కలిసి ఈ ఫోరమ్‌ను ప్రారంభించామని చెప్పారు. ప్రత్యేకంగా తప్పుడు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి న్యాయ సలహాలు, మార్గదర్శకత్వం అందించడమే ఈ ఫోరమ్ ముఖ్య ఉద్దేశమన్నారు. తాను ఎదుర్కొన్న అనుభవాల దృష్ట్యా ఇతరులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఈ వేదికను ఏర్పాటు చేసినట్లు వివరించారు. అల్లూరి సీతారామ రాజు స్ఫూర్తితోనే 'తెలుగువీర లేవరా' అనే పేరును ఎంపిక చేశామని చెప్పారు.

# ధాన్యం కుప్పల మీదే కుప్ప కూలుతున్న రైతన్నలు: కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే23:** ధాన్యం కుప్పల మీదే రైతన్నలు కుప్ప కూలుతున్నారని.. రాష్ట్రంలో ప్రభుత్వ వ్యవస్థలు కుప్పకూలుతున్నాయని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ విమర్శించారు. రైతులు రాలిపోతున్న ఈ రాక్షస పాలనలో చలనం రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నదాతల చావులను చూసి ఆనందిస్తున్నావా.. ముఖ్యమంత్రి అని ప్రశ్నించారు. ఈ మేరకు శనివారం ట్వీట్ చేశారు. కొనుగోలు కేంద్రాల కాడ మండుటెండల్లో రైతుల గుండెలు ఆగిపోతున్నా ఈ కర్కశ ప్రభుత్వానికి కనికరం కలగడం లేదా అని కేటీఆర్ ప్రశ్నించారు. పంటలు కొనకుండా ఇంకెంత కాలంయాతన పెడతారని మండిపడ్డారు.

ఇంకెన్ని చావులు కావాలి..ఇంకెన్ని కుటుంబాలు రోడ్డున పడాలని ప్రశ్నించారు. దున్నపోతు మీద వానపడ్డట్టు ప్రవర్తించడం ఆపండని, పంట కొనుగోళ్లను పూర్తి చేసి. రైతన్నల తిప్పలు తప్పించాలన్నారు.

రుచి

# సమోసా రుచులెన్నో..

## ఆలూతో...



**కావాల్సినవి:** తగిన ఉల్లిపాయ- ఒకటి, తరిగిన పచ్చిమర్చి-మూడు, అల్లం తరుగు-చెంచా, ఆలూ-ఆరు, బఠాణీలు-పావు కప్పు, జీలకర్ర-అర చెంచా, కాజూ-గుప్పెడు, కిస్‌మిస్-ఏడెనిమిది, గరం మసాలా, చాట్ మసాలా-చెంచా చొప్పున, ఉప్పు-తగినంత, నూనె-వేయించడానికి సరిపడా.
**తయారీ :** ఆలుగడ్డలను శుభ్రంగా కడిగి కుక్కర్‌లో వేయాలి. ఇందులోనే బఠానీలను వేసి నాలుగైదు కూతలు వచ్చేవరకు ఉడికించాలి. ఇప్పుడు వీటిని చల్లార్చి పొట్టుతీసి మెదిపి పక్కన పెట్టుకోవాలి. పొయ్యి వెలిగించి పాన్ పెట్టి నూనె పోయాలి. అది వేడయ్యాక జీలకర్ర, కాజూ కిస్‌మిస్ వేసి వేయించాలి. ఇప్పుడు ఉల్లిపాయ, పచ్చిమిర్చి ముక్కలు, అల్లం తరుగు కూడా కలిపి మరికాసేపు వేయిస్తేసరి. ఉల్లిపాయలు కాస్త గోధుమ రంగులోకి వచ్చిన తర్వాత ఉడికించిన ఆలూ, బఠాణీలు కూడా వేసి కలపాలి. దీంట్లో గరంమసాలా, చాట్ మసాలా, ఉప్పు వేసి బాగా కలపాలి. అంతే సమోసాలకు మసాలా కూర సిద్ధమైనట్లే. ఈ కూరను త్రికోణాకారంలో చుట్టుకున్న చపాతీలో పెట్టి అంచులు మూసే యాలి. వీటిని కాగే నూనెలో వేసి బాగా వేయించు కోవాలి. గ్రీన్ చట్నీ టొమాటో సాస్‌తో తీసుకుంటే బాగుంటాయి.

## చికెన్‌తో...

**కావాల్సినవి :** చికెన్ ముద్ద-200గ్రా, నూనె-మూడు చెంచాలు, తరిగిన ఉల్లిపాయలు, పచ్చిమిర్చి ముక్కలు- రెండు చొప్పున, అల్లంవెల్లుల్లి ముద్ద- చెంచా, పసుపు-పావు చెంచా, కారం-చెంచాన్నర, గరంమసాలా, ధనియాల పొడి, జీలకర్ర పొడి-అరచెంచా చొప్పున, ఉప్పు- తగినంత, కొత్తిమీర తరుగు- కాస్తంత, నిమ్మ రసం- రెండు చెంచాలు. **తయారీ:** పాన్‌లో నూనె పోసి వేడయ్యాక ఉల్లిపాయ, పచ్చిమిర్చి ముక్కలు వేసి వేయించాలి. అల్లం వెల్లుల్లి ముద్ద జత చేయాలి. ఆ తర్వాత చికెన్ వేసి కలపాలి. దీంట్లో కారం, పసుపు, ధనియాల పొడి, గరంమసాలా, జీలకర్ర పొడి, తగినంత ఉప్పు, నిమ్మరసం వేసి బాగా కలపాలి. చికెన్ ఉడికిన తర్వాత చివరగా కొత్తిమీర తరుగు వేసి కలిపేయాలి. ఈ మిశ్రమాన్ని వేరొక గిన్నెలోకి తీసుకుని చల్లార్చాలి. ఇప్పుడు చపాతీ పిండిని తీసుకుని కోడిగుడ్డు ఆకారంలో కాస్త మందంగా పూరీలా చేసుకోవాలి. దీంట్లో చికెన్ మిశ్రమాన్ని కూర్చి సమోసాలా చేయాలి. ఇలా తయారుచేసి పెట్టుకున్న సమోసాలను వేడి నూనెలో మంటను మధ్యస్థంగా పెట్టి బంగారు రంగు వచ్చేవరకు వేయించాలి. వీటిని టొమాటో కెచప్‌తో తీసుకుంటే చాలా రుచిగ ఉంటాయి.





## చీజ్‌తో ..

**కావాల్సినవి :** ఉడికించిన బంగాళాదుంపలు-రెండు, ఉడికించిన స్వీట్‌కార్న్-కప్పు, చీజ్ తురుము-100 గ్రా, అల్లం తరుగు-చెంచా, తరిగిన పచ్చిమిర్చి-మూడు, కారం, జీలకర్రపొడి, చాట్ మసాలా-చెంచా చొప్పున, ఉప్పు-తగినంత, నిమ్మరసం-రెండు చెంచాలు కొత్తిమీర తరుగు-కొద్దిగా.
**తయారీ :** పెద్ద గిన్నె తీసుకుని పై పదార్థాలన్నింటినీ ఒకదాని తర్వాత మరొకటి వేసుకుంటూ బాగా కలిపి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు ఈ మిశ్రమాన్ని సమోసా ఆకారంలోచేసిన చపాతీలో పెట్టి అంచుటు మూసేయాలి. దీన్ని వేడి వేడి నూనెలో మంటను మధ్యస్థంగా పెట్టి లోపలి పదార్థాలనీ ఉడికేలా చేయించుకోవాలి.

**చిట్కా :** మొక్కలకు ఉదయం సాయంత్రపూట మాత్రమే నీరు పోయవలయును. ఎండ వేళలలో పోయరాదు.

# మేని ఛాయ మెరిసేట్టు.. !



ఆరోగ్యానికి పంచదార వగరు అయితే అందానికి మాత్రం మధురమవుతుంది. అదెలాగంటే

**ఎసెన్షియల్ ఆయిల్‌తో..** చర్మం పొడిబారి నిర్జీవంగా మారినప్పుడు చక్కెరని ఉపయోగించి తిరిగి దాన్ని సాధారణ స్థితికి తీసుకు రావచ్చు. దీనికోసం కొద్దిగా చక్కెర తీసుకుని అందులో మీకు నచ్చిన ఎసెన్షియల్ ఆయిల్ కొన్ని చుక్కలు వేసి బాగా కలపాలి. ఆ మిశ్రమాన్ని ముఖానికి రాసుకుని కాసేపు మృదువుగా మర్దన చేసుకోవాలి. తర్వాత చల్లని నీటితో ముఖం శుభ్రం చేసు కోవాలి. ఇలా చేయడం వల్ల చర్మం మళ్లీ కొత్త కళను సంతరించుకుంటుంది.

**లేలేత అధరాలకు....**
సాధారణంగానే పెదవుల మీద కొద్దిగా చక్కెర రాస్తే మృతకణాలు తొలగిపోయి మృదువుగా మారతాయి. కొద్దిగా చక్కెర తీసుకుని అందులో పాలు, తేనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమంతో రోజూ రాత్రి పూట పడుకొనే ముందు పెదవులకు మెల్లగా మర్దన చేసుకుంటే గులాబీ ల్లాంటి లేలేత అధరాలు సొంతమవు తాయి. అయితే ఈ చిట్కా ఎప్పుడో ఓసారి కాకుండా రెండు లేదా మూడు రోజులకోసారి పాటిస్తేనే సత్ఫలితాలు పొందవచ్చు.



**వృద్ధాప్య ఛాయలు రానీయకుండా...** చర్మం ముడతలు పడటం, సన్నని గీతలు కనిపించడం. వంటి లక్షణాలు ద్వారానే వయసు పైబుతోందన్న విషయం పైకి తెలుస్తుంది. చక్కెరని ఉపయోగించడం వల్ల చర్మం ముడతలు పడకుండా కాపాడుకోవచ్చు. అలాగే చక్కెర సన్నని గీతలు కూడా కనిపించకుండా చేస్తుంది. దీనికోసం కొద్దిగా చక్కెర తీసుకుని అందులో నిమ్మరసం వేసి ముఖానికి రాసుకోవాలి. ఆరిన తర్వాత తడి గుడ్డతో తుడుచు కోవాలి. ఇది సూర్మరశ్మిలో ఎక్కువ సమయం ఉండటం వల్ల ఎదురయ్యే ట్యానింగ్, పిగ్మెంటేషన్ వంటి సమస్యలకు కూడా చక్కని పరిష్కారంగా ఉపయోగపడు తుంది.



చర్మం రంగుని పెంచుకోవాలను కునేవారు కొద్దిగా గంధం తీసుకుని అందులో రోజ్‌వాటర్, చక్కెర చెంచా చొప్పున వేసి బాగా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి ప్యాక్‌లా అప్లై చేసుకోవాలి. 15 నుంచి 20 నిమిషాలు ఆరనిచ్చి తర్వాత చల్లని నీటితో శుభ్రం చేసుకోవాలి.

అంతర్వాణి

# ప్రేమతో ఆరాధిద్దాం !

జానీ హఠాత్తుగా ఇంగ్లీషు భాషను నేర్చుకోవాలనే తపన పుట్టింది. అదికూడా చాలాకొద్ది సమయంలోనే ఇంగ్లీషు మొత్తాన్ని నేర్చు కోవాలని ఆశించాడు. దీంతో ఇంగ్లీషు బాగా తెలిసిన వ్యక్తివద్దకు వెళ్లి తన కోరికను తెలిపాడు జానీ. అందుకు ఆవ్యక్తి జానీతో 'నేర్పిస్తాను అందుకు పదివేలు ఖర్చవుతుంది' అన్నాడు. అంతేకాదు ఒక నెలరోజులు నేర్చుకుంటే నీకు వస్తుంది అన్నాడు. కానీ జానీ 'నాకు వెంటనే రావాలి, నెలరోజులు నేను ఆగలేను' అన్నాడు. వీరిద్దరి సంభాషణలను దూరంగా నిలబడి ఓవ్యక్తి గమనించి, దగ్గరకు వచ్చి అడిగాడు. 'ఏంకావాలి?' అని, జానీ చెప్పాడు తనకు ఇంగ్లీషు నేర్చుకోవాలని ఉందని. వెంటనే ఆవ్యక్తి నేను నీకు రెండునిమిషాల్లో ఇంగ్లీషు నేర్పిస్తాను, అందుకు ఐదువేల రూపాయలు అవుతుంది అన్నాడు. వెంటనే జానీ ఐదువేల రూపాయల్ని ఇచ్చి, నేర్పించమన్నాడు. 'ఎస్', 'నో', 'ఆల్‌రైట్' అనే మూడు పదాలను నేర్పించి, ఈ మూడుపదాలను నేర్చుకుంటే ఇంగ్లీషు నీకు వచ్చినట్లే! అన్నాడు. 'ఇంత సులభమా!' అన్నాడు జానీ.ఇక జానీ తనకు ఇంగ్లీషు అంతా వచ్చేసింది అనే సంభరంలో రోడ్డుపై నడుస్తుంటే, పక్కన ఓ శవం కనిపించింది. ఆ శవాన్ని జానీ తదేకంగా చూస్తూ నిలబడ్డాడు. ఇంతలో ఓ పోలీసు అక్కడి వచ్చి 'నువ్వేనా ఈ హత్య చేసింది?' అని ప్రశ్నించాడు. అందుకు జానీ తనకు ఇంగ్లీషు మాట్లాడే అవకాశం దక్కిందని ఆనందంలో 'ఎస్' అన్నాడు. వెంటనే పోలీసు జానీని జడ్జి వద్దకు తీసుకెళ్లాడు. జడ్జి 'నువ్వు చంపుతున్నప్పుడు ఎవరైనా చూశారా?' అని అడిగాడు. అందుకు జానీ 'నో' అన్నాడు. వెంటనే జడ్జి ఆయనను జైల్లో ఉంచమని ఆజ్ఞాపించాడు. అందుకు జానీ 'ఆల్‌రైట్' అన్నాడు. ఇంకేమీ ఉంది, బాధతో జానీ జైల్లో ఊచలు లెక్కించ సాగాడు. ఇదిచదువుతుంటే నవ్వు అనిపిస్తుంది **దేవుడి గురించి ఏదో కొద్దికొద్దిగా తెలుసుకుని, ఆయనను ఆరాధించలేం, పూజించలేం. దేవుడి ప్రేమను లోతుగా అర్థం చేసుకున్నప్పుడే ఆయనను మనస్ఫూర్తిగా ఆరాధించగలం. లేకపోతే దేవుడిని వెంబడించడం భారంగా అనిపిస్తుంది. దేవా, మేము నీకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాము, నీవు సమీపముగా నున్నావని కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాము, నరులు నీ ఆశ్చర్యకార్యములను వివరించుదురు (కీర్తన 75:1).** దేవుడి ప్రేమను చూసేది కాదు, వినేదిఅంతకన్నా కాదు, హృదయపూర్వకంగా అనుభవించేదిగా ఉండాలి. అప్పుడే మనం దేవుడిని నిజంగా ఆరాధించగలం.

**- పి.వాణిపుష్ప**

# ఎసి వాడుతున్నారా?



భానుడి భగభగల నుంచి తప్పించుకోవ డానికి ఎసిల వినియోగం ఎక్కువై పోయింది. మరి చిన్నపిల్లలు ఉండే ఇళ్లలో వీటిని వాడొచ్చా... వాడితే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? ..

ఎసి ఉష్ణోగ్రత 24 డిగ్రీల నుంచి 26 మధ్యలోనే ఉండేట్లు చూసుకోవాలి. ఇదే పిల్లలకు ఆరోగ్య, సురక్షి తం కూడా. ఇంతకు మించి చల్లదనం ఎక్కువైతే... ఊపిరి తీసుకోవడంలో సమస్యలు ఎదురయ్యే అవకాశాలు ఎక్కువ. ఎయిర్ కూలర్ నుంచి వచ్చే గాలి... నేరుగా పిల్లలపై పడకూడదు. ఎసి వాడాలనుకున్నప్పుడు... ముందుగానే ఆన్ చేసి, గది వాతావరణం చల్లబడిన తర్వాతే పిల్లల్ని అక్కడికి తీసుకెళ్లాలి. ఒక్కసారిగా వాతావరణంలో వచ్చిన మార్పుల్ని తట్టుకోలేరు. ఎసిని ఎక్కువసేపు ఉపయోగిస్తే... గదిలో తేమ తగ్గిపోతుంది. దానివల్ల శ్వాసకోశ సమస్యలు వస్తాయి. హ్యుమిడిఫయర్‌ను వాడటం ద్వారా గాలిలో తేమను నియంత్రించవచ్చు. ఎసి ఫిల్టర్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ ఉండాలి. లేదంటే దుమ్ము, శస్త్ర చికిత్స చేరి... పిల్లల్లో అలజడి, ఇన్ఫెక్షన్లకు కారణమవుతుంది.

**చెలి**

సామాజిక పరిణామ క్రమంలో మహిళల పాత్ర ఎంతో అనిర్వచనీయమైనది. దానికి అందం చేకూర్చా లంటే స్త్రీ పాత్ర ఉండాల్సిందే! అందుకే మీ రచనలు పరిచయం చేయాలని 'వార్త' సంకల్పించింది. మహిళ సంబంధిత అంశాలపై వ్యాసాలు ఆహ్వానిస్తున్నాం. మీరు అనుసరించే జాగ్రత్తలు పాటించే చిట్కాలు, ఇతర ఏ అంశాలైనా మీ పేరుతో ప్రచురిస్తాం. ఈ మెయిల్: Cheli@vaartha.com

# కె 'పేట్రియాట్' జూన్ 5 నుంచి స్ట్రీమింగ్

జీ5 లో మలయాళ పొలిటికల్ థ్రిల్లర్ మూవీ 'పేట్రియాట్' జూన్ 5 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ప్రముఖ దర్శకుడు మహేష్ నారాయణన్ తెరకెక్కించారు. 18 ఏళ్ల తర్వాత మలయాళ సినీ దిగ్గజాలు మమ్ముట్టి, మోహన్‌లాల్ ఈ చిత్రంలో కలిసి నటించారు. నయనతార, ఫహాద్ ఫాజిల్, కున్‌చాకో బొబన్ తదితరులు ఇతర కీలక పాత్రల్లో నటించారు. పేట్రియాట్ మూవీ మలయాళంతో పాటు హిందీ, తెలుగు, తమిళం, కన్నడ భాషల్లో స్ట్రీమింగ్ కానుంది.దర్శకుడు మహేష్ నారాయణన్ మాట్లాడుతూ, 'పేట్రియాట్' మూవీ మనం ప్రస్తుత పరిస్థితుల ఆధారంగా తెరకెక్కించిన సినిమా. ప్రజలను రక్షించడానికి రూపొం దించిన టెక్నాలజీనే చివరకు భయం, నియంత్రణకు ఆయుధంగా మారే పరిస్థితులను ఈ సినిమాలో చూపించాం.



మమ్ముట్టి మాట్లాడుతూ 'పేట్రియాట్' మూవీ ఎంతో ప్రత్యేకమైన సినిమా. భారీ రేంజ్‌లో చేసిన మూవీ. రాజకీయ ఉత్కంఠ అనే అంశం మాత్రమే కాకుండా.. ఇది మనసాక్షి బాధ్యత, ధైర్యం గురించి చెప్పే బలమైన మానవీయ కథ. Lo ok i got unn మోహన్ లాల్ మాట్లాడుతూ 'పేట్రియాట్' ప్రస్తుతం మనం జీవిస్తున్న ప్రపంచం గురించి మాట్లాడే సినిమా. నిజం, అధికారం మధ్య జరిగే నిరంతర సంఘర్షణను ఆవిష్కరిస్తుంది.

# 'సందిగ్ధం' ట్రైలర్ లాంచ్



తీర్థ క్రియేషన్స్ బ్యానర్ పై సంధ్య తిరువీధుల నిర్మాణంలో పార్థసారధి కొమ్మోజు దర్శకత్వంలో 'సందిగ్ధం' సినిమా తెరకెక్కింది. ఈ చిత్రంలో నిహాల్, ప్రియా దేశ్ పాగ్, అర్జున్ సిహెచ్, కాజల్ తివారి మెయిన్ లీడ్స్‌లో నటించగా, విలన్ రోల్ లో తెర చేప ఫేమ్ నవీన్ సంకరపు నటించారు. ఈ మూవీని మే 29న రిలీజ్ చేయబోతోన్నారు. ..దర్శకుడు పార్థసారథి మాట్లాడుతూ.. 'సందిగ్ధం' ప్రయాణంలో నా భార్య సంధ్య ఎంతో సపోర్ట్ చేశారు. ప్రతీ ఒక్క ఆర్టిస్ట్ మా కోసం ఎంతో కష్టపడ్డారు. అందరూ సపోర్ట్ చేశారు. ఆర్టిస్టులు, టెక్నీషియన్లంతా కలిసి సపోర్ట్ చేయడం వల్లే సినిమాని ఇంత బాగా తీయగలిగాం. నిహాల్ మాట్లాడుతూ.. 'సందిగ్ధం' చిత్రీకరణలో నాకు దర్శక, నిర్మాతలు ఎంతో సపోర్ట్ చేశారు. వారిద్దరూ ఎన్నో కష్టాలను దాటుకుని మూవీని ఇక్కడి వరకు తీసుకు వచ్చారు. కాజల్ తివారి మాట్లాడుతూ..నాకు తెలుగు అంతగా రాదు. సెట్‌లో ప్రతీ ఒక్కరూ నాకు సపోర్ట్ చేశారు. అర్జున్ మాట్లాడుతూ.. 'సందిగ్ధం'లో సత్య అనే మంచి పాత్రను ఇచ్చిన దర్శకుడు పార్థుకి థాంక్స్. సంగీత దర్శకుడు గౌతమ్ రవిరామ్ మాట్లాడుతూ..'సందిగ్ధం' సినిమాలో మ్యూజిక్, ఆర్‌ఆర్ అద్భుతంగా ఉంటుంది. నటుడు ఆనంద్ మాట్లాడుతూ.. 'సందిగ్ధం' మూవీని అందరం కలిసి ఎంజాయ్ చేస్తూ షూటింగ్ చేశాం. నటుడు నవీన్ రాజ్ మాట్లాడుతూ.. 'సందిగ్ధం'లో నేను విలన్‌గా నటించాను. ఈ మూవీ చాలా బాగా వచ్చింది.

# 'లెనిన్' జూన్ 26న విడుదల



టాలీవుడ్‌లో కింగ్ నాగార్జున 40 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా అఖిల్ అక్కినేని ..టాలీవుడ్‌లో కింగ్ నాగార్జున 40 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా అఖిల్ అక్కినేని 'లెనిన్' టీజర్.. జూన్ 26న మనోడు వస్తున్నాడు. మనం ఎంటర్‌ప్రైజెస్ ఎల్ఎల్‌పి, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగ వంశీ నిర్మిస్తున్న చిత్రం 'లెనిన్' .అఖిల్ అక్కినేని, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటిస్తున్న ఈ సినిమాకు మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వం వహిం చారు. ఈ చిత్రం జూన్ 26న థియేటర్లలో ఘనంగా విడుదల కానుంది. ఇప్పటివరకు విడుదలైన పోస్టర్లు, పాటలు, గ్లింప్స్ అన్నీ కూడా ప్రేక్షకులలో ఆసక్తిని పెంచేశాయి. కింగ్ నాగార్జున సినీ జర్నీ ప్రారంభించి, టాలీవుడ్‌లో అడుగు పెట్టి నలభై ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా 'లెనిన్' నుంచి టీజర్‌ను విడుదల చేశారు. 'మనోడు వస్తున్నాడు' అనే డైలాగ్‌తో 'లెనిన్' టీజర్ మీద హైప్ పెరిగింది. నేను తప్పిపోయి రాలేదు మచ్చా.. మీ అందరినీ వెతుక్కుంటూ వచ్చిన అని చెప్పిన డైలాగ్‌తో హీరో పాత్రలోని ఇంటెన్సిటీని చూపించారు. స్టేజ్ మీద నాటకాల్లో భాగంగా సీనియర్ ఎన్టీఆర్ శక్తివంతమైన డైలాగ్‌లను భాగ్యశ్రీ బోర్సే చెప్పిన తీరు బాగుంది. అఖిల్, భాగ్యశ్రీల మధ్య కెమిస్ట్రీ చాలా ఫ్రెష్‌గా అనిపిస్తుంది. చిత్తూరు యాసలో అఖిల్ చెప్పిన డైలాగ్స్, ఆయన బాడీ లాంగ్వేజ్, రగ్డ్ లుక్ అన్నీ కూడా హైలెట్‌గా నిలిచాయి.అఖిల్ గత చిత్రాలతో పోలిస్తే ఈ 'లెనిన్'లో పూర్తి డిఫరెంట్ లుక్‌లో కనిపిస్తున్నారు. అఖిల్ డైలాగ్ డెలివరి, చిత్తూరు యాసను పలికించిన తీరు, మాస్ రగ్డ్ లుక్ ఇలా అన్నీ కూడా ఆడియెన్స్‌ని కట్టి పడేసేలా ఉన్నాయి. అద్భుతమైన విజువల్స్, తమన్ అందించిన ఆర్‌ఆర్ ప్రతీ ఒక్కరినీ ఆకట్టుకునేలా ఉన్నాయి. 'లెనిన్' ఇంటెన్స్ ఎమోషన్స్‌తో పీరియాడిక్ విలేజ్ డ్రామాగా రాబోతోందని టీజర్ చూస్తే తెలుస్తోంది.

# 'రావు బహదూర్' నుంచి 'ది వరల్డ్ ఆఫ్ రావు బహదూర్' రిలీజ్



సూపర్‌స్టార్ మహేష్ బాబు, నమ్రతా శిరోద్కర్ జిఎంబి ఎంటర్‌టైన్‌మెంట్, ప్రముఖ దర్శకుడు వెంకటేష్ మహా దర్శకత్వంలో, వెర్సటైల్ యాక్టర్ సత్యదేవ్ కథా నాయకుడిగా నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ సైకాలజికల్ థ్రిల్లర్ 'రావు బహదూర్' చిత్రాన్ని సగర్వంగా సమర్పిస్తు న్నారు. వెంకటేష్ మహా ఈ చిత్రానికి దర్శకత్వం వహించడమే కాకుండా కథ, ఎడిటింగ్ బాధ్యతలు కూడా నిర్వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఏ+ఎస్ మూవీస్, శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా నిర్మించాయి. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ గ్లింప్స్, అలాగే ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్న 'ఓ సుందరి' పాట సినిమాపై ఆసక్తిని మరింత పెంచాయి. తాజాగా మేకర్స్ ఇంటూ 'ది వరల్డ్ ఆఫ్ రావు బహదూర్' పేరుతో ఓ బీటీఎస్ వీడియోను విడుదల చేశారు. ఈ వీడియోలో చిత్ర నిర్మాణ వైభవం, ప్రీప్రొడక్షన్ పనులు, ప్రొస్తెటిక్ మేకప్, భారీ సెట్స్, షూటింగ్ విశేషాలను చూపిస్తూ సినిమా స్కేల్‌ను పరిచయం చేశారు. విజువల్‌గా అద్భుతంగా, పాత్రల ఆధారంగా నడిచే ఓ విభిన్నమైన సినిమాటిక్ అనుభవాన్ని ఈ చిత్రం అందించ బోతోందనే సంకేతాలు ఈ వీడియోలో కనిపిస్తున్నాయి.ఈ వీడియోలో ప్రధాన ఆకర్షణ సత్యదేవ్ చేసిన అద్భుతమైన ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్. సెట్స్‌కు వచ్చిన తర్వాత ఆయన ప్రత్యేక మేకప్, స్టైలింగ్ ప్రక్రియలో పాల్గొనే విధానాన్ని ఇందులో చూపించారు. ఈ వీడియోలో ప్రధాన ఆకర్షణ సత్యదేవ్ చేసిన అద్భుతమైన ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్. సెట్స్‌కు వచ్చిన తర్వాత ఆయన ప్రత్యేక మేకప్, స్టైలింగ్ ప్రక్రియలో పాల్గొనే విధానాన్ని ఇందులో చూపించారు.

# తెర

## విజయ్ ఆంటోనీ 'నాన్న కుట్టి'



ఫాదర్ అండ్ డాటర్ సెంటిమెంట్‌తో ము. మారన్ దర్శకత్వంలో విజయ్ ఆంటోనీ హీరోగా చేస్తున్న చిత్రం 'నాన్న కుట్టి' యాక్షన్, కుటుంబ భావోద్వేగాలు, ఇంటెన్స్ డ్రామాగా ఈ మూవీని రూపొందిస్తున్నారు. విజయ్ ఆంటోని ఫిల్మ్ కార్పోరేషన్ బ్యానర్ మీద మీరా విజయ్ ఆంటోని నిర్మాతగా ఈ సినిమా తెరకెక్కింది. ఈ మూవీకి సర్వంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్ అధినేత రామంజనేయులు జవ్వాజీ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం ఈ మూవీకి సంబంధించిన షూటింగ్ విజయవంతంగా పూర్తయింది.ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతు న్నాయి. చిత్ర బృందం ఆగస్టులో ఈ చిత్రాన్ని ఘనంగా థియేటర్లలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తోంది. ఫుల్ ఇంటెన్స్ ఎమోషనల్ యాక్షన్ పాత్రలో విజయ్ ఆంటోనీ కనిపించనున్నారు. ఈ కథ తండ్రీ కూతుళ్ల మధ్య ఉండే బంధాన్ని హైలైట్ చేస్తూ యాక్షన్ ప్రధానంగా ఈ మూవీని తెరకెక్కించారు. తాజాగా రిలీజ్ చేసిన పోస్టర్‌లో విజయ్ ఆంటోని కనిపిస్తున్న తీరు, రక్తంతో ఉన్న ఆ విధానం, ఆయన ఇంటెన్స్ లుక్స్ ఇవన్నీ కథ ఎంత డెప్త్‌గా ఉండబోతోందో చెప్పే ప్రయత్నం చేశారు.ఈ చిత్రంలో ప్రీతి అస్రాని, లిథన్య, భగవతి పెరుమాళ్, హరిప్రియ ఇసై, అరువి మదన్, చిత్ర లక్ష్మణన్, శ్రీజ రవి, వెట్టై ముత్తుకుమార్, జెన్సన్ దివాకర్, మురుగా నందం, మున్నార్ రమేష్, లిస్సీ ఆంటోని, కుమార్ నటరాజన్, విజయన్, ప్రవీణ, హరిత, హరిప్రియ తదితరులు ముఖ్య పాత్రల్ని పోషించారు.

## 'ఇట్లు అర్జున' ఫస్ట్ సింగిల్ మే 28న రిలీజ్



స్టార్ డైరెక్టర్ వెంకీ కుడుముల తన నిర్మాణ సంస్థ వాట్ నెక్స్ట్ ఎంటం టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న తొలి చిత్రం 'ఇట్లు అర్జున', న్యూ గై ఇన్ టౌన్" అనీష్ హీరోగా పరిచయం అవు తుండగా, మహేష్ ఉప్పల దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నారు. అనస్వర రాజన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రం టైటిల్ గ్లింప్స్‌తోనే మంచి బజ్ క్రియేట్ చేసింది. అక్కినేని నాగార్జున ఇచ్చిన పవర్‌ఫుల్ వాయిస్ ఓవర్ గ్లింప్స్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనం తరం విడుదలైన పోస్టర్లు, 'ఫైండింగ్ అర్జున' అనే స్పెషల్ వీడియో సినిమాపై మరింత ఆసక్తిని పెంచాయి.తాజాగా చిత్ర బృందం మ్యూజికల్ జర్నీకి శ్రీకారం చుడుతూ ఓ సరదా ప్రోమోను విడుదల చేసింది. పియానోపై ఓ ట్యూన్ వాయించేందుకు అనీష్ ప్రయత్నిస్తుండగా, మ్యూజిక్ సెన్సేషన్ 'ఓజీ' థమన్ ఎస్ కాఫీ మగ్ చేతిలో పట్టుకుని అతన్ని ఆసక్తిగా గమనిస్తుం టారు.ఆ తర్వాత ఇద్దరి మధ్య జరిగే ఫన్నీ సంభాషణ ఆకట్టుకుంటుంది. అనీష్ వాయిస్తున్న ట్యూన్‌ను చూసి సరదాగా ఆటపట్టించిన థమన్, అనంతరం తనదైన శైలిలో మ్యూజికల్ మ్యాజిక్‌ను రివిల్ చేశారు. ఆయన అందించిన సాఫ్ట్ మెలోడీ ఆకట్టుకుంటుంది. ఫస్ట్ సింగిల్‌ను మే 28న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు.ఈ చిత్రంలో హీరో పాత్ర చెవిటి, మూగ యువకుడు కావడంతో సంగీతం కథలో మరింత కీలక పాత్ర పోషించనుంది. థమన్ సంగీతంలో రూపొందుతున్న ఈ ఆల్బమ్ సినిమా భావోద్వేగా లను మరింత బలంగా ప్రేక్షకులకు చేరవేయనుంది.

# వినేశ్ కుస్తీకి గ్రీన్ సిగ్నల్

## ఢిల్లీ హైకోర్టులో ఊరట




**న్యూఢిల్లీ:** భారత రెజ్లింగ్ సమాఖ్యతో కుస్తీపట్లలో వినేశ్ ఫోగట్ విజయం సాధించింది. ఢిల్లీ హైకోర్టులో ఆమెకు ఊరట లభించింది. ఆసియా క్రీడల సెలెక్షన్ ట్రయల్స్‌లో పాల్గొనేందుకు న్యాయస్థానం రూట్ క్లియర్ చేసింది. ప్రధాన న్యాయమూర్తి డి.కె. ఉపాధ్యాయ, జస్టిస్ తేజస్ కరియాలతో కూడిన ద్విసభ్య బెంచ్.. వినేశ్‌ను ఆసియా క్రీడల ట్రయల్స్‌లో పాల్గొనేందుకు అనుమతించింది. కుస్తీ గోదాలోకి తిరిగి రీఎంట్రీ ఇవ్వాలనుకున్న వినేశ్ ఫోగట్... యూపీలోని గోండాలో జరిగిన జాతీయ ఓపెన్ రెజ్లింగ్ పోటీల్లో పాల్గొనేందుకు రెడీ అయింది. పోటీల కోసం యూపీకి సైతం వెళ్లింది. అయితే రెజ్లింగ్ సమాఖ్య వినేష్‌ను అడ్డుకుంది. పారిస్ ఒలింపిక్స్ ఫైనల్లో డిస్క్వాలిఫై అయిన వినేష్... రెజ్లింగ్ సమాఖ్య విధివిధానాలను పాటించలేదని నేపాన్ని నెగ్గి ఆమెపై వేటు వేసింది. దీని వెనక రెజ్లింగ్ సమాఖ్య మాజీ అధ్యక్షుడు బ్రిజ్ భూషన్ ఉన్నాడని ఆరోపించిన వినేశ్‌కు మద్దతుగా పలువురు మాజీ రెజ్లర్లు నిలిచారు.

**రెజ్లింగ్ సమాఖ్యకు చెంపదెబ్బ**

రెజ్లింగ్ సమాఖ్య తీరుపై ఢిల్లీ హైకోర్టును వినేశ్ ఫోగట్ ఆశ్రయించింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి డి.కె. ఉపాధ్యాయ, జస్టిస్ తేజస్ కరియాలతో కూడిన ద్విసభ్య బెంచ్ ముందు వాదనలు జరిగాయి. తల్లైన రెజ్లర్ల విషయంలో డబ్ల్యూఎఫ్ఐ నిబంధనలు అనుచితంగా ఉన్నాయని పేర్కొన్న ధర్మాసనం వినేశ్‌కు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ తీర్పునిచ్చింది. ఎంపిక ప్రక్రియను వీడియో రికార్డు చేయాలని రెజ్లింగ్ సమాఖ్యను కోర్టు ఆదేశించింది. భారత స్పోర్ట్స్ అథారిటీ, భారత ఒలంపిక్ సంఘానికి చెందిన స్వతంత్ర ప్రతినిధులు ట్రయల్స్‌ను పర్యవేక్షించాలని పేర్కొంది. మే 30, 31 తేదీల్లో ఆసియా క్రీడల సెలెక్షన్ ట్రయల్స్ జరుగనున్నాయి. ఆసియా క్రీడలతో పునరాగమనం చేయాలనుకున్న వినేశ్ ఫోగాట్ కల నిజమవ్వనుంది.

**ఫోగట్ కుస్తీమే సవాల్**

మహిళా రెజ్లింగ్‌కు పేరు తెచ్చిన వినేశ్ ఫోగట్...రెండుసార్లు ప్రపంచ ఛాంపియన్‌షిప్ మెడలిస్ట్. ఆసియా క్రీడల్లో స్వర్ణం, సిల్వర్ మెడల్స్.. కామన్‌వెల్త్ క్రీడల్లో మూడు స్వర్ణాలు, ఏషియన్ ఛాంపియన్ షిప్‌లో మెడల్స్‌తో మెరిశారు. 2024 పారిస్ ఒలింపిక్స్‌లో ఏకంగా ఫైనల్ చేరింది. అయితే ఫైనల్‌కు ముందు నిర్వహించిన వెయిట్‌లో వంద గ్రాములు ఎక్కువగా ఉందని వినేశ్ ఫోగట్‌పై అనర్హత వేటు పడింది. దీన్ని ఛాలెంజ్ చేసిన ఫోగట్... అదే ఏడాది అగస్టులో రెజ్లింగ్‌కు గుడ్‌బై చెప్పింది. రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చి 2024లో హర్యానాలోని జులానా నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2023లో డబ్ల్యూఎఫ్ఐ అప్పటి అధ్యక్షుడు భూషణ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలపై మహిళారెజర్లకు మద్దతుగా ఫోగట్ నిలిచింది.

# వైభవ్‌పైనే ఫోకస్

## నాలుగో బెర్త్ కోసం ముంబైతో రాజస్థాన్ కీలక పోరు



*ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో నేడు రెండు మ్యాచ్‌లు జరగనున్నాయి. వాంఖడే స్టేడియం వేదికగా జరిగే తొలి మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్, ముంబై ఇండియన్స్ తలపడనుండగా.. ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగే రెండో మ్యాచ్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్, ఢిల్లీ క్యాపిటల్స్ పోటీ పడతాయి. ప్లే ఆఫ్‌లోని నాలుగో బెర్త్ ఎవరిదన్నది ఈ మ్యాచ్‌లు తేల్చనున్నాయి. రాజస్థాన్, ముంబై మ్యాచ్‌తో ఇది తేలనుంది. దీంతో ఈ మ్యాచ్ తీవ్ర ఆసక్తి రేపుతున్నా... అందరి చూపు 15 ఏళ్ల కుర్రాడి పైనే.*

**ముంబై:** రాజస్థాన్ రాయల్స్ నాలుగో బెర్త్ అందుకుంటుందా? లేదా? అన్నది ముంబై ఇండియన్స్ తేల్చనుంది. ఇప్పటికే టోర్నీ నుంచి నిష్క్రమించిన ముంబై... సొంతగడ్డపై రాజస్థాన్‌రాయల్స్‌తో తలపడనుంది. ఈమ్యాచ్ గెలుపు ఓటములు ముంబైకు నామమాత్రమే. అదే రాజస్థాన్‌కు వస్తే ఈ మ్యాచ్‌లో గెలిస్తే 16 పాయింట్లతో నాలుగో జట్టుగా ముందంజ వేస్తుంది. లేదంటే కోల్‌కతా నైట్‌రైడర్స్-ఢిల్లీ మ్యాచ్ డిసైడ్ చేస్తుంది.

ఐపీఎల్ మొదటి దశ లీగ్ స్టేజ్‌లో చక్కని విజయాలు అందుకున్న రాజస్థాన్ రాయల్స్ వరుసగా హ్యాట్రిక్ ఓటములతో ప్లే ఆఫ్ అవకాశాలను క్లిష్టం చేసుకుంది. తప్పక గెలవాల్సిన లక్నోను ఓడించి రేసులో నిలిచింది. లక్నో ఉంచిన 220 పరుగుల భారీ లక్ష్యాన్ని కూడా రాజస్థాన్ అలవోకగా ఛేదించింది. ఈ క్రెడిట్ వైభవ్ సూర్యవంశీకే దక్కుతుంది. దీంతో మరోసారి వైభవ్ గెలిపిస్తాడన్న ధీమా రాజస్థాన్ ఫ్యాన్స్‌లో ఉంది.

రాజస్థాన్ బ్యాటింగ్‌కు ప్రధాన బలం ఓపెనర్లు యశస్వీ జైస్వాల్, వైభవ్ సూర్యవంశీలే. వీరు క్రీజ్‌లో ఓ పది ఓవర్లు ఉన్నా రాయల్స్‌కు తిరుగుండదు. గత మ్యాచ్‌లో స్వభావానికి భిన్నంగా వైభవ్ క్రీజ్‌లో నిలిచేందుకు ప్రాధాన్యత ఇచ్చాడు. ఈ ఆలోచన దొరణే బిగ్ ఇన్నింగ్స్ ఆడేందుకు ఉపయోగపడింది. ముంబైపై మ్యాచ్‌లోనూ వైభవ్ క్రీజ్‌లో నిలబడితే ముంబై బౌలర్లకు చక్కలే. ఇక యశస్వీ జైస్వాల్, ధృవ్ జురెల్ మరోసారి బ్యాటింగ్‌లో మెరవాల్సి ఉంటుంది. రియాన్ పరాగ్ చక్కని ఫామ్‌లో ఉండడం, సీనియర్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా అనుభవం ప్లస్ కానుంది. ఇక అర్చర్ రూపంలో ఆరంభంలోనే వికెట్లు తీయగల బౌలర్ ఉన్నాడు. అతనికి తోడు పెరీరా, సందీప్, యష్ రాజ్...ప్రత్యర్థి జట్టును కట్టడిచేయాల్సి ఉంటుంది. గత మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌పై 27 పరుగుల తేడాతో నెగ్గిన రాజస్థాన్ రాయల్స్.. దాన్ని రిపీట్ చేసి ప్లే ఆఫ్‌లో ప్రవేశించడంపై ఫోకస్ పెట్టింది.

**హెడ్ టు హెడ్**

ఇరు జట్లలో ముంబై ఇండియన్స్‌దే కాస్తంత పైచేయి. 32 మ్యాచ్‌ల్లో తలపడగా ముంబై 16 మ్యాచ్‌ల్లో, రాజస్థాన్ 15 మ్యాచ్‌ల్లో గెలుపొందాయి. అయితే వాంఖడేలో తలపడ్డ గత 9 మ్యాచ్‌ల్లో అయిదింటిలో రాజస్థాన్ రాయల్స్ విజయం సాధించింది.

**రాజస్థాన్ రాయల్స్:** యశస్వీ జైస్వాల్, వైభవ్ సూర్యవంశీ, ధృవ్ జురెల్, రియాగ్ పరాగ్(కెప్టెన్), ఫెరీరా, రవీంద్ర జడేజా, రవి సింగ్, జోఫ్రా అర్చర్, యష్ రాజ్, మఫాకా, సందీప్ శర్మ, నండ్రే బర్గర్

**ముంబై ఇండియన్స్:** ర్యాన్ రికల్టన్, రోహిత్ శర్మ, నమన్ ధీర్, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, విల్ జాక్స్, కార్బిన్ బాష్, దీపక్ చాహర్, జస్‌ప్రీత్ బుమ్రా, ఘజన్‌ఫర్, షార్దుల్ ఠాకూర్

# పంజాబ్ నెగ్గింది.. రాయల్స్ ఓడితేనే ఛాన్స్?

లక్నో: తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ జోరు చూపింది. లక్నో సూపర్ జెయింట్స్‌ను దాని సొంతగడ్డపై ఏడు వికెట్ల తేడాతో ఓడించింది. ఈ విజయంతో పంజాబ్ పాయింట్ల సంఖ్య 15కు చేరింది. అయినా ప్లే ఆఫ్ బెర్త్ కోసం రాజస్థాన్-ముంబై మ్యాచ్ ఫలితం కోసం వెయిట్ చేయాల్సిన పరిస్థితి. రాజస్థాన్ రాయల్స్ గెలిస్తే మాత్రం పంజాబ్ ప్లే ఆఫ్‌కు ముందే నిష్క్రమిస్తుంది.

197 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్‌ను ఆరంభంలోనే షమీ బెంబేలెత్తించాడు. ఇన్నింగ్స్ తొలి బంతికే ప్రియాన్ష్ ఆర్యను డకౌట్‌గా, రెండో ఓవర్లో కూపర్ కొన్నోలీ(18)ని క్లీన బౌల్డ్‌గా అవుట్‌చేశాడు. 22 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయిన పంజాబ్‌ను మరో ఓపెనర్ ప్రభ్ సిమ్రాన్ సింగ్(39 బంతుల్లో 69; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు)తో కలిసి కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్(51 బంతుల్లో 101 నాటౌట్; 11 ఫోర్లు, 5 సిక్స్‌లు) గెలుపు దిశగా నడిపించాడు. ఇద్దరూ లక్నో బౌలర్లపై విరుచుకు పడుతూ మూడో వికెట్‌కు 140 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని అందించారు. ప్రభు సిమ్రాన్‌ను అర్జున్ అవుట్ చేయగా, శ్రేయాస్ చివరి వరకు క్రీజ్ లో నిలిచాడు. దీంతో పంజాబ్ 18 ఓవర్లలోనే మూడు వికెట్లు కోల్పోయి గెలుపందుకుంది.



అంతకుముందు మొదట బ్యాటింగ్ చేసిన లక్నోకు పవర్‌ప్లేలోనే పంజాబ్ బౌలర్లు గట్టి షాక్ ఇచ్చారు. తొలి మ్యాచ్ ఆడుతున్న అర్షిన్ కులకర్ణి డకౌట్ కాగా, నికోలస్ పూరన్(2) మరోసారి నిరాశపరిచాడు. దీంతో 20 రన్స్‌కే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. కష్టాల్లో ఉన్న జట్టును ఆయుష్ బదోనీ తన మెరుపు బ్యాటింగ్‌తో ఆదుకున్నాడు. ముఖ్యంగా మార్కో జాన్సెన్ వేసిన పవర్‌ప్లే ఆఖరి ఓవర్లో 4, 6, 6, 2, 4 లతో ఏకంగా 24 పరుగులు సాధించాడు. కేవలం 18 బంతుల్లోనే 43 రన్స్ చేసిన బదోనీని చాహల్ కంగుతినిపించాడు. మరో ఎండ్‌లో ఓపెనర్ జోస్ ఇంగ్లిస్ పంజాబ్ బౌలర్లను వణికించాడు. నలుమూలలా షాట్లు ఆడుతూ కేవలం 29 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. మొత్తంగా 44 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్సులతో 72 పరుగులు చేశాడు. చివర్లో వచ్చిన ఇంపాక్ట్ ప్లేయర్ అబ్దుల్ సమద్ బౌండరీలతో విరుచుకుపడటంతో లక్నో 20 ఓవర్లలో 196 రన్స్ చేసింది.



# ఎట్టకేలకు అర్జున్ తెండూల్కర్ షో

**లక్నో:** క్రికెట్ దిగ్గజం సచిన్ తెండూల్కర్ తనయుడు అర్జున్ తెండూల్కర్‌కు ఎట్టకేలకు ఈ ఐపీఎల్ సీజన్‌లో ఆడడమే కాక అదరగొట్టాడు. లెఫ్టార్మ్ పేసర్ అయిన అర్జున్ పూర్తి కోటా 4 ఓవర్లు వేశాడు. 9 ఎకానమీతో 36 పరుగులిచ్చి ఓ వికెట్ పడగొట్టాడు. చివరి మ్యాచ్‌లో లక్నో తుది జట్టులోకి వచ్చిన అర్జున్ బ్యాటింగ్ లో 5 బంతులు ఎదుర్కొని 5 పరుగులు చేశాడు. ఆతర్వాత బౌలింగ్‌లో సత్తా చాటాడు. తొలి ఓవర్ మొదటి రెండు బంతులను డాట్స్ చేసిన అర్జున్... ఆ ఓవర్లో నాలుగు సింగిల్స్ మాత్రమే ఇచ్చి ఆకట్టుకున్నాడు. రెండో ఓవర్‌లో లయ తప్పి మాత్రం 15 పరుగులిచ్చినా.. మూడో ఓవర్లో జోరు మీదున్న ప్రభుసిమ్రాన్‌ను అద్భుత బంతితో ఎల్బీగా అవుట్ చేశాడు.

అర్జున్ తెండూల్కర్‌కు ఈ సీజన్‌లో ఇదే తొలి మ్యాచ్. కాగా ఇప్పటివరకు 6 ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడాడు. మొత్తంగా 4 వికెట్లు తీశాడు. 2021 ఐపీఎల్ వేలంలో అర్జున్‌ను ముంబై ఇండియన్స్ 20 లక్షల బేస్ ధరకు దక్కించుకుంది. 2022లో 30 లక్షలకు ముంబై రిటేన్ చేసుకుంది. 2023 సీజన్‌లో కోల్‌కతాపై తొలి మ్యాచ్ ఆడే అవకాశం దక్కింది. సన్‌రైజర్స్‌పై తొలివికెట్ సాధించి జట్టు విజయంలో కీ రోల్ పోషించాడు. 2024 సీజన్‌లో ఒకే ఒక మ్యాచ్ ఆడాడు. 2025లో లక్నో సూపర్ జెయింట్స్‌కు మారినా ఈ సీజన్‌లో కానీ అర్జున్‌కు ఆడే అవకాశం రాలేదు.

## 75వేల మద్దతు స్థాయిని

# బ్రేక్ చేసిన బిట్‌కాయిన్

**న్యూఢిల్లీ, మే 23:** క్రిప్టోకరెన్సీ మార్కెట్‌లో బిట్‌కాయిన్ అత్యంత కీలకమైన 75వేల మద్దతు స్థాయిని శనివారం బ్రేక్ చేసింది. అంతర్జాతీయ క్రిప్టో మార్కెట్ మానిటరింగ్ సంస్థ ట్రేడింగ్ వ్యూ లైవ్ చార్ట్ ఆధారాల ప్రకారం బిట్‌కాయిన్ ప్రస్తుతం 74,678 వద్ద ట్రేడవుతోంది. ఇటీవలి కాలంలో సాధించిన గరిష్ఠ స్థాయిల నుంచి ఇది ఒక గమనించదగ్గ పతనంగా అంచనావేస్తున్నారు. గడచిన రోజులుగా బిట్‌కాయిన్ 77,000 నుంచి 78,000 రేంజ్‌లో గట్టి పట్టు సాధించడానికి ప్రయత్నించింది. మార్కెట్లో కొనుగోళ్ల మద్దతు గట్టిగానే కనిపించింది. శనివారం మాత్రం భారీ పతనం చవిచూసింది. ఈ మధ్యాహ్నం తర్వాత మార్కెట్ సెంటిమెంట్ ఒక్కసారిగా మారిపోయింది. 76,500 స్థాయిల వద్ద ఉన్న సపోర్ట్‌ను బ్రేక్ చేస్తూ ధర నేరుగా 74,250 వరకు పడిపోయింది. ప్రస్తుతం అక్కడ నుంచి స్వల్పంగా కోలుకుని 74,678 వద్ద కొనసాగుతోంది. గ్లోబల్ ఫైనాన్షియల్ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చితి మధ్య బిట్‌కాయిన్ ఒడుదొడుకులను ఎదుర్కొంటోంది. ఈ తాజా పతనానికి ప్రధానంగా మూడు కారణాలు కనిపిస్తున్నాయి.



అంతర్జాతీయంగా నెలకొన్న ఆర్థిక పరిణామాలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు. పెద్ద పెద్ద సంస్థలు, ఇన్వెస్టర్లు తమ పెట్టుబడుల వ్యూహాలను మార్చుకోవడం. ఇటీవలి కాలంలో బిట్‌కాయిన్ దిగువ స్థాయిల నుంచి భారీగా పుంజుకోవడంతో, ట్రేడర్లు ఈ స్థాయిలో లాభాల స్వీకరణకు మొగ్గు చూపడం వంటి కారణాలను చెప్పుకొస్తున్నారు. సాధారణంగా బిట్‌కాయిన్ పతనమైతే దాని ప్రభావం మొత్తం క్రిప్టో మార్కెట్‌పై పడుతుంది. లైవ్ వాచ్‌లిస్ట్ డేటా ప్రకారం బిట్‌కాయిన్ పతనం కారణంగా ఇథీరియం మైనస్ రేంజ్‌లోకి వెళ్లగా, మిగిలిన ప్రధాన ఆల్ట్‌కాయిన్స్ కూడా తీవ్ర విక్రయాల ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. దీనివల్ల గ్లోబల్ క్రిప్టో మార్కెట్ క్యాపిటలైజేషన్ కూడా కొంత మేర కుంచించుకుపోయింది.

ప్రస్తుత మార్కెట్ సెంటిమెంట్ కాస్త ప్రతికూలంగా ఉన్నప్పటికీ, సుదీర్ఘ కాలంలో డిజిటల్ అసెట్ గా బిట్‌కాయిన్‌కు ఉన్న క్రేజ్ కొనసాగుతుందని ఇన్వెస్టర్లు భావిస్తున్నారు. స్వల్పకాలిక ట్రేడర్లు మార్కెట్ స్థిరీకరణ కోసం వేచి చూడాలని, ఇటువంటి సమయంలో ఎలాంటి భావోద్వేగ లేదా తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా, రిస్క్ మేనేజ్‌మెంట్‌ను కఠినంగా పాటించాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# మైక్రోసాఫ్ట్‌ను వీడుతున్న మెహదీ



**శాన్‌ఫ్రాన్సిస్కో, మే 23:** ప్రముఖ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్‌లో 35 ఏళ్లుగా పనిచేస్తున్న కీలక నిపుణుడు, కన్స్యూమర్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ యూసఫ్ మెహదీ తన పదవి నుంచి వైదొలుగుతున్నారు. ఉద్యోగులకు పంపిన ఒక అంతర్గత మెమోలో ఆయన తన నిర్ణయం వెల్లడించారు. మైక్రోసాఫ్ట్ చరిత్రలో అత్యంత సుదీర్ఘకాలం పని చేసిన వారిలో మెహదీ ఒకరు. వచ్చే ఏడాది జూన్ వరకు, మైక్రోసాఫ్ట్ తదుపరి ఆర్థిక సంవత్సరం ముగిసే వరకు ఆయన కంపెనీలో కొనసాగుతారు. ఈ సమయంలో ఏఐ ఆధారిత ఏజెంట్ల కోసం విండోస్‌ను పునర్ నిర్వచించడం, మైక్రోసాఫ్ట్ 365 వృద్ధి, వన్ కోపైలట్ విజన్‌ను ముందుకు తీసుకెళ్లడంపై దృష్టి సారిస్తానని తెలిపారు. సున్నితమైన మార్పు ప్రక్రియ కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇంటర్న్‌గా ప్రస్థానం మొదలుపెట్టిన మెహదీ మైక్రోసాఫ్ట్ చరిత్రలో అనేక కీలక భాగమయ్యారు. విండోస్ 95, సెర్చ్ ఇంజిన్ బింగ్, ఎక్స్‌బాక్స్ వన్, విండోస్ 10, ఇటీవలి కోపైలట్ ప్లస్ పీసీల ఆవిష్కరణలలో ఆయన కీలకపాత్ర పోషించారు. మైక్రోసాఫ్ట్‌లో 35 ఏళ్ల అసాధరణ ప్రయాణం తర్వాత నా తదుపరి సాహసయాత్రను ప్రారంభించడానికి ఇదే సరైన సమయమని నిర్ణయించుకున్నట్లు మెహదీ తన మెమోలో పేర్కొన్నారు. సీఈఓ సత్య నాదెళ్ల నేతృత్వంలో మైక్రోసాఫ్ట్ ఏఐపై భారీగా దృష్టి సారిస్తున్న తరుణంలో జరుగుతున్న నాయకత్వ మార్పులలో భాగంగానే యూసఫ్ మెహదీ నిష్క్రమణను విశ్లేషకులు చూస్తున్నారు.




## సెంట్రల్ బ్యాంకులో ఆఫర్ ఫర్ సేల్

# 8శాతం వాటా విక్రయం

**న్యూఢిల్లీ, మే 23:** లాభదాయకతలేని ప్రభుత్వరంగ సంస్థలు, బ్యాంకుల్లో వాటాలను తగ్గించుకునేప్రక్రియను కేంద్రం వేగవంతంచేసింది. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఒకటైన సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో కూడా ఆఫర్ ఫర్‌సేల్ పద్ధతిలో వాటాల్ని అమ్మేస్తుంది. శుక్రవారం రోజే నాన్ రిటైల్ ఇన్వెస్టర్లకు అందుబాటులోకి తీసుకొచ్చింది. అయితే ఇక్కడ ఇన్వెస్టర్ల నుంచి ఊహించని స్థాయిలో అదిరిపోయే రెస్పాన్స్ వస్తుండటంతో అదనంగా వాటా విక్రయించేందుకు సిద్ధమైంది. ముందుగా 4శాతం వాటానే విక్రయించాలని నిర్ణయించి మరో 4శాతం గ్రీన్ షూ ఆప్షన్ లేదా ఓవర్ సబ్‌స్క్రిప్షన్ ఆప్షన్ కింద ఉంచింది. ఇప్పుడు మంచిరెస్పాన్స్ లభించగా మిగతా 4శాతం వాటాను కూడా ఓఎఫ్ఎస్ కింద అంటే మొత్తం 8శాతం వాటాలను ఆఫర్‌ఫర్‌సేల్‌కింద విక్రయిస్తోంది. నాన్ రిటైల్ ఇన్వెస్టర్లకు షేర్లను విక్రయించేందుకు ఓఎఫ్ఎస్ ప్రక్రియ చేపట్టింది. ఇక్కడ మొత్తంగా 32.58 కోట్ల షేర్లను రిజర్వ్ చేయగా ఇలా అందుబాటులో ఉన్న షేర్లు 2 రెట్లకు మించి రెస్పాన్స్ వచ్చింది. మొత్తం 76.86 కోట్ల షేర్లకు బిడ్స్ దాఖలయ్యాయి. ముందురోజు క్లోజింగ్ ధర రూ. 33.92 తో చూస్తే చాలా తక్కువ ధరకే రూ. 31 నే ఫ్లోర్ ధరగా నిర్ణయించింది. మార్కెట్లో ఉన్న ధర కంటే కాస్త తక్కువకే షేర్లను కొనుగోలు చేసేందుకు అవకాశం కల్పిస్తోంది. వారాంతంలో మాత్రం షేరు ధర దాదాపు 8 శాతం తగ్గి రూ. 31.22 వద్ద స్థిరపడింది. ఈనెల 25 రెగ్యులర్ ఇన్వెస్టర్లు లేదా రిటైల్ ఇన్వెస్టర్లకు ఓఎఫ్ఎస్ అందుబాటులో ఉంటుంది. సోమవారం రోజు షేర్లకు బిడ్స్ దాఖలు చేసేందుకు వీలుంటుంది. ముందుగా 4 శాతం వాటా 36.20 కోట్ల షేర్లు అందుబాటులో ఉంచగా, ఇప్పుడు మరో 4శాతం అంటే మొత్తంగా 72.41కోట్ల షేర్లను అందుబాటులోకి తెచ్చింది.

# పెట్టుబడులకు లాంగ్‌టర్మ్ ఫండ్స్ మేలు

**ముంబయి, మే 23:** పెట్టుబడులకోసం స్టాక్ మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్, బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు, రియల్ ఎస్టేట్, గోల్డ్, ఆర్బీఐ సేవింగ్స్ బాండ్లు ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఉంటాయి. బ్యాంక్ ఎఫ్‌డీలు, పోస్టాఫీస్ పథకాలు వంటివి రిస్క్ లేకుండానే మంచి రిటర్న్స్ ఇస్తాయి. గోల్డ్, రియల్ ఎస్టేట్ వంటివి అనిశ్చితిలో ఉంటాయి. రిటర్న్స్ నిలకడగా ఉండవు. వీటికి ప్రత్యామ్నాయంగా స్టాక్ మార్కెట్లు, మ్యూచువల్ ఫండ్లు ఉన్నాయి. ఇక్కడ పెట్టుబడులు పెట్టే వారి సంఖ్య ఎక్కువగానే ఉంటుంది. రిస్క్ ఫ్యాక్టర్ ఎక్కువగానే ఉంటుంది. దానికి తగ్గట్లుగానే రాబడి కూడా ఆకర్షణీయంగా ఉంటుంది. ఇక్కడ చాలా వరకు లాంగ్ రన్ పెట్టుబడుల కోసమైతేనే ఇన్వెస్ట్ చేయడం మంచిది. స్వల్ప కాలంలో రిస్క్ ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంటుంది. ఇప్పుడు మే నెలలో పెట్టుబడులు పెట్టేందుకు టాప్ మ్యూచువల్ ఫండ్స్ కొన్ని మార్కెట్‌కు వచ్చాయి. వీటి పెర్ఫామెన్స్ తెలుసుకునేందుకు ఇన్వెస్టర్లు మూడేళ్ల రాబడుల్ని ప్రాతిపదికగా తీసుకుంటారు.

యాక్సిస్ స్మాల్ క్యాప్ ఫండ్ 2013 నవంబరులో లాంచ్ అయింది. గత మూడేళ్ల వ్యవధిలో ఇక్కడ సగటున వార్షిక ప్రాతిపదికన 24.5 శాతం రిటర్న్స్ అందించింది. 2009 డిసెంబరులో లాంఛ్ అయిన ఎస్బీఐ స్మాల్ క్యాప్ ఫండ్ సగటున వార్షిక ప్రాతిపదికన 23.4 శాతం రాబడి అందించింది. కోటక్ స్మాల్ క్యాప్ ఫండ్ చూస్తే సగటున గత మూడేళ్లలో వార్షికంగా 25.1 శాతం రాబడి ఇచ్చింది. నిప్పన్ ఇండియా స్మాల్ క్యాప్ ఫండ్ వార్షిక ప్రాతిపదికన సగటున 31.6 శాతం రాబడి అందించింది.




# టిసిఎస్ కొత్త విధానంపై ఉద్యోగుల్లో ఆందోళన

**ముంబయి, మే 23:** వరస లేఆఫ్స్‌తో టెక్ రంగంలో తీవ్రస్థాయి అనిశ్చితి నెలకొంది. ప్రస్తుతం దేశంలో అతిపెద్ద ఐటీ కంపెనీల్లో ఒకటైన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ నిర్ణయం ఉద్యోగుల్లో ఆందోళన పెంచుతోంది. వేరియబెల్ పే విధానాన్ని మార్చి, ఆఫీస్ హాజరుతో లింక్ చేయడంపై ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 6లక్షల మంది ఉద్యోగులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇప్పటి వరకు వేరియబుల్ పే రూపంలో నెలవారీగా లేదా క్వార్టర్లీ వారీగా అందుతున్న మొత్తాన్ని ఇప్పటి నుంచి మంత్లీ పర్ఫామెన్స్ పేగా మార్చారు. దీంతో ఉద్యోగులు ఆఫీస్ హాజరు, ప్రాజెక్ట్ డిప్లాయ్‌మెంట్ ఆధారంగా నిర్ణయించనున్నారు. దీని కారణంగా ఆఫీస్ తక్కువగా వచ్చే ఉద్యోగులకు టేక్‌హోమ్ సాలరీ తగ్గే అవకాశం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. మరోవైపు, ఈ ఏడాది టీసీఎస్ సాధారణంగా 5 శాతం నుంచి 8 శాతం వరకు జీతాలను పెంచినట్లు సమాచారం. మంచి పనితీరు కనబరిచిన ఉద్యోగులకు ఎప్లస్ కేటగిరీలో చేర్చి, 10 శాతం నుంచి 13 శాతం వరకు పెంచినట్లు తెలుస్తోంది. తక్కువ రేటింగ్ పొందిన వారికి కేవలం 2 శాతం నుంచి 3 శాతం వరకు మాత్రమే పెరిగినట్లు తెలుస్తోంది.




## రూ.2 వాటా రూ.250కి కొనుగోలు

# విప్రో బైబాక్ తేదీ ఖరారు

**బెంగళూరు, మే 23:** దేశంలోని అతిపెద్ద ఐటీ సంస్థ విప్రో ఇటీవల ఏప్రిల్‌లో 2025-26 ఆర్థిక సంవత్సరం క్యూ4 ఫలితాల్ని ప్రకటన సందర్భంలోనే షేర్ హోల్డర్లకు ఒక బంపర్ ఆఫర్ ప్రకటించింది. రూ.15 వేల కోట్ల విలువైన షేర్ బైబ్యాక్ ఆఫర్ చేయగా ఇప్పుడు దీనికి రికార్డ్ డేట్ ప్రకటించింది. 2026, జూన్ 5 ను రికార్డ్ డేట్‌గా నిర్ణయించింది. ఆతేదీ లోపు విప్రో షేర్లను కలిగి ఉంటే షేర్ బైబ్యాక్‌కు అర్హత సాధిస్తారు. విప్రో షేర్లను ఆ తేదీ లోపు కొనుగోలు చేసి డీమ్యాట్ ఖాతాలో ఉంచుకుంటే బైబ్యాక్‌కు అర్హత సాధిస్తారు. అర్హులైన షేర్ హోల్డర్లు ఇందులో టెండర్ ఆఫర్ ద్వారా పాల్గొనే అవకాశం లభిస్తుంది. ఈ మేరకు రికార్డు తేదీ గురించి స్టాక్ ఎక్స్ఛేంజీలకు విప్రో సమాచారం అందించింది. రూ. 2 ఫేస్ వాల్యూ (ముఖ విలువ) కలిగిన ఒక్కో షేరును రూ. 250 చొప్పున తిరిగి కొనుగోలు చేయనున్నట్లు ప్రకటించింది. మొత్తం 60 కోట్ల షేర్లను టెండర్ ఆఫర్ ప్రాసెస్ ద్వారా విప్రోనే తిరిగి షేర్ హోల్డర్ల దగ్గరి నుంచి కొనుగోలు చేస్తుంది.

విప్రో షేరు ధర వారాంతపు సెషన్‌లో రూ. 203 వద్ద ముగియగా.. దాని కంటే సుమారు 25 శాతం వరకు అధిక ధర చెల్లించి తిరిగి షేర్లను కొనుగోలు చేస్తుండటం విశేషం. ఈ లెక్కన షేర్ హోల్డర్లకు స్వల్ప కాలంలో మంచి లాభాలు వచ్చే అవకాశం ఉంటుంది. జనవరి మార్చి త్రైమాసికంలో విప్రో లాభం కూడా 2 శాతం తగ్గింది. మరోవైపు ఐటీ స్టాక్స్‌లో ఒకవైపు తీవ్ర అమ్మకాల ఒత్తిడి పెరిగిన సమయంలో విప్రో ఇలా బైబ్యాక్ ప్రకటించడం గొప్ప విషయంగా మార్కెట్ వర్గాల్లో చర్చ నడుస్తోంది. కంపెనీ తన సొంత వాటాలను బహిరంగ మార్కెట్ నుంచి లేదా ప్రస్తుత వాటాదారుల నుంచి నేరుగా తిరిగి కొనుగోలు చేసే ప్రక్రియనే షేర్ బైబ్యాక్ అంటారు. షేర్ బైబ్యాక్ ద్వారా కంపెనీ తన వద్ద ఉన్న మొత్తం షేర్ల సంఖ్యను తగ్గిస్తుందని చెప్పొచ్చు. ఇలా మార్కెట్లో షేర్ల సంఖ్య తగ్గడం వల్ల ఒక్కో షేరుపై వచ్చే ఆదాయం పెరుగుతుంది. ఇంకా కంపెనీనే అధిక ధర చెల్లించి తిరిగి కొనుగోలు చేయడం వల్ల వాటికి డిమాండ్ పెరిగి.. షేరు ధర మళ్లీ పెరిగే అవకాశం ఉంటుంది. డివిడెండ్ ద్వారా కంపెనీ తన లాభాల్ని షేర్ హోల్డర్లతో పంచుకునేందుకు ప్రత్యామ్నాయంగా షేర్ బైబ్యాక్ ఆప్షన్ ఎంచుకుంటుంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.